
ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 15.12.2025 | సంపుటి :12 సంచిక : 146 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# పల్లె పంచాయితీ తీర్పులో నెగ్గిన కాంగ్రెస్

## రెండో స్థానంలో బిఆర్ఎస్
## మహారాష్ట్ర బార్డర్‌గ్రామాలకే పరిమితమైన భాజపా

- స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్
- రెండో దశలోనూ భారీగా తరలివచ్చిన ఓటేసిన గ్రామీణం

**తొలివిడత పంచాయితీ ఫలితాలు**

| కాంగ్రెస్ | భారాస | భాజపా | ఇతరులు |
|---|---|---|---|
| 2383 | 1146 | 181 | 455 |

**రెండో విడత పంచాయితీ ఫలితాలు**

| కాంగ్రెస్ | భారాస | భాజపా | ఇతరులు |
|---|---|---|---|
| 2240 | 1186 | 268 | 624 |

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల హవా కొన సా గుతోంది. తొలి విడతలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకు ని జోష్ మీదున్న ఆపార్టీ.. రెండో విడతలోనూ విజయ పరంపర కొనసాగిస్తోంది. 193 మండలాల్లోని 3, 911 గ్రామ పంచాయతీ సర్పంచులు, 29,917 వార్డు సభ్యు ల పదవులకు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగిం ది వెలువడిన ఫలితాలను బట్టి.. కాంగ్రెస్ బల పర్చిన సర్పంచి అభ్యర్థులు 2235 పైగా, భారత రాష్ట్ర సమితి మద్ద తుతో 1185కు పైగా, భాజపా 267, ఇతరులు 623 పైగా స్థానాల్లో విజయం సాధించారు. మెదక్ మండలం చీపురుదు బ్బతండా గ్రామ సర్పంచి ఎన్నిక ఫలితం డ్రాలో తేలింది. మొత్తం 3 తండాల్లో కలిపి 377 ఓట్లు ఉండగా.. 367 ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన కేతావత్ సునీతకు 182, భారత రాష్ట్ర సమితి



## కాంగ్రెస్ పనితీరుకు ఫలితాలు నిదర్శనం

రెండో విడతలో ప్రజాతీర్పుపై మహేశ్‌గౌడ్ హర్షం

2లో..

## గుండె పోటుతో మరణించినా.. గెలిపించి నివాళి అర్పించారు

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ పంచాయతీలో అనూహ్య పరిణామం

మద్దతుతో పోటీ చేసిన బీమిలికి 182 ఓట్లు లభించాయి. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడం తో రిటర్నింగ్ అధికారి వెంకటయ్య డ్రా తీశారు. లాటరీలో కాంగ్రెస్ అభ్యర్థి సునీ తను అదృష్టం వరించింది. దీంతో ఆమె సర్పంచి గా ఎన్నికై నట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు .పరకాల ఎంపీడీవోపై హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ కోసం పయోగించే పెట్టెలకు గుర్తింపు స్టిక్కర్లు అంటించడంలో ఆలస్యం మిగతా 2లో..



# ఓట్ చోర్.. గద్దీ చోర్..

- మోదీ, అమిత్ షా ఇద్దరు కలిసి ఓట్లు దొంగిలించారు
- భాజపాతో ఎన్నికల కమిషన్ మిలాఖత్ :రాహుల్
- రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుదాం
- దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నరేంద్ర మోదీ, అమిత్‌షా ఓట్ చోరీకి పాల్పడుతు న్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ విషయం అందరికీ తెలుసని అన్నారు. ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఓట్ చోర్-గద్దీ ఛోడ్ పేరు దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మహా ధర్నాలో పాల్గొన్న రాహుల్ గాంధీ, ఆదివారం పలు వ్యాఖ్యలు చేశారు."మోదీ, అమిత్ షా ఓట్ చోరీకి పాల్పడుతున్నారని దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. హరియాణా ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగింది. యూపీకి చెందిన బీజేపీ నేతకు హరియాణాలోనూ ఓటు ఉంది. ఓటరు జాబితాలోని అక్రమాలపై ఈసీని ప్రశ్నిస్తే జవాబు లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి బీజేపీ కోసం పనిచేస్తున్నారు" అని రాహుల్ ఆరోపించారు.ఓటు చోరీ కేవలం ఓటు చోరీనే కాదు రాజ్యాంగం ఆక్రమణ అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కార్యకర్తల డీఎన్ఏలో సత్యం ఉందని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. తన పార్టీ సత్యం వైపు మిగతా 2లో..



*"ఎస్ఐఆర్, ఓట్ల చోరీ పేరుతో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, పేదల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ రోజు గాంధీజీ, అంబేద్కర్ వారి కోసం నిలబడ్డారు. ఇప్పుడు రాహుల్, మోదీ , అమిత్‌షాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు . ఆర్ఎస్ఎస్, ఆ గోల్వాల్కర్ భావజాలన్ని ఓడించేందుకు రామ్‌లీలా మైదానంలో మనం ఇక్కడికి ఒకటిగా చేరాం.*
*- సీఎం రేవంత్ రెడ్డి*

# ఇది పేదల ప్రభుత్వం

## సంక్షేమం, అభివృద్ధితో సామాన్యుల జీవితాల్లో వెలుగులు
## హుజూర్‌నగర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: మంత్రి ఉత్తమ్



**హుజూర్‌నగర్(జనంసాక్షి):** రాష్ట్రస్థాయిలోనే హుజూర్ నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచుతానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ సన్న బియ్యం, వేలాది కుటుంబాల కు కొత్త రేషన్ కార్డులు , ఇండ్లు ఇచ్చామన్నారు. విద్య, వైద్య, విద్యుత్, మౌలిక సదుపాయాలు రికార్డు స్థాయిలో కల్పించగలిగాము . గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు, గ్రామాల మధ్యలో రోడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు అనేకం చేశాము. వంద ల కోట్ల రూపాయలతో కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణం మొద లుపెట్టాం. పాత లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పూర్తిస్థాయిలో మరమ్మ త్తులు చేప ట్టాము. ఈ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం మిగిలిపోయిన మూడెండ్లలోనూ , వచ్చేసారి కూడా రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ హుజూర్ నగర్ నియోజవర్గ అభివృద్ధి కార్యక్రమాలు నెక్స్ట్ లెవెల్ కు తీసుకు పోయి హుజూర్ నగర్ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి , అవసరాలు తీర్చడానికి, రాష్ట్రస్థాయిలోనే హుజూర్ నగర్ నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా నిలబెట్టే నిరంతర ప్రయత్నం చేస్తాను. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించవలసిందిగా హుజూర్ నగర్ నియోజకవర్గ ఓటర్లందరికీ విజ్ఞప్తి చేశారు. మిగతా 2లో..

# ఆంధ్రా జలదోపిడిని అడ్డుకోవాలి



## మరో పోరాటానికి సిద్ధం కావాలి:కేసీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం కానుంది. డిసెంబర్ 19న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. కృష్ణా, గోదావరి జలాలతోపాటు సాగునీటి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అంతేకాకుండా.. తదుపరి నిర్మించబోయే తెలంగాణ ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చించనుంది. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలని కేంద్రం ముందు దేబరించడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయపడుతుంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 45 టీఎంసీలకు అంగీకరిస్తూ కేంద్రం వద్ద మోకరడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని బీఆర్ఎస్ భావిస్తోంది.రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ చెబుతోంది. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా పాలమూరు - రంగారెడ్డి నల్లగొండ ప్రజల రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో, తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపీలు ఉండి కూడా ఒక్కరూ మాట్లాడడం లేదని వ్యాఖ్యానిస్తోంది. ఇంకా చెప్పాలంటే... బీజేపీ.. తెలంగాణ ప్రయోజనాలను గండి కొడుతున్నట్లుగా ఉందని స్పష్టమవుతున్నదని బీఆర్ఎస్ చెబుతుంది. తెలంగాణ రాష్ట్రానికి సాగునీటి విషయంలో కాదు.. కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఆంధ్ర రాష్ట్ర జల దోపిడికి సహకరిస్తున్న బీజేపీ విధానాన్ని ఎదుర్కోవాలంటే.. తెలంగాణ సమాజం మరో సారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.

**మౌనం వీడనున్న బిఆర్ఎస్**


2023 ఏడాది జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో రాసి అధికారంలోకి వచ్చి ఉంటే.. ఈ పాటికి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీళ్లు అందడం ద్వారా మహబూబ్ నగర్, రంగారెడ్డి, మిగతా 2లో..



## రియల్ హీరో..

- ప్రాణాలను పణంగా పెట్టి.. ఉగ్రవాదులకు ఎదురొడ్డి..
- పలువురి ప్రాణాలు కాపాడిన అహ్మద్ అల్ అహ్మద్
- మరో ఉగ్రవాది కాల్పులు జరపడంతో తీవ్రగాయాలు





నడి రోడ్డుపై ప్రమాదం జరిగి గాయాలతో కొట్టుమిట్టాడుతుంటే.. సాయం చేసేందుకు చాలా మంది వెనుకాడుతుంటారు. ఎక్కడ పోలీసు కేసు అవుతుందోనని భయపడతారు. అలాంటిది ఇద్దరు సాయుధ ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పు లు జరుపుతుంటే.. సాధారణంగా ఎవరైనా తమ ప్రాణాలు కాపాడుకునేందుకే ప్రయత్నిస్తా రు. కానీ, సిడ్నీ ఉగ్ర కాల్పుల ఘటనలో 'రియల్ హీరో' అనిపించుకుంటున్న అహ్మద్ మిగతా 2లో..

# యూదులపై మళ్లీ ఉగ్రపంజా..



బీచ్‌లోని ప్రజలపై కాల్పులు జరుపుతున్న దుండగులు

- ఆస్ట్రేలియా బీచ్‌లో యూదుల హనుక్కా కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకొని దుండగుల కాల్పులు
- ఘటనలో 11 మంది మృతి.. పలువురికి గాయాలు

**సిడ్నీ(జనంసాక్షి):** ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 (స్థానిక కాలమానం ప్రకారం) గంటలకు కాల్పులు చోటు చేసుకొన్నాయి. దీనిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులు ఉల్లాసంగా గడుపుతున్న సమయంలో బీచ్‌లోకి ప్రవేశించిన ఇద్దరు గన్‌మెన్లు ఒక్కసారిగా ఫైరింగ్ మొదలుపెట్టడంతో వందల మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం నల్లటి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు షాట్‌గన్స్‌తో సర్ఫ్ క్లబ్ పక్కనే ఉన్న పాదచారుల వంతెనపైకి చేరుకొని కాల్పులు జరిపారు. అక్కడ జరుగుతున్న ఒక ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ప్రాథమిక సమాచారం మేరకు 11 మంది మృతి చెందినట్లు ఆస్ట్రేలియా పత్రికలు పేర్కొన్నాయి. వెంటనే రంగంలోకి దిగిన భద్రతా దళాలు దుండగులను అదుపులోకి తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో క్షతగాత్రులను కాపాడేందుకు హెలికాప్టర్లు, 30 అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకొన్నాయి.బాండి బీచ్‌లో యూదులు జరుపుకొంటున్న హనుక్కా వేడకలను దుండగులు లక్ష్యంగా చేసుకొన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్థానిక యూదులు హాజరయ్యారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ కమిషనర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌తో మాట్లాడినట్లు వెల్లడించారు. దుండగుడిని గుర్తించిన భద్రతా బలగాలు బాండి బీచ్‌లో కాల్పులకు తెగబడిన ఇద్దరు దుండగుల్లో ఒకరిని సిడ్నీ భద్రతా బలగాలు గుర్తించాయి. నిందితుడు 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. వివిధ కోణాల్లో అతడిని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. గత కొన్నేళ్లలో పలు చోట్ల జరిగిన కాల్పులపైనా ఆరాతీస్తున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. మరోవైపు సిడ్నీలోని అక్రమ్ ఇంట్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు.

**ఇజ్రాయెల్‌లో బయటపడి.. ఆస్ట్రేలియాలో చిక్కి!**

ఆస్ట్రేలియాలోని ఓ బీచ్‌లో యూదుల వేడుకలను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన కాల్పులు మిగతా 2లో..

# తెలంగాణ సంస్కృతిలో హత్య రాజకీయాలకు తావివ్వొద్దు

- ఓటమి భయంతోనే బీఆర్ఎస్‌పై దాడులు
- మేము తిరగబడితే తట్టుకోలేరు
- మల్లయ్యకుటుంబాన్ని ఆదుకుంటాం
- మా ప్రభుత్వం రాగానే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తాం: కేటీఆర్



**నూతనకల్(జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతిలో హత్యా రాజకీయాలకు తావివద్దని దిక్కుమాలిన రాజకీయాలను పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలి తప్ప బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని బిఆర్ఎస్ కార్య నిర్వాహ అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు, ఆదివారం నూతనకల్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ఈనెల 8న సర్పంచి ఎన్నికల సందర్భంగా హత్యకు గురైన బిఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉప్పుల మల్లయ్య యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి మాట్లాడారు , ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయల మిగతా 2లో..

## ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర: కవిత

12లో..

## ఆశ ఉండాలి కానీ.. అత్యాశ వద్దు

కవితకు మహేశ్‌కుమార్ గౌడ్ కౌంటర్

2లో..

## భాజపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

ప్రధాని మోదీ శుభాకాంక్షలు

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
15.12.2025

# ఆంధ్రా జలదోపిడిని అడ్డుకోవాలి

నల్గొండ జిల్లాల ప్రజల ప్రయోజనాలు కాపాడబడేవని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. కానీ ప్రస్తుతం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం .. ఈ మూడు జిల్లాల ప్రయోజనాల పట్ల పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం వల్ల పూచిక పొల్లంత పని కూడా చేయలేక పోవడం వల్ల ఆ ప్రాంతం ప్రజలు, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు గడిచినా కూడా, తెలంగాణ రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తుండడంపై ఇంకా తెలంగాణ సమాజం మౌనం వహించజాలకూడదని ఆ పార్టీ అభిప్రాయపడుతుంది.

**నీటి వాటాలపై కీలక నిర్ణయాలు**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు, కృష్ణా జలాలలో కేవలం 45 టీఎంసీలు ఒప్పుకోవడం అనేది ఘోరమని అభివర్ణించింది. కాబట్టి సాగునీరు తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను కాపాడే విషయంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నటికీ రాజీ పడబోదని ఆ పార్టీ స్పష్టం చేసింది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఈ కీలక అంశాలపై కూలంకుషంగా చర్చ జరగనుంది. అలాగే అందుకు అనుగుణంగా చేపట్ట బోయే ప్రజా ఉద్యమాల నిర్మాణం, అనుసరించాల్సిన కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం, జలాల కేటాయింపు, గోదావరి కృష్ణా జలాల విషయంతోపాటు ఆంధ్ర జల దోపిడిపై పోరాడేందుకు.. ఒక ఉద్యమ స్వరూపానికి ఈ సమావేశంలో శ్రీకారం చుట్టడం జరుగుతుంది. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది.

# ఆశ ఉండాలి కానీ.. అత్యాశ వద్దు

**కవితను ఉద్దేశించి మహేశ్‌కుమార్ గౌడ్**



దిల్లీ(జనంసాక్షి) : ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందితే ఏ రాష్ట్రం కూడా మనతో పోటీ పడలేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. దిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. "తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి విజన్ ఉంది. మా పాలన పట్ల రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినన్నీ సంక్షేమ పథకాలు ఎక్కడా లేవు. హైదరాబాద్ అన్నివిధాలా బాగుంది.. సీఎం విజన్‌తో భూమ్ పెరుగుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకే.బీఆర్ఎస్ మీద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎదురుదాడి చేస్తోంది. జైలుకు వెళ్లిన ఆమె.. సీఎం కావాలని అనుకుంటున్నారు. ఆశ ఉండాలి కానీ.. అత్యాశ ఉండొద్దు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు ఉంటే కవిత బయటకు ఎందుకు వస్తారు? నానాటికీ ఆ పార్టీ బలహీనపడుతోంది.. క్షేత్ర స్థాయిలో వారికి కేడర్ లేదు. ఓడిపోతామని తెలిసే జూబ్లీహిల్స్‌లో కేసీఆర్ ప్రచారానికి రాలేదు. తెలంగాణలో భాజపా ఎప్పటికీ అధికారంలోకి రాదు. ఎస్ఐఆంతో సామాన్యులు ఇబ్బందిపడు తున్నారు. 10 కిలోల దొడ్డు బియ్యం తప్ప భాజపా పాలిత రాష్ట్రాల్లో సంక్షేమం లేదు" అని విమర్శించారు.

# పల్లె పంచాయితీ తీర్పులో నెగ్గిన కాంగ్రెస్



చేయడంపై ఆమెను నిలదీశారు. పరకాల మండలం నాగారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని చల్లబర్చారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తన స్వగ్రామం ఝరాసంఘంలో తోటి గ్రామస్థులతో కలిసి లైన్‌లో నిలబడి ఓటు వేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్‌లో బీఆర్ఎస జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తన స్వగ్రామం కొరివిపల్లి ఓటు వేశారు. చేగుంట మండలం రుక్మాపూర్‌లో ప్రశాంత్‌రెడ్డి అనే వ్యక్తి సింగపూర్ నుంచి వచ్చి ఓటేశారు. సిద్దిపేట జిల్లా పోతారంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బొప్పాపూర్‌లో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు దంపతులు ఓటు వేశారు. భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రెండో విడత పల్లెపోరు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తమ గ్రామ పరిపాలకు లను ఎన్నుకునేందుకు ఉత్సాహంగా ఓటేశారు.

## గుండె పోటుతో మరణించినా.. గెలిపించి నివాళి అర్పించారు

**రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ పంచాయతీలో అనూహ్య పరిణామం**

**రంగారెడ్డి (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. 8వ వార్డు సభ్యురాలిగా పోటీ చేసిన పల్లె లత(42) ఈనెల 7వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో ప్రత్యర్థి పల్లె అనితపై లత 30 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 7వ తేదీ సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. 8వ వార్డుకు తిరిగి నోటిఫికేషన్ నిర్వహించి ఎన్నిక నిర్వహిస్తామని ఎంపీడీఓ వెంకయ్య తెలిపారు.పంచాయతీ ఎన్నికల సందర్భంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కోనాయిపల్లెలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారంటూ కాంగ్రెస్, భాజపా వర్గాలు వాగ్వాదానికి దిగాయి. ఇది క్రమంగా ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల కార్యకర్తలు పరస్పరం దాడి చేసుకున్నారు. అక్కడే పోలీసులు వారిని చెదరగొట్టారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

## కాంగ్రెస్ పనితీరుకు ఫలితాలు నిదర్శనం

**- రెండో విడతలో ప్రజాతీర్పుపై మహేశ్‌గౌడ్ హర్షం**

**హైదరాబాద్(జనంసాక్షి):** రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పునకు సంకేతాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే ఘన విజయం సాధించడం.. ప్రభుత్వ పాలనపై గ్రామీణ ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు."పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు విస్తరించిన ప్రచార వ్యూహాలే ఈ విజయానికి ప్రధాన కారణం. ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజల్లో ఏర్పడిన సంతృప్తిని మరోసారి రుజువు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన. సంక్షేమ–అభివృద్ధి పథకాలు.. నేరుగా ప్రజలకు అందుతున్నాయి. ప్రజాసంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంతో ఇస్తున్న పాలన ప్రజలకు నమ్మకాన్ని కలిగించింది. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా ప్రతిఫలించింది. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచింది. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.

# తెలంగాణ సంస్కృతిలో హత్య రాజకీయాలకు తావివ్వద్దు

చెక్కు పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో నిజంగానే అద్భుతమైన పరిపాలన అందించి ఉంటే కేవలం సర్పంచ్ ఎన్నికలకు భయపడి హత్యా రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు, కాంగ్రెస్ నాయకులు చెబుతున్న విధంగా రాష్ట్రంలో రేషన్ కార్డులు, రుణమాఫీ తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్న అదే వాస్తవం అయితే ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకి ఉంటుందని అన్నారు కానీ సర్పంచ్ ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు ఎందుకు భయపడుతున్నారని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా 6 గారంటీల అమలు, 420 హామీలు అమలు చేసి ఉంటే వారికి ప్రతి గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పట్టే వారిని అన్నారు, కానీ పంచాయతీ ఎన్నికలకు భయపడి దౌర్జన్యాలకు కాంగ్రెస్ నాయకులు దిగుతున్నారని ఈ విషయాన్ని ఎప్పుడు మీ రోజులు ఉండవని మా రోజులు కూడా వస్తాయని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. మేము 10 సంవత్సరాలు పరిపాలనలో ఉన్న ఏనాడు హత్యా రాజకీయాలను ప్రోత్సహించింది లేదని ఇది మంచి పద్ధతి కాదని దానికి స్వస్తి పలికి ప్రజా పాలనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు, నాడు బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో తుంగతుర్తి నియోజకవర్గం లో శాంతి నెలకొందని అన్ని వర్గాల కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందని అన్నారు, నియోజకవర్గాన్ని సస్యశ్యామల చేయడం కోసం నిధులు వెచ్చించి ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతులు చేసి కాళేశ్వరం జలాలను ఎస్సారెస్పీ కాలువల ద్వారా ఈ ప్రాంత రైతాంగానికి రెండు పంటల కు సరిపడా నీళ్లు ఇచ్చిన చరిత్ర మాదే నని అన్నారు, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో దారుణమైన పరిస్థితి నెలకొందని అన్నారు రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయని అందులో భాగంగానే లింగంపల్లి గ్రామంలో మా కార్యకర్తను దారుణంగా హత్య చేశారని ఎల్లమ్మ గూడెంలో మా సర్పంచ్ అభ్యర్థి భర్తను కిడ్నాప్ చేసి అతని చేత మూత్రం తాపించారని, నకిరేకల్లో చిన్న కాపర్తి లో ఓట్లు గల్లంత చేశారని, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని అన్నారు, మాజీ మంత్రి గుంతగండ్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, బూడిద బిక్షమయ్యగౌడ్, కంచర్ల భూపాల్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నరసింహారెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, గుజ్జ యుగంధర్ రావు, ధర్మేందర్ రెడ్డి, ఎస్ ఏ రజాక్ తోపాటు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ ప్రధాన కార్యదర్శి బత్తుల సాయి గౌడ్ , సర్పంచ్ లు మల్లికార్జున్, లింగరాజు,కోటేష్,మాదాసు వెంకన్న, సురకంటి మధు, సరిత కృష్ణ,కాస నరేందర్ పార్టీ కార్యకర్తలు నాయకులు మున్నా లింగయ్య, శేఖర్,రామ్మూర్తి లింగారెడ్డి జక్కి పరమేష్ కలంచెర్ల మల్లేష్ మేకల మధు , ప్రజలు పాల్గొన్నారు.

## భాజపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి) :**భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బిహార్ మంత్రి నితిన్ నబీన్ నియమితులయ్యారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. బిహార్‌లోని బాంకీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి నితిన్ నబీన్ వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రహదారుల నిర్మాణశాఖ మంత్రిగా ఉన్నారు. భాజపా ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2020 జనవరిలో ఈ పదవిలో నియమితులయ్యారు. నితిన్ నబీన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. "కష్టపడి పనిచేసే కార్యకర్తగా నితిన్ నబీన్ గుర్తింపు పొందారు. ఆయనకు సంస్థాగతంగా గొప్ప అనుభవం ఉంది. బిహార్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా అద్భుతమైన రికార్డు ఆయన సొంతం. ఆయన పనితీరు రాబోయే కాలంలో భాజపాను మరింత బలోపేతం చేస్తుందని విశ్వసిస్తున్నాను" అని ట్వీట్ చేశారు.

# యూదులపై మళ్లీ ఉగ్రపంజా..

**- ఆస్ట్రేలియా బీచ్‌లో యూదుల హనుక్కా కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకొని దుండగుల కాల్పులు**

**- ఘటనలో 11 మంది మృతి.. పలువురికి గాయాలు**



మరోసారి కలకలం రేపాయి. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. వీరిలో ఇజ్రాయెల్‌లో రెండేళ్ల క్రితం (2023 అక్టోబర్ 7న) హమాస్ జరిపిన దాడిలో ప్రాణాలతో బయటపడిన వ్యక్తి తాజా కాల్పుల్లో గాయపడ్డాడు. బాండి బీచ్ దాడిలో తీవ్ర గాయాలపాలైన అతడు.. ఈ దేశంలోనూ ఇటువంటి ఘటన చూస్తానని ఊహించలేదన్నాడు."బీచ్ సమీపంలో జరుగుతున్న వేడుకల్లో కుటుంబంతో కలిసి పాల్గొన్నా. వందలాది మంది పెద్దలు, చిన్నారులు తమ కుటుంబాలతో ఎంజాయ్ చేస్తున్నారు. అదే సమయంలో కాల్పుల మోత మోగింది. ఒకరి తర్వాత ఒకరు కుప్పకూలుతున్నారు. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అక్టోబర్ 7న ఇలాంటి ఘటన చూశా. ఆస్ట్రేలియాలోనే కాదు.. నా జీవితంలో మళ్లీ అటువంటి ఘటన చూస్తానని అనుకోలేదు" అని ఆర్సెన్ ఓస్ట్రోవ్‌స్కీ అనే వ్యక్తి స్థానిక మీడియాకు వెల్లడించాడు. తన కుటుంబ సభ్యులు సురక్షితంగా తప్పించుకున్నారని చెప్పాడు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఆస్ట్రేలియా/ఇజ్రాయెల్ యూదు వ్యవహారాల మండలికి ఓస్ట్రోవ్‌స్కీ కాబోయే చీఫ్ అని తెలిసింది. ఇజ్రాయెల్‌లో 2023 అక్టోబర్ 7న జరిగిన దాడి నుంచి తప్పించుకున్న ఆయన.. యూదు సంఘంతో కలిసి పనిచేసేందుకు రెండు వారాల క్రితమే సిడ్నీకి వచ్చినట్లు తెలిసింది.

**ఖండించిన ఇజ్రాయెల్**

యూదులపై కాల్పుల ఘటనను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు లెక్కలేనన్ని హెచ్చరిక సంకేతాలను అందుకున్నప్పటికీ ఆస్ట్రేలియా ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదని తెలిపింది. వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్ విదేశాంగశాఖ మంత్రి గిడియన్ సార్ కోరారు.

**ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు: ప్రధాని మోదీ**

ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి భారత్ పూర్తి మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం బాండి బీచ్‌లో ఉగ్ర కాల్పుల ఘటనపై ప్రధాని స్పందించారు. సాధారణ పౌరుల్ని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపడం హేయమైన చర్య అని అన్నారు. ఈ ఉగ్ర ఘటన తనను షాక్‌కు గురిచేసిందన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారికి భారత ప్రజల తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆస్ట్రేలియాకు భారత్ మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.మరోవైపు భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కూడా సిడ్నీ ఘటనను తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమ ఆలోచలన్నీ ఆప్తులను కోల్పోయిన వారిచుట్టూనే ఉన్నాయంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇద్దరు సాయుధులైన దుండగులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో.. ఒక్కసారిగా అక్కడ భీతావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. వందలాది మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు.

**భారత్‌లో 'హై అలర్ట్':**భారత్‌లోని పలు ప్రధాన నగరాల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. దేశంలో యూదుల్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద సంస్థలు దాడులు చేయొచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి.ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఢిల్లీ, బెంగళూరు, ముంబై నగరాల్లో హై–అలర్ట్ జారీ చేశారు. ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం.. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 (స్థానిక కాలమానం ప్రకారం) గంటలకు కాల్పులు చోటు చేసుకొన్నాయి. ఈ కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో ఇవాళ్టి నుంచి ప్రారంభమైన యూదుల పండుగ హనుక్కా సందర్భంగా ఉగ్రవాదులు పెద్ద దాడులు చేయాలని యోచిస్తున్నట్లు భారత్‌లోని ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. యూదుల ప్రార్థనా మందిరాలు, కమ్యూనిటీ సెంటర్లు, ఇజ్రాయెల్‌కు సంబంధించిన సంస్థల్ని ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. యూదులు ఘనంగా జరుపుకునే ఎనిమిది రోజుల పండుగ హనుక్కా. ఈ పండుగ డిసెంబర్ 14 నుండి ప్రారంభమైంది. ఈ పండుగ సమయంలో యూదులు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు, వేడుకలు నిర్వహిస్తారు. అందువల్లే పండుగ పర్వదినాన భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం యూదు సంస్థలు, ప్రార్థనా మందిరాలు, కమ్యూనిటీ సెంటర్ల వద్ద భద్రత పెంచారు. విదేశీ పర్యాటకులు, ముఖ్యంగా ఇజ్రాయెల్ పౌరుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్రం, రాష్ట్రాలు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

## రియల్ హీరో..

అల్ అహ్మద్ మాత్రం ప్రాణాలకు తెగించి పోరాడారు. తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 (స్థానిక కాలమానం) గంటలు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఉన్న బాండి బీచ్‌లో పర్యాటకులంతా సేదతీరుతున్నారు. అంతలో ఇద్దరు ఉగ్రవాదులు అక్కడికి వచ్చి.. విచక్షణారహితంగా కాల్పులు మొదలుపెట్టారు. ఓ ఉగ్రవాది చెట్టు చాటు నుంచి బుల్లెట్ల వర్షం కురిపిస్తున్నాడు. అదంతా గమనించిన 43 ఏళ్ల అహ్మద్ అల్ అహ్మద్.. మెరుపు వేగంతో వెనక నుంచి వచ్చి ఓ ఉగ్రవాదిని గట్టిగా పట్టుకున్నాడు. అతడి చేతిలోని గన్‌ను లాక్కొని తిరిగి అతడికే ఎక్కుపెట్టాడు.అది చూసిన మరో ఉగ్రవాది.. అహ్మద్ లక్ష్యంగా కాల్పులు జరిపాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా అహ్మద్ కుప్పకూలిపోవడంతో.. ఉగ్రవాది అక్కడి నుంచి పారిపోయాడు. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న భద్రతా బలగాలు ఓ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. మరో ఉగ్రవాది 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నాయి. స్థానికులు, పోలీసులు అహ్మద్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి చికిత్స కొనసాగుతున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ప్రాణాలకు తెగించి ఉగ్రవాదులతో పోరాడిన అహ్మద్‌ను స్థానిక మీడియా 'రియల్ హీరో'గా అభివర్ణిస్తోంది. అహ్మద్ అతి సామాన్యుడు. ఓ పండ్ల దుకాణం పెట్టి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అలాంటి వ్యక్తి ఏ మాత్రం భయపడకుండా ఉగ్రవాదులతో పోరాడిన తీరుపై సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఓట్ చోర్.. గద్దీ చోర్..



నిలబడుతుందని అన్నారు. నరేంద్ర మోదీ–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. వారి వద్ద 'అధికారం' ఉందని, అందుకే వారు 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో బీజేపీ రూ. 10,000 బదిలీ చేసిందని, అయితే ఎన్నికల సంఘం వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదని గాంధీ ఆరోపించారు. సత్యానికి, అసత్యానికి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో, ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని ఆరోపణలు చేశారు. మోదీ ఎన్నికల సంఘానికి రక్షణ కల్పించడానికి ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. తాము ఆ చట్టాన్ని మార్చి ఎన్నికల కమిషనర్లపై చర్య తీసుకుంటామని తెలిపారు.

**దేశాన్ని కాపాడగలిగేది కాంగ్రెస్ మాత్రమే: ఖర్గే**

మరోవైపు, ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడటానికి 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్న బీజేపీని అధికారం నుంచి తొలగించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విరుచుకుపడ్డారు. ఓట్ చోర్–గద్దీ ఛోడ్ ర్యాలీలో పాల్గొన్న ఆయన, దేశాన్ని కాపాడగలిగేది కేవలం కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. అందుకే కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఐక్యంగా బలోపేతం చేయడం ప్రతి భారతీయుడి కర్తవ్యం అని అన్నారు.ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం దేశాన్ని నాశనం చేయడమేనని ఆరోపించారు. బీజేపీ వాళ్లు ద్రోహులు, నాటకాలు ఆడేవారని విమర్శించారు. అందుకే వారిని అధికారం నుంచి తొలగించాలని పిలుపినిచ్చారు. 140 కోట్ల మంది ప్రజలను కాపాడటం ముఖ్యమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. అందుకే తన కొడుకు బెంగళూరులో ఆపరేషన్ చేయించుకుంటున్నా తాను వెళ్లకుండా ఈ ర్యాలీకి హాజరయ్యానని కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు.

**ఎన్నికల నిర్వహనలో అక్రమాలు దేశం మొత్తానికి తెలుసు: ప్రియాంక గాంధీ**


సత్యమనే నినాదంతో మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును గద్దెదించుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అధికారంలో ఉన్నవారు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. భాజపా ప్రభుత్వంతో కలిసి ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఈమేరకు ప్రసంగించారు."తాము దేశం కోసం పనిచేస్తున్నామని, మోదీ కోసం కాదనేది ఎన్నికల సంఘం గుర్తుంచుకోవాలి. బిహార్ ఎన్నికల వేళ భాజపా రూ.10 వేల చొప్పున పంచినా.. ఈసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మరోవైపు.. ఎన్నికల సంఘంపై ఎటువంటి చర్యలకు అవకాశం లేకుండా కేంద్రం ఓ చట్టం తీసుకొచ్చింది. మేం అధికారంలోకి వస్తే దాన్ని మార్చి.. ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటాం. సమయం పట్టినా.. చివరకు సత్యమే గెలుస్తుంది. మోదీ, అమిత్ షాలను ఓడించేందుకు.. సత్యం, అహింస మార్గంలో పోరాడతాం" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**రాజ్యాంగాన్ని రద్దు చేయాలని భాజపా చూస్తోంది:సీఎం రేవంత్ రెడ్డి**

దిల్లీ: రాజ్యాంగాన్ని రద్దు చేయాలని భాజపా చూస్తోందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఓట్ చోర్–గద్దీ ఛోడ్' పేరు దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి ధర్నాలో రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.."మహాత్మా గాంధీ, అంబేడ్కర్ రాజ్యాంగ రచన సమయంలో రాజ్యాంగ సభలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ఓటు హక్కు విషయమై చర్చిస్తున్నప్పుడు ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్ గోల్వాల్కర్ తదితరులు వారికి ఓటు హక్కు ఇవ్వొద్దన్నారు. కానీ.. గాంధీ, అంబేడ్కర్ వారికి ఓటు హక్కు కల్పించినందున ఈ దేశంలో ప్రభుత్వం ఏర్పాటులో వాళ్లు కూడా భాగస్వాములవుతున్నారు. ఆర్ఎస్ఎస్, గోల్వాల్కర్ భావజాలంతో ఉన్న నరేంద్ర మోదీ, అమిత్ షా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వారి భావజాలాన్ని అమలు చేసేందుకు 400 సీట్లు కావాలని కోరుకున్నారు. భాజపాకు 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ చెప్పడంతోనే దేశ ప్రజలు ఆ పార్టీని 240 సీట్లకు పరిమితం చేశారు.అలా చేయబట్టే ఇవాళ రాజ్యాంగం.. రిజర్వేషన్లు ఉన్నాయి. అందుకే ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ప్రయత్నాలు చేస్తున్నారు. నాడు పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల కోసం గాంధీ, అంబేడ్కర్ నిలబడినట్లే.. ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలుస్తున్నారు. మనం వారికి అండగా నిలవాలి. ఎస్ఐఆర్ పేరుతో తొలుత ఓటరు కార్డు తొలగిస్తారు.. తర్వాత ఆధార్, రేషన్ కార్డ్ రద్దు చేస్తారు. ఆ తర్వాత వాళ్లకున్న హక్కులన్నీ గుంజుకుంటారు. ఈ సమస్య ఎన్నికలదో.. కాంగ్రెస్ పార్టీదో కాదు దేశ సమస్య. ఈ సమస్యకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. దేశ ప్రజలంతా కలిసి రావాలని కోరుతున్నా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రాహుల్ చేసే పోరాటంలో తెలంగాణ సిద్ధంగా ఉంది అలా చేయబట్టే ఇవాళ రాజ్యాంగం రిజర్వేషన్లు ఉన్నాయని, అందుకే ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. నాడు పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీల కోసం గాంధీ, అంబేడ్కర్ నిలబడినట్లే, ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలుస్తున్నారని కొనియాడారు. మనం వారికి అండగా నిలవాలని కోరారు. ఎస్ఐఆర్ పేరుతో తొలుత ఓటరు కార్డు తొలగిస్తారని, తర్వాత ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ రద్దు చేస్తారని ఆరోపించారు. ఆ తర్వాత మనకు ఉన్న హక్కులన్నీ గుంజుకుంటారని తెలిపారు. ఈ సమస్య ఎన్నికలదో, కాంగ్రెస్ పార్టీదో కాదని, దేశ సమస్య అని, ఈ సమస్యకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రకటించారు. దేశ ప్రజలంతా కలిసి రావాలని కోరుతున్నానని తెలిపారు.

# ఢిల్లీని ఆక్రమిస్తాం..

**- పాక్ ఉగ్రవాది రెచ్చగొట్టే వ్యాఖ్యలు..!**



భారత్‌ను ఉద్దేశిస్తూ.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబాకు చెందిన నాయకుడు మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. దిల్లీని ఆక్రమిస్తాం అని అర్థం వచ్చేలా.. ఆ నగరాన్ని పెళ్లికూతురుగా చేస్తామంటూ వ్యాఖ్యానించాడు. ఈ క్రమంలో భారత వైమానిక దళంపై కూడా నోరుపారేసుకున్నాడు. లష్కరే వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడు అబ్దుల్ రవూఫ్ పాక్ ఆర్మీ అతడిని సాధారణ పౌరుడిగా పేర్కొంది. అయితే, భారత్‌పై దాడులకు బహిరంగంగా పిలుపునిస్తూ చేసిన వ్యాఖ్యల్లో అతడిలోని ఉగ్ర భావజాలం స్పష్టమవుతుంది. తాజాగా ప్రసంగంలో అతడు మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో సాయుధపోరాటం సమసిపోయిందనే వాదనలను కొట్టిపారేశాడు. వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించాడు. ఎల్‌ఈటీ సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మక్కీని ఉద్దేశిస్తూ.. భారత రాజధాని (దిల్లీని ఉద్దేశిస్తూ)ని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు. ఈ సందర్భంగా దిల్లీని ఆక్రమిస్తామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశాడు. ఇక భారత సైనిక శక్తిపై కూడా రవూఫ్ నోరుపారేసుకున్నాడు. రఫేల్ యుద్ధవిమానాలు, ఎస్–400 గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్‌లు అసమర్థమైనవిగా అభివర్ణించాడు. భారత వైమానిక దళం.. పాక్ గగనతలంలోకి ప్రవేశించే ధైర్యం చేయదని వ్యాఖ్యానించాడు. ఇస్లామిక్ దేశాల్లో పాక్ వద్ద మాత్రమే అసలైన అణ్వాయుధాలు ఉన్నాయన్నాడు.



## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఫుడ్ పాయిజనింగ్

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ జరుగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. హైదరాబాదు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి కలిసి కింగ్‌కోఠిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీలను, వారి తల్లిదండ్రులను, డాక్టర్లను విద్యార్థినీల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల్లో ఉప్మారవ్వ, పులిసిపోయిన పెరుగు, కుళ్ళిపోయిన కూరగాయలు, నాసిరకం పప్పులు, ముక్కిపోయిన బియ్యం పెట్టడం వల్లనే ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పదేపదే జరుగుతున్నాయన్నారు. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్‌లో మరియు మాదాపూర్ ప్రమరీ స్కూల్‌లో జరిగిన ఘటనల వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురై కోలుకోకముందే, బాగ్‌లింగంపల్లి ఘటన జరగడం ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందని తెలిపారు. హాస్టళ్ళ నిర్వహణలోపం, పర్యవేక్షణ కొరత, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, పరిశుభ్రత లోపం, కలుషిత నీరు తదితర కారణాల వల్లనే ఈ ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ ఘటనపై గతంలో హ్యూమన్‌రైట్స్ కమిషన్ తీవ్రంగా స్పందించినప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని, ఆర్థిక భారం కూడా ఈ ఘటనకు ఒక ముఖ్య కారణమైందున ప్రభుత్వ హాస్టల్స్‌కు చెల్లించాల్సిన బిల్లులను పూర్తిగా చెల్లించాలని, ఘటనలకు కారణమవుతున్న అధికారులపై, కాంట్రాక్టు సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పర్యవేక్షణ లోపాలను సరిదిద్ధి, ఆహార భద్రత ప్రోటోకాల్స్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఆహారం వండడానికి సర్టిఫైడ్, శిక్షణ పొందిన కుక్‌లను మాత్రమే నియమించాలని, వీటికోసం తక్షణమే కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పల్లెల్లో ప్రచారజోరు

- ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న అభ్యర్థులు
- దూరంగా ఉన్న ఓటర్లకు సోషల్ మీడియా ద్వారా మెసేజులు
- ఓట్లు రాబట్టేందుకు శతవిధాల ప్రయత్నాలు
- ముమ్మరంగా మూడో విడత ఎన్నికల ప్రచారం





**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** ఎన్నికల ప్రచారం జోరులో పల్లెలు హోరెత్తుతున్నాయి.. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ రకాల ప్రచార సాధనాలతో పోటీలో నిలబడ్డ అభ్యర్థులు ఇంటింటికి ప్రచారం చేస్తున్నారు. తమకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. దీంతో పల్లెల్లో గ్రామాల్లో ఎన్నికల వేడి హాట్ హాట్ గా ఉంది. ఎప్పుడైతే గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందో.. నామినేషన్లు వేయడం, ఉపసంవరణ అవ్వడం తో పాటు ఎన్నికల అధికారులు పోటీలో నిలబడ్డ అభ్యర్థుల పేర్లను ప్రకటించడం జరిగినప్పటి నుండి గ్రామాల్లో సందడి నెలకొంది. అధికార పార్టీ కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి బలపరిచిన అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్, రెబల్ అభ్యర్థులు తమ సత్తాను చాటుకునేందుకు ప్రతిరోజు తమ షాయ శక్తుల ఇంటింటికి గుడిసె గుడిసెకు రోజుకు రెండు నుంచి మూడుసార్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. అవసరమైతే కడుపులో తలపెట్టి కాళు పట్టుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఇంకొందరైతే మీరు ఓటు వేయకపోతే మేం బతకలేం అంటూ సానుభూతి కలిగేలా కూడా ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా మహిళలు కూడా వార్డుల వారీగా విడిపోయి కరపత్రాలు వాల్పోస్టర్ల ద్వారా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క వార్డు అభ్యర్థి ఓటర్ లిస్ట్ లను పట్టుకొని ఆ లిస్టు ఆధారంగా ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థులను కలుస్తున్నారు. సర్పంచ్ గా నిలబడిన అభ్యర్థులు ఎలాగైనా గెలవాలి అనే కృత నిశ్చయంతో ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ తాము గెలిస్తే అది చేస్తాము ఇది చేస్తాం అంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఓటర్లను ఆకర్షించే ప్రయత్నంలో ముందుకు సాగుతున్నారు. తమ అధినాయకులు , ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఓటర్లకు నమ్మకం కలిగించే విధంగా కదులుతున్నారు. స్థానికంగా ఓటు ఉండి ఎక్కడో నగర ప్రాంతాలలో ఉంటున్నటువంటి వాళ్ళ లిస్టు ఆధారంగా చేసుకుని వారికి సోషల్ మీడియా ద్వారా సెల్ఫోన్ల ద్వారా సమాచారాన్ని అందివ్వడం జరుగుతుంది. ఈనెల 17న మూడో విడత ఎన్నికలు ఉన్నాయని తప్పకుండా వచ్చి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. అవసరమైతే రానుబోను ఖర్చులతో పాటు ఇతర సదుపాయాలు కూడా కలిగిస్తామని వారికి చెబుతున్నారు. వాట్సాప్ ద్వారా తమ రోజు ప్రచారం చేస్తున్నటువంటి ఫోటోలను వీడియోలను అప్లోడ్ చేస్తూ ఓటర్లకు తమ అభ్యర్థనను చేరవేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు తమతో ప్రచారంలో ఉన్న వాళ్లకు టీలు టిఫిన్లు భోజనం తోపాటు రాత్రిపూట మందు సదుపాయాలు కలిగిస్తూ వారు తమతో ఎన్నికలు అయిపోయే వరకు ఉండేలా ఉత్సాహ పరుస్తున్నారు. ఇక చివరిగా ఓటర్లకు మద్యం, మనీ వెదజల్లి ఓట్లను కొనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఓటర్లు కూడా డబ్బు అందరి అభ్యర్థుల దగ్గర తీసుకొని ఎవరికో ఒకరికి తమకు నచ్చిన వారికి ఓటేయాలని కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తుంది. మరి ఎవరు గెలుస్తారో.. ఎవరు ఓడుతారో ఈనెల 17న పోలింగ్ జరిగిన తర్వాత కౌంటింగ్ అయ్యేవరకు వేచి చూడాల్సిందే..

## ఆర్య వైశ్య సోదరీమణులకు అండగా ఉంటా

- అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆర్య వైశ్య మహిళ సోదరీమణులకు అండగా ఉంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ నూతన ప్రధాన, మహిళా, యువజన, డివిజన్ల కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం అంగర వైభవంగా పబ్బమల్లేష్ దంపతుల ఆధ్వర్యంలో క్రిస్టల్ గార్డెన్, చందానగర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా, శ్రీమతి ఉప్పల స్వప్న ఆధ్వర్యంలో వాసవి మాత చిత్రపటానికి పూలమాల సమర్పించి జ్యోతిప్రజ్వలన గావించి, వందేమాతరం, వాసవిమాత గీతం తో సభ ప్రారంభించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా మొట్టమొదట నూతన ప్రెసిడెంట్, సెక్రెటరీ, ట్రెసరర్, వర్కింగ్ ప్రెసిడెంట్ తో ప్రమాణస్వీకారం చేయించారు. తదుపరి.. ముఖ్య అతిథులతో గ్రేటర్ హైదరాబాద్ మహిళా పీఎస్టీ, యువజన పీఎస్టీ, గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం, మహిళా కార్యవర్గం, యువజన కార్యవర్గం, వివిధ డివిజన్ల పీఎస్టీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఐవీఎఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ రామ్ దాస్ అగర్వాల్ జీ స్థాపించిన ఐవీఎఫ్ ను అన్ని విధాల ముందుకు తీసుకు వెళతామని, దేశంలోని వైశ్యులను ఏకతాటి పై నడిపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి వైశ్యుల మన్ననలు పొందిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రమాణ స్వీకారం లో మహిళలు అత్యధికంగా పదవులు పొంది ప్రమాణ స్వీకారం చేయడం సంతోషదాయకమని అన్నారు. 33 జిల్లాలోల ఐవీఎఫ్ నిరంతరం రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, అమావాస్య, పౌర్ణమి అన్నదాన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పాసైన వైశ్య విద్యార్థులకు లక్ష రూపాయలను అందజేయడం, మహిళల చైతన్యం కోసం వివిధ మహిళా కార్యక్రమాల సంక్రాంతి ముగ్గుల పోటీ, వుమెన్స్డే, మదర్స్డే, గోరింటాకు సంబరాలు, కార్తీక వనభోజనాలు, తీర్థయాత్రలు నిర్వహిస్తుందని అన్నారు. అలాగే నోట్ బుక్స్ పంపిణీ, పేద వైశ్యులకు పుస్తె మట్టలు, కుట్టుమిషన్‌ల పంపిణీ చేస్తుందని అన్నారు. కంచె ఐలయ్య పై పోరాటం, ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు గతం లో పాదయాత్ర చేసి వైశ్యుల ఆత్మ గౌరవం పెంచడం జరిగింది అని అన్నారు. అలాగే ఐవీఎఫ్ న్యూ ఢిల్లీ మహిళా విభాగంలో కీలక పదవులు నిర్వహించిన రేఖ గుప్తా ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఐవీఎఫ్ కు గర్వకారణం అని అన్నారు. వైశ్యులు రాజకీయంగా ఎదిగుతూ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎలక్షన్‌లో అత్యధిక సీట్లు గెలుచుకోవాలని అన్నారు. నూతన అధ్యక్షుడు పబ్బ మల్లేష్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ లోని 300 పైచిలుకు డివిజన్ లలో ఐవీఎఫ్ కార్యక్రమాలు చేపట్టి ఐవీఎఫ్ కు మంచి పేరు సంపాదించి పెట్టాలని కోరారు. ముఖ్యఅతిథి శేరిలింగంపల్లి శాసనసభ్యుడు అరెకేపూడి గాంధీ మాట్లాడుతూ... మహాత్మాగాంధీ స్ఫూర్తి తో మమత నాపేరు అరెకిపూడి గాంధీ గా నామకరణం చేశారన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు దానధర్మల్లో, సేవా రంగంలో ముందు ఉంటారు అని కొనియాడారు, ముఖ్య అతిథి యోగానంద మాట్లాడుతూ పబ్బ మల్లేష్ ఆధ్వర్యంలోని నూతన కార్యవర్గం సభ్యుల పూర్వ అనుభవం తో ఐవీఎఫ్ నీ ముందుకు తీసుకువెళ్లాలని కొరారు. ఇండియాలో వైశ్యులు వ్యాపార రంగంలో అత్యధిక ఆదాయపన్ను, జీఎస్టీ మనవాళ్లే సెంట్రల్ గవర్నమెంట్ వారికి చెల్లిస్తున్నారు అని, మన వారు రాజకీయాలలో వెనుకబడి ఉన్నారు, ఈ ఐవీఎఫ్ రాజకీయాలలో చురుకుగా పాల్గొనుటకు అవకాశం కల్పిస్తుంది అని యోగానంద గారు తెలిపారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఐవీఎఫ్ ముందుకు తీసుకు వెళతామని అన్నారు.

ఉదయం నుండి యశోద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో 1000 మంది పైన బీపీ, షుగర్ టెస్టులు చేసుకున్నారు. వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో 500 మంది పైన కంటి పరీక్షలు చేసుకున్నారు. సిటారే గోల్డ్, డైమాండ్స్ వారు ఏర్పాటు చేసిన లక్కి డిప్ కార్యక్రమంలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం సాయత్రం వరకు వివిధ ఆట పోటీలు, తాంభోల నిర్వహించి గెలుపొందినవారికి వారాహి వారు స్పాన్సర్ చేసిన చీరలు, గిఫ్ట్ వోచర్లను ఇచ్చారు. ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో 3000 మంది పాల్గొని భోజన తాంబులాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగం పల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, మాదాపూర్ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, రఘునాథ్ రెడ్డి, మాదాపూర్ ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, అవోపా తెలంగాణ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఐవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి కొడిప్యాక నారాయణ, యూత్ ప్రెసిడెంట్ కట్ట రవి కుమార్, యూత్ ట్రెజరర్ కోల్పురి నరేష్ గుప్తా, అడిషనల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్ గుప్తా, ధార్మిక కమిటీ చైర్మన్ వంగ పల్లి అంజయ్య స్వామి, వైస్ ప్రెసిడెంట్ వాస రాజేంద్రప్రసాద్, సికింద్రాబాద్ అధ్యక్షులు బెల్దే రవి కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పాండయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చింతల రజనీకాంత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌కు అరుదైన గౌరవం

- అమెరికా కాంగ్రెషనల్ మెడలియన్, ప్రొక్లమేషన్‌తో సత్కారం



**హైదరాబాద్, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** అమెరికా కాంగ్రెస్ అందించే అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు కజకిస్తాన్ గౌరవ కాన్సుల్‌గా పని చేస్తున్న డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్‌కు దక్కాయి. అవి.. యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెషనల్ మెడలియన్, యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెషనల్ ప్రొక్లమేషన్. ఈ పురస్కారాలను అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు (ఇల్లినాయిస్ రాష్ట్రం 1వ కాంగ్రెషనల్ జిల్లా ప్రతినిధి), యూఎస్ హౌస్ కమిటీ ఆన్ ఫారిన్ అఫైర్స్, హౌస్ కమిటీ ఆన్ అగ్రికల్చర్‌లో సభ్యుడు జోనాథన్ ఎల్ జాక్సన్ ప్రదానం చేశారు. కాంగ్రెషనల్ మెడలియన్ అనేది సమాజ సేవ, దౌత్యరంగం, ప్రపంచ అభివృద్ధికి చేసిన విశిష్ట సేవలకు అందించే అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం. ఈ ప్రొక్లమేషన్ అమెరికా కాంగ్రెస్ అధికారిక రికార్డుల్లో నమోదు కానుంది. డాక్టర్ ఖాన్ చేసిన సేవలు అమెరికా కాంగ్రెస్ చారిత్రక ఆర్కైవ్స్‌లో శాశ్వతంగా నిలిచిపోతాయి. ఈ సందర్భంగా జోనాథన్ ఎల్ జాక్సన్ మాట్లాడుతూ "డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడంలో, దేశాల మధ్య మధ్యవర్తిగా మెలగడంలో అసాధారణ నాయకత్వాన్ని ప్రదర్శించారన్నారు. గ్లోబల్ సహకారం, సస్టైనబుల్ డెవలప్మెంట్, అంతర్జాతీయ వాణిజ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి దౌత్య రంగంలో అత్యున్నత విలువలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఆయనకు ఈ పురస్కారాలు అందజేయడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. అమెరికా, కజకిస్తాన్, భారత్ దేశాల మధ్య శాంతి, ఆర్థిక సహకారం, అర్థవంతమైన అంతర్జాతీయ అనుసంధానాన్ని ప్రోత్సహించడంలో డాక్టర్ ఖాన్ చూపుతున్న అంకితభావం ఎనలేనిది' అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ "యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెషనల్ మెడలియన్, కాంగ్రెషనల్ ప్రొక్లమేషన్ అందుకోవడం నా జీవితంలో చారిత్రాత్మక గౌరవం అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సత్కారాలు అందజేసిన జోనాథన్ ఎల్ జాక్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇవి అంతర్జాతీయ సహకారాన్ని, ప్రపంచ పురోగతిని మరింత బలోపేతం చేయాలన్న నా సంకల్పాన్ని మరింత పదిలం చేస్తాయని తెలిపారు. ఈ గౌరవాలు డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ కు గ్లోబల్ ఐ మేగజైన్ యూఎస్ఏ ఆధ్వర్యంలో లభించిన గ్లోబల్ డిప్లొమాట్ అవార్డ్ 2025 ఎంపికతో సమకాలీనంగా రావడం విశేషం. ఇది ఆయన భాగస్వామ్య దేశాల మధ్య దౌత్య, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడంలో ఉన్న ప్రభావవంతమైన పాత్రను మరింతగా గుర్తింపు పొందేలా చేశాయి.

## కవిత్వం రాయడం కన్నా విమర్శే కష్టం

- అరసం సాహితీ సభలో డాక్టర్ బన్నా అయిలయ్య..
- బండారు రాజ్ కుమార్ కు వాసిరెడ్డి సాహితీ పురస్కారం అందజేత..



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 14 (జనం సాక్షి) :** హనుమకొండ సాహితీ రంగంలో కవిత్వం రాసే వారి సంఖ్య పెరిగిందని, అయితే కవిత్వం రాయడం కన్నా విమర్శ రాయడం కష్టమైన పనిగా ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రతీ ఏటా నిర్వహిస్తున్న ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు స్మారక సాహితీ పురస్కారం 2025 సంవత్సరానికి సాహితీ విమర్శకు అందించారు. వర్ధమాన కవి బండారు రాజ్ కుమార్ రాసిన 'తెలంగాణ కవి ముద్ర' విమర్శ గ్రంథానికి ఈ పురస్కారం లభించింది. జిల్లా అరసం అధ్యక్షుడు బూర బిక్షపతి అధ్యక్షతన స్థానిక లష్కర్ బజార్ లోని బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతకు నగదు బహుమతిగా 5వేల రూపాయలు, మెమెంటో అందించి శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపన్యాసం చేసిన ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ రాజ్ కుమార్ రాసిన గ్రంథములో తెలంగాణలోని 52 మంది కవుల కవిత్వాలను ఒక ప్రణాళిక ప్రకారంగా రచయిత పూర్వాపరాలను, కవిత్వ నిర్మాణ పద్దతులను కవిత్వంపై తన అభిప్రాయాలను చక్కగా విశ్లేషించి నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గన్న రాష్ట్ర అరసం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరాస్వామి అరసం సంక్షిప్త చరిత్రను వివరించారు. ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు సంక్షిప్త జీవిత చరిత్రను, సాహితీ సేవలను డాక్టర్ వాసిరెడ్డి క్రిష్ణ పరిచయం చేశారు. బహుమతి పొందిన తెలంగాణ కవి ముద్రను అరసం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిధి వివరించి తెలిపారు. జిల్లా అరసం కార్యక్రమాలను కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ తెలిపారు. రచయిత్రి గజ్జెల స్వరూపారాణి తొలుత స్వాగత వచనాలు తెలుపగా సభలో వల్లంపట్ల నాగేశ్వర రావు, వీఆర్ విద్యార్థి, డాక్టర్ కాయిత వెంకటి, గూళ్ల వెంకటయ్య, గట్టు రాధిక, ఎర్ర ప్రసూన, కోడం కుమారస్వామి, పిట్ట సాంబయ్య, మేకిరి దామోదర్, డాక్టర్ టి. శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పేరు పెట్టడమే మార్పా?

- సీతక్క...జీవితాంతం మంత్రి గా ఉన్న అభివృద్ధి చేయలేవు...
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**కొత్తగూడ డిసెంబర్ 14 (జనంసాక్షి) :** మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో భూపతి శ్యామల తిరుపతిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్,ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.అనంతరం మీడియా సమావేశం లో మాట్లాడుతూ మంత్రి సీతక్క ములుగు నియోజకవర్గనికి చేసింది ఏంటో చెప్పాలని అన్నారు.జీవితాంతం మంత్రిగా ఉన్న ములుగును అభివృద్ధి చేయలేవని సీతక్కను విమర్శించారు.ములుగు నియోజకవర్గంను జిల్లా,మెడికల్ కాలేజ్,నూతన మండలాలు, గ్రామపంచాయతీ లు,జిల్లా ఆస్పత్రి, మేడారం, ములుగు అభివృద్ధి చేసింది కేసీఆర్ గుర్తుకు లేదా... అంటూ ఘాటైన వాక్యం చేశారు.బిఆర్ఎస్ కార్యకర్తలను బెదిరించే రాజకీయాలు మానుకోవాలని అన్నారు.కాంగ్రెస్ నాయకులు పర్సంటేజ్ ల కోసం పాకులాడుతూ పరిపాలనను పక్కకు పెట్టారని,మార్పు అంటే విగ్రహాలు మార్చడం, ఇందిరమ్మ పేరు పెట్టడం కాదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బిఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం ఉండి ఉంటే ఈపాటికి ఈ ప్రాంతానికి పాకాల నుండి నీళ్లు ఇచ్చి రైతులకు రెండు పంటలతో ఈ ప్రాంత అభివృద్ధి చెందేదని గుర్తు చేశారు.బిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేణు, నెహ్రూ, వీరన్న,సాంబయ్య టిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అండతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




**ఆత్మకూరు, డిసెంబర్ 14 (జనం సాక్షి):** ఆత్మకూరు మండల పరిధిలో పలు గ్రామాల్లో మొదలైన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం గ్రామాలు మారాలంటే మార్గం ఒక్కటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం గూడెప్పాడు గ్రామంలోని కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి పరికి రమేష్ బాబు గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామాల్లో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.గత రెండు సంవత్సరాలుగా మనం చేసిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై నమ్మకం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సునంద- సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు, కక్కెర్ల రాజు, రవీందర్, రాజస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# నలుగురిలోకి తమిళం – నాలుగు గోడల మధ్య తెలుగు

భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి అస్తిత్వ పతాకం. కానీ ఆ పతాకాన్ని మనం ఎగరేస్తున్నామా? ఢిల్లీలో జరిగిన తమిళ సాహిత్య సదస్సును గమనించినప్పుడు, మన తెలుగు వారి స్తబ్దత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ అంతరాన్ని అర్థం చేసుకోవడానికి ఒక చిన్న పరిశీలన అవసరం.

ఒక జాతి మనుగడ కేవలం దాని భౌగోళిక సరిహద్దుల మీదో, ఆర్థిక వనరుల మీదో ఆధారపడి ఉండదు. ఆ జాతి తన భాషను, సంస్కృతిని, విజ్ఞానాన్ని ఇతరులకు ఎంత సమర్థవంతంగా పంచగలుగుతుందనే అంశంపైనే దాని అంతర్జాతీయ గుర్తింపు ఆధారపడి ఉంటుంది. దీనినే ఆధునిక పరిభాషలో 'సాఫ్ట్ పవర్' (Soft Power) అంటారు. డిసెంబర్ 4, 5, 6, 2025న దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక కార్యశాల, తెలుగు భాషకు ఒక పాఠంగా మారుతుందనిపించింది.



చెన్నైకి చెందిన 'సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్' (CICT), ప్రతిష్టాత్మక ఢిల్లీ విశ్వవిద్యాలయపు 'భారతీయ భాషలు మరియు సాహిత్య అధ్యయన శాఖ' సంయుక్తంగా నిర్వహించిన మూడు రోజుల అంతర్జాతీయ కార్యశాల, కేవలం ఒక సాహిత్య సమావేశం మాత్రమే కాదుబీ అది తమిళ భాష తన ప్రాచీనతను ఆధునిక ప్రపంచానికి చాటిచెప్పిన ఒక వ్యూహాత్మక సాంస్కృతిక విజయం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, తమిళులు తమ భాషను ఎలా విశ్వవ్యాప్తం చేస్తున్నారో, మనం ఎక్కడ వెనుకబడిపోయామో తులనాత్మక పరిశీలన చేయడమే ఈ చిరు ప్రయత్నం.

ఢిల్లీ వేదిక – ఉత్తమ వ్యూహాత్మక ఎంపిక:లి సాధారణంగా ప్రాంతీయ భాషా సదస్సులు ఆయా రాష్ట్రాలకే పరిమితం కావడం మనం చూస్తుంటాం. కానీ, CICT తన కార్యక్షేత్రంగా ఢిల్లీని ఎంచుకోవడం వెనుక ఒక బలమైన సాంస్కృతిక స్పృహ ఉంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని 'భారతీయ భాషలు మరియు సాహిత్య అధ్యయన శాఖ'లో జరిగిన ఈ మేధోమథనం, వివిధ భాషల విద్యావేత్తలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ద్వారా, తమిళ సాహిత్యం కేవలం తమిళుల సొత్తు మాత్రమే కాదు, అది భారతీయ విజ్ఞాన సర్వస్వంలో భాగమని CICT నిరూపించింది. ఇది ఇతర భాషా సంస్థలకు ఒక మేలుకొలుపు.

'తెలుగు భాషకు వెయ్యేళ్ల లిఖిత చరిత్ర ఉంది, రెండు వేల ఏళ్ల మౌఖిక చరిత్ర ఉంది. రాజరాజనరేంద్రుడి ఆస్థానం నుండి, శ్రీకృష్ణదేవరాయల భువనవిజయం వరకు మన సాహితీ వైభవం దేదీప్యమానం అని, మన భాష గొప్పదని' మనలో మనం చెప్పుకోవడం వేరుబీ అది ఇతరుల చేత, ముఖ్యంగా భిన్న సంస్కృతుల వారి చేత గుర్తింపు పొందేలా చేయడం వేరు. ఈ విషయంలో తమిళులు చూపిన చొరవ అభినందనీయం.

'ఆత్తిచూడి' – విశ్వజనీన అనువాద ప్రక్రియ: ఈ కార్యశాల ప్రధాన ఇతివృత్తం అత్యంత ఆసక్తికరమైనది. 12వ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత కవయిత్రి అవ్వైయార్ (Avvaiyar) రచించిన 'ఆత్తిచూడి' (Aathisoodi) అనే నీతినిధుల సంకలనాన్ని ఎంచుకోవడం వెనుక గొప్ప దూరదృష్టి కనిపిస్తుంది. ఇది వేల పద్యాలున్న బృహద్గ్రంథం కాదుబీ కేవలం 109 చిన్న చిన్న నీతి వాక్యాల సమాహారం. 'అరమ్ సెయ విరుంబు' (ధర్మం చేయుట యందు కోరిక కలిగి ఉండు), 'ఆరువదు సినమ్' (కోపమును అణచుకో) వంటి సూత్రాలు ఏ మతానికో, ప్రాంతానికో పరిమితమైనవి కావు. అవి విశ్వజనీనమైనవి.

ఈ చిన్న పుస్తకాన్ని ఒకేసారి వివిధ భాషల్లోకి అనువదించే బృహత్తర బాధ్యతను CICT తలకెత్తుకుంది. ఇందులో భారత రాజ్యాంగం గుర్తించిన భాషలతో పాటు, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషలు, అనేక గిరిజన, మైనారిటీ భాషలు ఉండటం గమనార్హం.

**శాస్త్రీయ దృక్పథం:** కేవలం మూడు రోజుల్లో, 109 వాక్యాలను 60 భాషల్లోకి అనువదించడం, సరిచూడటం, ప్రచురణకు సిద్ధం చేయడం అనేది సాధారణ విషయం కాదు. దీనికి అకడమిక్ డిసిప్లిన్, పకడ్బందీ ప్రణాళిక అవసరం. ఒక పదం మూలార్థం చెడిపోకుండా, లక్ష్య భాషలోని సాంస్కృతిక నేపథ్యానికి అన్వయించేలా అనువాదం సాగాలి. అక్కడ జరిగిన చర్చలు, నిపుణుల సూచనలు, సలహాలు ఈ అనువాద సమస్యల పరిష్కార దిశగా సాగాయి. ఈ 60 పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలకు, విశ్వవిద్యాలయాలకు వెళ్తాయి. ఒక స్పానిష్ పాఠకుడో, ఒక జర్మన్ విద్యార్థో '12వ శతాబ్దంలోనే తమిళంలో ఇంతటి నైతిక పరిపక్వత ఉందా!' అని ఆశ్చర్యపోయేలా చేయడం ద్వారా, తమిళ ప్రాచీనతను మరోసారి అంతర్జాతీయ వేదికపై నిలిపినట్లవుతుంది.

CICT వ్యవస్థాగత నిర్మాణం – అధ్యయనం:లి మనం కేవలం ఈ ఒక్క సంఘటనను చూసి ఆశ్చర్యపోతే సరిపోదు. దీని వెనుక ఉన్న వ్యవస్థాగత నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి. 'సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్' (CICT) వెబ్‌సైట్‌ను కానీ, వారి నివేదికలను కానీ పరిశీలిస్తే కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి.

**డిజిటల్ ఆర్కైవ్స్:** వారి జాలగూడు (వెబ్‌సైట్)లో వారి సంస్థ సమాచారం మొత్తం ఉంటుంది. 'సంఘ' సాహిత్యం నుండి ఇతర ముఖ్య తమిళ రచనల వరకు అన్నీ డిజిటల్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. పరిశోధకులకు అవసరమైన ప్రాథమిక వనరులు జాలగూడులో లభిస్తాయి.

**నిధుల వినియోగం:** కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కేవలం జీతభత్యాలకో, భవనానికో పరిమితం చేయకుండా, ఇటువంటి సృజనాత్మక ప్రాజెక్టులవైపుకు మళ్ళించడం వారి విజయ రహస్యం. 'తిరుక్కురల్'ను ఇప్పటికే ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రధాన భాషల్లోకి అనువదించారు. ఇప్పుడు 'ఆత్తిచూడి' వంతు. వారు కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలలో వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు.

తెలుగు కేంద్రం – ఒక ఆత్మవిమర్శ: ఇక్కడే మనసును కలిచివేసే ప్రశ్న ఉదయిస్తుంది. తమిళ సోదరులు ఢిల్లీ నడిబొడ్డున తమ భాషా వైభవాన్ని చాటుతుంటే, మన తెలుగు భాష పరిస్థితి ఏమిటి? మనకు కూడా 2008లోనే 'ప్రాచీన భాష' (Classical Language) హోదా లభించింది. మనకు కూడా ఒక 'క్లాసికల్ తెలుగు సంస్థ' ఉంది. కానీ, జాతీయ స్థాయిలో దాని ప్రభావం ఎంత?

మన తెలుగు సంస్థ నిర్వహించే కార్యక్రమాలు ఎలా ఉంటాయంటే... చూడటానికి బాగున్న ఒక మంచి సమావేశ మందిరం, కొంతమంది 'ఆస్థాన పండితులు.. ఈ పండితుల జాబితా ఎప్పుడూ ఒకేలా ఉంటుంది (మ్యూజికల్ చైర్స్ ఆట లాగా, వాళ్ళే తిప్పి తిప్పి కూర్చుంటారు). సదస్సు అంశాలు.. 'కవి సమ్మేళనం', 'సాహిత్యం–సమాలోచన', 'సాహిత్యం–సమాజం', 'తెలుగు భాష– ...'. ఇలా ఏమాత్రం కొత్తదనం లేని అంశాలు, ఎత్తిపోతల పథకాలను ఎంచుకుంటారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ–బిస్కెట్లు. మధ్యలో ఒకరినొకరు 'మీరు మహాకవి' అంటే 'కాదు, మీరే యుగకర్త' అని పొగుడుకుంటూ, శాలువాలు కప్పుకుంటూ, ఫోటోలు దిగడంతో సభ ముగుస్తుంది. మరుసటి రోజు పత్రికలో ఒక చిన్న వార్త: 'ఘనంగా తెలుగు సదస్సు' అంతే! ఆ సదస్సు వల్ల భాషకు, సాహిత్యానికి, లేదా సమాజానికి ఒరిగిన ప్రయోజనం ఏమిటంటే? సమాధానం శూన్యం.

తమిళులు వారి ప్రాచీన సాహిత్యాన్ని వివిధ భాషల్లోకి అనువదించి అంతర్జాతీయ పాఠకులకు అందిస్తుంటే, మనవాళ్ళు 'వచ్చే నెల ఏ అంశం మీద సమావేశం పెడదాం?' అని చర్చిస్తుంటారు. తమిళ సెంటర్ పనితీరు 'రాకెట్' వేగంతో ఉంటే, మనం ఎక్కడున్నామో బయటి ప్రపంచానికి తెలీదు. వారు పుస్తకాలను ప్రచురిస్తుంటే, మనం 'కాలయాపన' చేస్తున్నాం. వారు 'ప్రపంచానికి' చెబుతుంటే, మనం 'గోడలకు' చెప్పుకుంటున్నాం. నిజంగా చెప్పాలంటే, మన సంస్థ 'రహస్య గూఢచారి సంస్థ'లా పనిచేస్తోంది. అంతర్జాలంలో వారి సమాచారం ఏమీ ఉండదు. వారు ఏం చేస్తున్నారో ఎవరికీ తెలియదు. బహుశా అదే వారి వ్యూహం ఏమో!

ఇది ఎవరినీ నిందించడానికి చేస్తున్న విమర్శ కాదుబీ ఇది ఒక వ్యవస్థాగత వైఫల్యంపై చేస్తున్న ఆవేదన.

కార్యాచరణ లోపం: ఇటీవల కాలంలో తెలుగు కేంద్రం నుండి జాతీయ స్థాయిని ఆకర్షించే నూతన ఆలోచన ఉన్న ఒక్క సదస్సు అయినా జరిగిందా? వేమన పద్యాలు, సుమతీ శతకం, లేదా భర్తృహరి సుభాషితాల తెలుగు అనువాదాలు 'ఆత్తిచూడి' కంటే ఏమాత్రం తక్కువ కావు. మన ప్రాచీన రచనల్లోని అంశాలు ప్రపంచ స్థాయికి చెందినవి. కానీ, వాటిని వివిధ భాషల్లోకి అనువదించాలనే ఆలోచన మనకెందుకు రాలేదు? ఒక వ్యక్తి (ఉదాహరణకు వెల్చేరు నారాయణరావు) చేసిన స్థాయి పని ఇప్పటికీ ఒక సంస్థ చేయలేదేమో! అనిపిస్తుంది.

ప్రచురణల కొరత: మన దగ్గర నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పోతన వంటి మహాకవులు ఉన్నారు. వారి సాహిత్యాన్ని ఇంగ్లీష్‌లోకి లేదా హిందీలోకి అనువదించి, 'పెంగ్విన్ క్లాసిక్స్' లేదా 'అంతర్జాతీయ స్థాయి క్లాసిక్స్' వంటి వాటితో కలిసి ప్రచురించే ప్రయత్నం జరిగిందా?

నిధుల నిర్వహణలో వైఫల్యం: కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని తరచుగా వింటుంటాం. కానీ ఉన్న నిధులతో, అందుబాటులో ఉన్న సాంకేతికతతో చిన్న చిన్న ప్రాజెక్టులనైనా ఎందుకు చేపట్టలేకపోతున్నాం? ఒకవేళ అటువంటి ప్రాజెక్ట్ లు చేసివుంటే కనీసం జాలగూడులో ఎందుకు లభించడం లేదు? కనీసం జాలగూడును కూడా సరిగా నిర్వహించలేని స్థితిలో ఒక సంస్థ ఉండడం చాలా బాధాకరం.

మన కేంద్రం నాలుగు గోడల మధ్య, కేవలం పరిపాలనాపరమైన చిక్కుల్లో కూరుకుపోయిందా? అనే అనుమానం కలుగుతోంది. పరిశోధన అంటే కేవలం పాత పుస్తకాలను తిరగవేయడం కాదుబీ ఆ జ్ఞానాన్ని వర్తమానానికి అన్వయించి, భవిష్యత్తుకు అందించడం. ఆ పనిలో తెలుగు సంస్థ విఫలమైతే, మనం వెనుకబడిపోయాం అనేది చేదు నిజం.

భవిష్యత్ కార్యాచరణ – మనం ఏం చేయాలి? విమర్శించడం సులభం, కానీ పరిష్కారం చూపడం ముఖ్యం. CICT నుండి స్ఫూర్తి పొంది, తెలుగు భాషాభివృద్ధికి మనం తక్షణం చేపట్టాల్సిన చర్యలు కొన్ని ఉన్నాయి.

లఘు గ్రంథాల అనువాదం: మహాభారతం, రామాయణం, భాగవతం వంటి బృహద్గ్రంథాల జోలికి వెళ్లే ముందు, వేమన పద్యాలు, సుమతీ శతకం, బద్దెన నీతులు వంటి చిన్నవి ప్రభావవంతమైన రచనలను ఎంచుకోవాలి. వీటిని అన్ని భారతీయ భాషల్లోకి అనువదించే ప్రాజెక్టును వెంటనే చేపట్టాలి.

విశ్వవిద్యాలయాలు/సంస్థలతో ఒప్పందాలు: కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో/కేంద్రాలతో కలిసి కార్యశాలలు నిర్వహించాలి.

**డిజిటలైజేషన్:** తాళపత్ర గ్రంథాల సేకరణతో పాటు, వాటిని స్కాన్ చేసి, యూనికోడ్‌లో టైప్ చేయించి, శోధించడానికి వీలుగా (Searchable Format) అంతర్జాలంలో ఉంచాలి.

**యువతకు భాగస్వామ్యం:** భాషా పరిశోధన అంటే కేవలం కొద్దిమంది పండితులకే పరిమితం కాకూడదు. ఆధునిక సాంకేతికత తెలిసిన యువతను, సాఫ్ట్‌వేర్ నిపుణులను కలుపుకుని 'డిజిటల్ హ్యూమానిటీస్' (Digital Humanities) ప్రాజెక్టులు చేపట్టాలి.

భాష అనేది ఒక భావోద్వేగం మాత్రమే కాదు, అదొక బాధ్యత. ఢిల్లీలో CICT నిర్వహించిన ఈ కార్యశాల 'ఇతర భారతీయ భాషల వారూ అధ్యయనం చేయదగిన ఒక నమూనా' లాంటిది. 12వ శతాబ్దపు 'అవ్వైయార్' మాటలను 21వ శతాబ్దపు గ్లోబల్ విలేజ్‌కు వినిపించడంలో వారు చూపిన విధానం, తెలుగు సంస్థకు ఆదర్శం కావాలి. ప్రాచీన తెలుగు వెలుగును ప్రపంచానికి చూపించలేకపోతే, అది కేవలం తెలుగు సాహిత్య చరిత్ర పుటల్లోనే మగ్గిపోతుంది.

ఇప్పటికైనా మన విధివిధాన నిర్ణేతలు, తెలుగు భాషాభిమానులు, ముఖ్యంగా 'తెలుగు సంస్థ వారు' మేల్కొనాలి. నిధుల గురించి సాకులు చెప్పడం మాని, ఉన్న వనరులతో, ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగాలి. తమిళులు ఢిల్లీలో చేసిన 'సాహిత్య యాత్ర'ను ఒక ప్రేరణగా తీసుకోవాలి. మన కవుల రచనలను ప్రపంచ వేదికపై నిలబెట్టాలి. అంతర్జాతీయ యవనికపై తెలుగు జెండా ఎగరడం అంటే కేవలం నాయకుల ప్రసంగాల్లో కాదుబీ పారిస్ లైబ్రరీలోనో, లండన్ బుక్ స్టోర్లోనో మన 'ప్రాచీన తెలుగు రచనల' అనువాదం కనిపించినప్పుడు, జర్మన్ విద్యార్థి మన 'పోతన'ను చదివి తల ఊపినప్పుడు... అప్పుడు నిజమైన తెలుగు వెలుగు ప్రసరించినట్లు. ఆ రోజు త్వరలోనే రావాలని... వస్తుందా?

ప్రొఫెసర్ వెంకట
రామయ్య గంపా
venkat@il.du.ac.in
gvramaiah@gmail.com
Room No. F13,
Department of Indian
Languages and Literary
Studies,
Tutorial Building,
University of Delhi,
Delhi -110007.
Phone: 9958607789



# అమెరికా ఇక ప్రపంచాన్ని శాసించదా?

## ట్రంప్ వ్యూహ పత్రం లేపుతున్న ప్రశ్నలు!

డొనాల్డ్ ట్రంప్ తనకు ముందు వచ్చిన అమెరికా అధ్యక్షుల నుంచి భిన్నమైన రాజకీయ దృక్కోణానికి ప్రతినిధిగా మారారు. అయితే ఆ దృక్కోణాన్ని అమలు చేసే సామర్థ్యం ఆయనకు ఎంతవరకు ఉందన్నది ఇప్పటికీ అసమానంగా కనిపిస్తోంది. నవంబర్ 25న ట్రంప్ తన రెండో పదవీకాలానికి సంబంధించిన జాతీయ భద్రతా వ్యూహంను విడుదల చేశారు. ఇది 2017లో విడుదలైన ఆయన తొలి జాతీయ భద్రతా వ్యూహంతో పోలిస్తే "అమెరికా ఫస్ట్" రాజకీయాలకు మరింత స్పష్టంగా అనుగుణంగా ఉంది. జాతీయ భద్రతా వ్యూహం అనేది ప్రతి అధ్యక్షుడు తన పదవీకాలంలో దేశ విదేశాంగ విధానాలపై ఎలా ఆలోచిస్తున్నాడు, ప్రపంచాన్ని ఎలా చూస్తున్నాడు అనే విషయాలను వెల్లడించే కీలక పత్రం.



తన తొలి పదవీకాలంలో ట్రంప్ అమెరికా వృత్తిపరమైన వ్యూహాత్మక వర్గాల చుట్టూ ఉండాల్సి వచ్చింది. 2017 జాతీయ భద్రతా వ్యూహంలో అప్పటి వరకు కొనసాగిన అమెరికా సంప్రదాయ ఆలోచనలే ప్రతిధ్వనించాయి. దీంతో ట్రంప్‌కు నిజంగా ప్రత్యేకమైన ప్రణాళికలు ఉన్నాయా లేదా, బరాక్ ఒబామా "వాషింగ్టన్ ప్లేబుక్" అని పేర్కొన్న విధానాన్ని పక్కన పెట్టగల సామర్థ్యం ఆయనకు ఉందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ రెండోసారి పరిస్థితి భిన్నంగా ఉంది. తాజా జాతీయ భద్రతా వ్యూహం ఈ మార్పును స్పష్టంగా చూపిస్తోంది. అమెరికా వ్యూహాత్మక దృక్కోణంలో ట్రంప్ చేస్తున్న ఈ కొత్త ఆలోచనా మార్పు యూరప్, రష్యా, చైనాల పట్ల అమెరికా వైఖరిని పూర్తిగా మలచగల సామర్థ్యం కలిగి ఉంది. దేశీయ వ్యవస్థలో ఎదురయ్యే ప్రతిఘటనలను అధిగమించగలిగితే, 2025 జాతీయ భద్రతా వ్యూహం ఈ శతాబ్దానికి కొత్త ప్రపంచ క్రమానికి పునాది కావచ్చని కూడా భావిస్తున్నారు.

2017 వ్యూహ పత్రంలో రష్యా దాదాపు ఎల్లప్పుడూ ప్రతికూల పదజాలంతో ప్రస్తావించబడింది. చైనాతో కలిసి ఈ రెండు దేశాలను అమెరికాకు శత్రువులుగా చిత్రీకరించారు. కానీ 2025 వ్యూహ పత్రంలో రష్యా పేరు పది సార్లు, చైనా పేరు 21 సార్లు ప్రస్తావించబడినప్పటికీ, స్పష్టమైన శత్రుత్వ ధోరణి కనిపించదు. ఈ రెండు దేశాలు ఒకచోట ప్రస్తావించబడిన సందర్భాలు చాలా తక్కువ. ఇది యూరప్ వ్యూహంపై ఆత్మపరిశీలనకు దారి తీస్తోంది. నేటి రోజుల్లో జర్మనీకి చెందిన రసాయన కంపెనీలు తమ దేశంలో సాధ్యం కాని భారీ ఉత్పత్తి కేంద్రాలను చైనాలో నిర్మిస్తున్నాయి. 2017లో ట్రంప్ చైనాపై తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు మాత్రం ఆయన మరింత వాస్తవిక దృక్కోణం అవలంబిస్తున్నట్టు కనిపిస్తోంది. వైట్ హౌస్‌లో జరిగిన ఒక క్యాబినెట్ సమావేశంలో చైనా అభివృద్ధి, తయారీ రంగం, సాంకేతిక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా తన పట్టు ఎలా సాధించిందో అన్నదానిపై ఒక రకమైన అభిమానం కూడా వ్యక్తమైంది. ఈ స్థాయికి చైనా ఎదగడానికి గ్లోబలైజేషన్ ద్వారా అవకాశం కల్పించినది అమెరికా వ్యూహ వైఫల్యమేనని ఈ పత్రం పేర్కొంటుంది.

2017లో జాతీయ భద్రతా వ్యూహం రష్యాపై యూరప్‌ను బెదిరించడం, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడం, ఎన్నికల్లో జోక్యం చేసుకోవడం వంటి ఆరోపణలు చేసింది. ఇవన్నీ ట్రంప్ దేశీయ రాజకీయ ప్రత్యర్థులు చేసిన ఆరోపణలతో సరిపోలేవే. 2017 వ్యూహం ప్రకారం అమెరికా, యూరప్ కలిసి రష్యా దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలని పేర్కొన్నారు. కానీ 2025 వ్యూహంలో యూరప్‌ను మాత్రం పలు కారణాలతో తీవ్రంగా విమర్శించారు. రష్యా విషయంలో మాత్రం భవిష్యత్తులో స్థిరత్వం నెలకొల్పే భాగస్వామిగా చూడాలని సూచించారు. అయితే ఆ స్థిరత్వం యూరప్‌తో పాటు రష్యాతో వ్యూహాత్మక స్థిరత్వం సాధించడానికే పరిమితం అన్న భావన కూడా వ్యక్తమైంది.

ప్రపంచాధిపత్యం విషయానికి వస్తే, అమెరికా వ్యూహంలో భారత్ స్థానం ఎప్పుడూ సందర్భానుసారంగానే ఉంటుంది. తాజా మార్పులు న్యూఢిల్లీకి కొంత ప్రయోజనకరంగా మారే అవకాశం ఉంది. ప్రపంచాన్ని శిబిరాలుగా విభజించే వ్యూహానికి ట్రంప్ ఆసక్తి చూపడం లేదు. వాణిజ్య ఒప్పందాలు, అంతర్జాతీయ సంస్థలు, గ్లోబల్ గవర్నెన్స్ ద్వారా అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించాలన్న దశాబ్దాల డెమొక్రటిక్ విధానాల జ్ఞానాన్ని ఈ వ్యూహం విస్మరిస్తోంది. అమెరికా ప్రపంచాన్ని శాసించాలనే లక్ష్యాన్ని వదిలేయాలని కూడా ఈ పత్రం సూచిస్తోంది. ఇతర దేశాల్లో పాలన నిర్మాణాలు ఏర్పాటు చేయడం వంటి ప్రయత్నాలను వ్యర్థమైనవిగా అభివర్ణిస్తోంది. కీలక ప్రయోజనాలు దెబ్బతిననంత వరకు ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోని ధోరణిని ఇది సమర్థిస్తోంది.

2. ఈ వ్యూహ పత్రం ప్రకారం ప్రపంచ రాజకీయ వ్యవస్థకు కేంద్ర బిందువు దేశరాష్ట్రమే. ప్రతి దేశం తన స్వప్రయోజనాలను ముందుకు పెట్టుకోవడం సహజమని, న్యాయమని ఇందులో పేర్కొన్నారు. దేశాలు తమ ప్రయోజనాలను ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ప్రపంచం సక్రమంగా పనిచేస్తుందని ఈ పత్రం స్పష్టం చేస్తోంది. అమెరికా కూడా తన ప్రయోజనాలను ముందుకు పెడుతుందని, ఇతర దేశాలు కూడా అలాగే చేయాలని ప్రోత్సహిస్తుందని తెలిపింది. అంతర్జాతీయ సంస్థలు దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీయకుండా, ఆయా దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని ఈ వ్యూహం పేర్కొంటుంది. గత అర శతాబ్ద కాలంగా కొనసాగిన అమెరికా లిబరల్ రాజకీయ ధోరణి నుంచి ఇది తీవ్రమైన మలుపుగా విశ్లేషించబడుతోంది. అమెరికా ప్రధాన ప్రయోజనాలుగా దేశ భద్రత, సంపద, స్థిరత్వాన్ని కాపాడుకోవడం, తన పరిసర ప్రాంతాల్లో బాహ్య శక్తుల జోక్యం లేకుండా చూడడం ఈ పత్రం పేర్కొంటుంది. ఇది లాటిన్ అమెరికాలో చైనా ప్రభావాన్ని సూచించే పరోక్ష వ్యాఖ్యగా భావించవచ్చు. ఆర్థిక ముప్పుల నుంచి దేశాన్ని కాపాడుకోవడం, మళ్లీ పరిశ్రమీకరణ చేయడం అవసరమని ఈ వ్యూహం చెబుతోంది. అదే సమయంలో దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా కీలకమని పేర్కొంది. కఠినమైన సరిహద్దులు, నియంత్రిత వలస విధానం, సంప్రదాయ విలువలతో కూడిన కుటుంబ వ్యవస్థ, ఆరోగ్యకరమైన పిల్లలు వంటి అంశాలు ఈ ప్రణాళికలో భాగం.

ఈ జాతీయ భద్రతా వ్యూహం యూరప్‌పై తన జాతీయ, అంతర్జాతీయ విధానాలను పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని గట్టిగా సూచిస్తోంది. అమెరికా, యూరప్ మధ్య ఉన్న బంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, రష్యాను కూడా అదే భౌగోళిక పరిధిలో చూడాలని భావిస్తోంది. చైనాను మాత్రం యూరప్ నుంచి దూరంగా ఉంచాలన్న సంకేతాలు ఇందులో ఉన్నాయి. పసిఫిక్ ప్రాంతంలో చైనాతో ప్రత్యేక శక్తి సమతుల్యతను అమెరికా కొనసాగించాలన్న ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.

యూరప్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలుగా యూరోపియన్ యూనియన్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాజకీయ స్వేచ్ఛను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడం, వలస విధానాల వల్ల సమాజంలో ఉద్రిక్తతలు పెరగడం, భావప్రకటన స్వేచ్ఛపై ఆంక్షలు, రాజకీయ ప్రత్యర్థుల అణచివేత, జనన రేటు పడిపోవడం, జాతీయ గుర్తింపుల క్షీణత వంటి అంశాలను ఈ వ్యూహం పేర్కొంటుంది.

అయితే ఈ పత్రం అనేక అంశాలపై స్పష్టత ఇచ్చినప్పటికీ, అమెరికా వ్యూహంపై దేశంలో చర్చ ఇంకా పూర్తిగా స్థిరపడలేదు. ఈ వ్యూహంలోనే కొన్ని విరుద్ధతలు కనిపిస్తాయి. ఒకచోట అమెరికా ప్రపంచాన్ని శాసించాలనుకోవడం లేదని చెబుతూనే, మరోచోట సాంకేతికత, ఆర్థిక రంగాల్లో ఆధిపత్యాన్ని కొనసాగించాలన్న ఉద్దేశాన్ని స్పష్టంగా ప్రకటిస్తుంది. కృత్రిమ మేధస్సు, కీలక ఖనిజాలు వంటి రంగాల్లో గ్లోబల్ ప్రమాణాలను నియంత్రించాలన్న లక్ష్యం కూడా ఇందులో ఉంది. అమెరికా మిత్రదేశాలపై గర్వం వ్యక్తం చేస్తూనే, గత పాలనల జ్ఞానాన్ని విస్మరించడం ఈ వ్యూహంలో కనిపిస్తుంది. ట్రంప్ యొక్క యుద్ధ వ్యతిరేక ధోరణి అమెరికా వ్యూహాత్మక వర్గాలకు, సైనిక–పరిశ్రమ సముదాయానికి అంతగా నచ్చడం లేదు. ట్రంప్ జాతీయ భద్రతా వ్యూహం ప్రపంచంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో స్పష్టమే అయినప్పటికీ, అది దేశంలోని పాతుకుపోయిన వ్యవస్థలను దాటుకొని అమలవుతుందా లేదా అన్నది ఇంకా అనిశ్చితంగానే ఉంది.

డొనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి సంప్రదాయ అమెరికా రాజకీయాలకు పూర్తిగా భిన్నమైనది. ఆయన నిర్ణయాలలో సంస్థాగత సలహాలకన్నా వ్యక్తిగత నమ్మకాలకు ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. మిత్రదేశాల పట్ల కూడా లాభనష్టాల కోణంలోనే వ్యవహరించే ధోరణి ఆయన రాజకీయ శైలికి లక్షణం. మాటల్లో కఠినత్వం ఉన్నా, అమలులో మాత్రం వ్యావహారికత చూపడం ఆయనకు ప్రత్యేకత. గ్లోబలైజేషన్ భావనను ప్రశ్నిస్తూ జాతీయ సార్వభౌమత్వాన్ని కేంద్రంగా ఉంచడం ద్వారా ఆయన దేశీయ మద్దతును బలపరిచారు. అదే సమయంలో అంతర్జాతీయ వేదికలపై అనిశ్చితిని పెంచారు. సంస్థలకన్నా నాయకుడే ముఖ్యమన్న భావనను ముందుకు తెచ్చి అమెరికా విదేశాంగ విధానాన్ని వ్యక్తీకరించారు. ఈ ధోరణి వల్ల అమెరికా ప్రపంచ నాయకత్వం నైతిక ఆధిపత్యం నుంచి శక్తి సమతుల్యత వైపు మళ్లింది. భవిష్యత్తులో అమెరికా ప్రపంచ ప్రభావం సంపూర్ణ ఆధిపత్యంగా కాకుండా ప్రాంతీయ శక్తుల మధ్య మధ్యవర్తిగా మారే అవకాశాలు ఉన్నాయి. ట్రంప్ రాజకీయ వారసత్వం ప్రపంచాన్ని ఏకధాటిగా నడిపించే శక్తిగా కాక, స్వప్రయోజనాలపై ఆధారపడిన అమెరికా రూపాన్ని మరింత స్పష్టంగా మలిచే దిశగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

అమెరికా అధిపత్యం ప్రపంచ దేశాలపై చూపే ప్రభావం ఇకపై ఒకే రూపంలో ఉండే అవకాశం లేదు. గతంలోలా రాజకీయ, సైనిక, ఆర్థిక రంగాలన్నింటిలో నిర్దిష్ట ఆజ్ఞాపకుడిగా వ్యవహరించే స్థితి క్రమంగా మారుతోంది. అమెరికా విధానాలు వాణిజ్యం, సాంకేతికత, భద్రత రంగాలలో కొన్ని దేశాలకు అవకాశాలను కల్పించినా, అదే సమయంలో అనేక దేశాలను తమ స్వంత వ్యూహాలు రూపొందించుకునే దిశగా నెట్టుతున్నాయి. ఫలితంగా ప్రపంచం ఒకే కేంద్రం చుట్టూ తిరిగే వ్యవస్థ నుంచి బహుళ శక్తి కేంద్రాల వ్యవస్థగా మారుతోంది. ఈ పరిస్థితిలో అమెరికా ప్రభావం తగ్గినట్టు కనిపించినా, అది పూర్తిగా అంతరించదు. అది ప్రత్యక్ష ఆధిపత్యంగా కాకుండా నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తిగా, సమతుల్యతను నిర్ణయించే పాత్రగా కొనసాగుతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



# కార్మిక హక్కుల పోరాటం

## గతం నుంచి భవిష్యత్తు వరకు

భారతదేశంలో కార్మికుల పోరాట చరిత్ర బ్రిటిష్ వలస పాలన కాలంలోనే మొదలైంది. పనిచేసే మనుషులను కేవలం పనిముట్లుగా చూసే పీడన వ్యవస్థకు వ్యతిరేకంగా వారు సంఘటితమై పోరాడారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వం 41 కార్మిక చట్టాలను రూపొందించి అమలు చేసింది. కనీస వేతనం, రోజుకు 8 గంటల పని, భద్రతా షరతులు, సామూహిక బేరసారాల హక్కు, ఉద్యోగ తొలగింపుపై నియంత్రణ వంటి మౌలిక హక్కులు ఈ చట్టాల ద్వారా రక్షణ పొందాయి. ఇవి కార్మికుల రక్తం, చెమటతో సాధించినవే. ఇటుక మీద ఇటుక పెట్టినట్లు బలమైన గోడలా ఈ చట్టాలు నిర్మితమయ్యాయి.

### 41 నుంచి 4 వరకు: సరళీకరణ పేరుతో మార్పు

2019లో కేంద్ర ప్రభుత్వం పెద్ద మార్పుకు శ్రీకారం చుట్టింది. 41 చట్టాల్లో 29ను రద్దు చేసి, మిగిలిన 12 ఆధారంగా నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తీసుకొచ్చింది. అవి: వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత–ఆరోగ్యం–పని పరిస్థితుల కోడ్. ఇది 'సరళీకరణ', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో జరిగింది. కానీ, కార్మిక సంఘాలు దీన్ని హక్కులపై దాడిగా భావిస్తున్నాయి. ఈ మార్పుల్లో కార్మికులను సంప్రదించకపోవడం పెద్ద లోపం. దేశవ్యాప్తంగా కార్మికులు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నారు.

### కొత్త కోడ్‌లు: హక్కులకు ముప్పు


ఈ కోడ్‌లు కార్మికులకు ఎలా నష్టం కలిగిస్తాయో చూద్దాం. ముందుగా, సామూహిక బేరసారాల శక్తి తగ్గుతుంది. పాత చట్టాల్లో 100 మంది కార్మికుల సంఘం గుర్తింపు పొందేది. ఇప్పుడు పారిశ్రామిక సంబంధాల కోడ్ ప్రకారం మొత్తం యూనిట్లలో 51 శాతం మంది అంగీకరించాలి. ఇది సంఘాల ఏర్పాటును కష్టతరం చేస్తుంది. రెండోది, ఓవర్‌టైమ్ గంటలు పెరిగే అవకాశం. ఇది ఆరోగ్యం, కుటుంబ జీవితానికి హానికరం. మూడు నెలల వేతన గ్రాట్యుటీ అర్హతను 5 సంవత్సరాలకు పెంచడం వల్ల తాత్కాలిక కార్మికులు నష్టపోతారు. మూడోది, ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగాలు సులభమవుతాయి. దీంతో కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరిగి, శాశ్వత ఉద్యోగాలు తగ్గుతాయి. ఉద్యోగ భద్రత దెబ్బతింటుంది. నాలుగోది, ప్రభుత్వానికి, యాజమానులకు ఎక్కువ అధికారాలు. స్టార్టప్‌లకు మినహాయింపులు ఇవ్వడం వల్ల కార్మిక రక్షణ తగ్గుతుంది. ఐదోది, చిన్న సంస్థల్లో భద్రతా నిబంధనలు 40 మందికి పైగా పనివారికి మాత్రమే వర్తించడం. ఇది వేలాది కార్మికుల రక్షణను బలహీనపరుస్తుంది. ఆరోది, కార్మిక కోర్టుల ప్రాముఖ్యత తగ్గడం. వివాదాల్లో సమధానం వైపు మొగ్గు చూపడం యజమానులకు అనుకూలం.

### సంఘాలకు సూచనలు: ఐక్యతే శక్తి

ఈ సవాలును ఎదుర్కోవడానికి కార్మిక సంఘాలు వ్యూహాలు రూపొందించాలి. ముందుగా, విస్తృత ఐక్యత. వృత్తి, రాజకీయ వ్యత్యాసాలు మరచి అన్ని కార్మికులను ఒకే వేదికపైకి తీసుకురావాలి. రెండోది, చట్టపరమైన విచారణ. నిబంధనలను విశ్లేషించి, సుప్రీం కోర్టుకు వెళ్లడం. మూడోది, సామాజిక మాధ్యమ ప్రచారం. ప్రతికూల ప్రభావాలను సులభంగా వివరించాలి. నాలుగోది, రాజకీయ పార్టీల సహకారం. అన్ని పార్టీలతో మాట్లాడి, ఎన్నికల్లో ఓటు శక్తిని వినియోగించాలి. ఐదోది, సృజనాత్మక నిరసనలు. స్ట్రైక్‌లతో పాటు ఆన్‌లైన్ క్యాంపెయిన్లు, ఆర్ట్ ప్రదర్శనలు. ఆరోది, స్థానిక స్థాయి సంఘటన. రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి. ఏడోది, డేటా సేకరణ. నష్టాలను నిరూపించే కేస్ స్టడీలు. ఎనిమిదోది, యువతను చేర్చుకోవడం. అస్థిర ఉద్యోగాల సమస్యలపై ఫోకస్.

### భవిష్యత్ పోరాటం: గౌరవం, భద్రత కోసం

కార్మిక చట్టాల సరళీకరణ నిజంగా హక్కులను సరళీకరించకూడదు. చరిత్రలో త్యాగాలతో సాధించినవి ఒక్క నిమిషంలో కోల్పోకూడదు. సంఘాలు పోరాట పద్ధతులను ఆధునికీకరించాలి. ఐక్యత, ప్రచారం, చట్టపరమైన జ్ఞానం, సృజనాత్మక నిరసనల ద్వారా సంక్షోభాన్ని ఎదుర్కోవాలి. కార్మికుడి గౌరవం, భద్రత దేశ ఆర్థిక వ్యవస్థకు ఆధారం. ఇది సమాజానికి, ప్రభుత్వానికి గుర్తు చేయాలి. భవిష్యత్ పోరాటం వేతనాలకు మాత్రమే కాదు, ఉద్యోగ భద్రత, గౌరవానికి పునాది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- ఇండ్ల స్థలాలపై కొత్త విధానం తేవాలి
- టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా 3వ మహాసభ ఏకగ్రీవ తీర్మానం
- మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**మల్కాజిగిరి, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ఆడహాక్ కమిటీ కన్వీనర్ పిల్లి రామచందర్, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం మల్కాజిగిరి నేరేడ్ మెట్ ఎస్ ఎస్ గార్డెన్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా మూడవ మహాసభ ఘనంగా జరిగింది. టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుమ్మడి హరిప్రసాద్ అధ్యక్షత జరిగిన ఈ మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల సాధనే ధ్యేయంగా ఏర్పడిన టీడబ్ల్యూజేఎఫ్ ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినది కాదనీ, స్పష్టం చేశారు.జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం తేవాలని కోరారు. జర్నలిస్టుల పట్ల వారి సమస్యల పట్ల చిత్తశుద్ధితో కూడిన నిబద్ధతతో పనిచేసే ఏకైక సంఘం టిడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. సంఘంగా గుర్తింపు పొంది సమస్యల పట్ల పోరాటం చేస్తూ, జర్నలిస్టుల పక్షాన పోరాడే సంఘంగా గుర్తింపు తెచ్చుకుందని అన్నారు.సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలను ఖండించారు.జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని చెప్పారు.జిల్లా కో కన్వీనర్ పి. మల్లేష్ జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని, అక్రిడిటేషన్ కార్డులు హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా మల్లేశ్, ఉపాధ్యక్షులుగా రోజా రాణి, రామ్ బాబు, నరేంద్ర, కార్యదర్శిగా బానోతు రవి, సహాయ కార్యదర్శులుగా సత్యనారాయణ, సింగం రాజు, సుధాకర్, కోశాధికారిగా మధు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా దుర్గాప్రసాద్, గుంటి సహదేవ్, పాండు, హుస్సేన్, రజనీకాంత్, మహేందర్, పి నరసింహమ్మ, అరుణ్ కుమార్, విష్ణు, సిహెచ్ నరసింహ, బాలకృష్ణ, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, చైతన్య రెడ్డి ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా వినోద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గుమ్మడి హరిప్రసాద్, బాలు, రాజేంద్ర ఎన్నికయ్యారు.

## ఫ్లైట్ హైదరాబాద్ ఏరో రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



**శామీర్‌పేట్, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** శామీర్ పేట్ ఏరియా ఒక టూరిస్ట్ ప్లేసుగా తయారు అవుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్ చౌరస్తాలో నూతన ఫ్లైట్ రెస్టారెంట్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. శామీర్ పేట అంటేనే పెద్ద టూరిస్ట్ ప్లేస్ ఇక్కడ మల్లారెడ్డి ఫ్లై సిటీ హైదరాబాద్ రెస్టారెంట్ ప్రారంభించడం జరిగిందన్నారు. సరసమైన ధరలు నాణ్యమైన ఆహారం అందరికి అందుబాటులోకి తీసుకొచ్చం అందరూ ఎంజాయ్ చేయండి అని ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డి అన్నారు. 120మందికి ఫ్లయిట్ లో రెస్టరెంట్ పెద్దలకు పిల్లలకు ఐటీ పీపుల్ కు గేమ్స్ కోసం గో కట్ ఉంది. ఫస్టు టైమ్ హైదరాబాద్ లో ఫ్లైట్ రెస్టారెంట్ అందరూ ఎంజాయ్ చేయొచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చామకూర డాక్టర్ భద్రారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ ఇంచార్జి మహేందర్ రెడ్డి, స్థానిక బి ఆర్ ఎస్ నాయకులు మధుకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, అనిత, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# కార్మికులకు సామాజిక భద్రత చట్టం రావాలి

- రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన అధ్యక్షులు ఎల్లయ్య



**శామీర్‌పేట్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత చట్టం తీసుకురావాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. తుంకుంట మున్సిపాలిటీలో మొగుళ్ళ ఫంక్షన్ హాలులో జరుగుతున్న రాష్ట్ర 5వ భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల్లో ఆదివారం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బొల్లినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర అధ్యక్షులుగా ఎల్లయ్యను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎల్లయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులు కోటి మంది ఉన్నారని వారికి సామాజిక భద్రత చట్టం తీసుకురావాలని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా రని గుర్తు చేశారు.30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉండగా సెస్ ద్వారా సమకూరిన రూ.6 వేల కోట్లను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్ట కుండా గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇతర శాఖలకు మళ్లించిందని ఆరోపించారు. సీఎస్సీకి 500 కోట్లు, ఇన్సురెన్స్ సంస్థలకు 346 కోట్ల రూపాయలు ఇచ్చి భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేశారని అన్నారు.7 లక్షల మంది ఉన్న హమాలీ కార్మికులకు రక్షణ, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని, 25 లక్షల మంది ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్మికులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.కార్మికులకు ఉరితాళ్లుగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్రంలోఅమలు చేయమని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు.అనంతరం కార్య క్రమానికి విచ్చేసిన తుంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్ ను కార్మిక సంఘం నాయకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు రాష్ట్ర మాజీ అధ్యక్షులు నీలం భిక్షపతి, ఉపాధ్యక్షులు పాపారావు, జిల్లా అధ్యక్షులు బొల్లినేని శ్రీనివాస్, మండల అధ్యక్షులు నాగులు, గ్రామాల నాయకులు లాజర్, మ్యాకల రమేష్, ఆంజనేయులు, శ్రీరాములు, బాలయ్య, రాములు, నర్సిహ్మ, కార్మికులు పాల్గొన్నారు.

# మణికొండలో డివిజన్ల విభజనపై బీజేపీ అభ్యంతరం




**రాజేంద్రనగర్, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** మణికొండ డివిజన్-127, నెక్నాపూర్ డివిజన్-128 ఏర్పాటు నేపథ్యంలో ఈ రోజు జరిగిన సమావేశంలో డివిజన్ల విభజనపై భారతీయ జనతా పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ డివిజన్ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారి ద్వారా కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మణికొండ పాత మున్సిపాలిటీలో సుమారు 90 వేల జనాభా ఉండగా, మణికొండ-పుప్పాలగూడ-నెక్నాపూర్ పరిధిలో ఓటర్ల పరంగా ఆరు డివిజన్లు ఏర్పాటుకు అర్హత ఉందని నేతలు తెలిపారు. అయితే ప్రభుత్వం కేవలం రెండు డివిజన్లకే పరిమితం కావడం అన్యాయమని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో కేవలం 20 వేల జనాభా ఉన్నప్పటికీ ఒక్క డివిజన్ ఏర్పాటు చేయగా, మణికొండలో భారీ జనాభా ఉన్నా తగిన సంఖ్యలో డివిజన్లు కేటాయించలేదని పేర్కొన్నారు. మొత్తం 300 డివిజన్లు ఏర్పాటు చేసిన సందర్భంగా, అన్ని డివిజన్లలో సమానంగా ఓటర్లు ఉండేలా సమ న్యాయం పాటిస్తూ విభజన చేయాలని డిమాండ్ చేశారు. మణికొండలో కూడా ఆరు డివిజన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. అంజన్ కుమార్ గౌడ్, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీకాంత్ స్వామి, వందన నాగేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు జె. సిద్ధప్ప, చిలుకూరి బీరప్ప, ప్రధాన కార్యదర్శులు జి. వినోద్,కె. శివరాం రెడ్డి, కోశాధికారి వై. యాదయ్య, వేణు, కందుల శ్రీనివాస్ రెడ్డి, శ్రవంతి, వైస్ ప్రెసిడెంట్లు ఓరిస్ మధు రేఖ, ఆనందరావు, శంకర్ సింగ్, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారి



**నవాబుపేట్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ఉన్న ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా ఆస్పత్రి సూపర్డెంట్ చూడాలనిఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, కావలసిన మెడిసిన్, సిరప్ లు, ఇంజక్షన్లు, బ్లడ్ టెస్ట్ లు, బిపి షుగర్ అన్ని విధాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూపర్డెంట్ స్వర్ణకుమారి పేర్కొన్నారు. ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అన్ని విధాల సరిపడే ఇంజక్షన్లు, మందులు, మండల పరిధిలోని ఉన్నటువంటి గ్రామాలలో ఉన్నటువంటి సబ్ సెంటర్లో అన్ని విధాలుగా ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. ప్రజలకు ఆసుపత్రి 24 గంటలు అందుబాటులో ఉండాలి అన్నారు. ఆమె ఆస్పత్రిలో ఉన్న రికార్డులను తనిఖీ చేసి ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని అని ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిలో ప్రజలకు టాయిలెట్లు, బాత్రూంలో, త్రాగడానికి, అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఆమె తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతి గ్రామంలో హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి స్టాఫ్ ను అందుబాటులో ఉండి విధంగా చూడాలని వికారాబాద్ జిల్లా వైద్య అధికారి సూపర్డెంట్ అధికారి స్వర్ణకుమారి తెలిపారు. నవాబుపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ రోహిత్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల వికాసానికి నగరంలో పోదార్ ప్రెప్ కేంద్రం ప్రారంభం

**ఖైరతాబాద్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** భారత దేశంలో అగ్రగామి విద్యా సంస్థలలో ఒకటైన పోదా ర్ ఎడ్యుకేషన్ నెట్వర్క్ నగరంలో కొత్త పోదార్ ప్రెప్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు పోదార్ ప్రెప్ కోకాపేట సెంటర్ డైరెక్టర్ బిందు గడ్డిపట్టి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో భాగంగా తల్లిదండ్రుల కోసం నిర్వహించిన 'స్క్రీన్ అండ్ స్క్రీమ్ పేరెంటింగ్' అనే వర్క్‌షాప్‌ను పిల్లల విద్య, అభివృద్ధి రంగంలో పేరొందిన పోదార్ ఎడ్యుకేషన్ నెట్వర్క్ ప్రెసిడెంట్, ఎర్లీ చైల్డ్ హుడ్ అసోసియేషన్ నిపుణురాలు డాక్టర్ స్వాతి పోపట్ వాట్స్ నిర్వహించినట్లు తెలిపారు. కొత్త కేంద్రం జాతీయ విద్యావిధానం-20 స్ఫూర్తితో పాటు ఈవైఎఫ్ఎస్ (యూకే), ఈవైఎల్ఎఫ్(ఆస్ట్రేలియా) మార్గదర్శకాలను ఆధారంగా చేసుకుని, బాల్యం తొలి దశలో నే పోషణతో కూడిన, ఆసక్తిని రేకెత్తించే విద్యా వాతావరణాన్ని అందించేందుకు రూపొందిందని తెలిపారు.



ఈ కేంద్రంలో ప్లే గ్రూప్(2-3 ఏళ్లు), నర్సరీ(3-4 ఏళ్లు), జూనియర్ కేజీ(4-5 ఏళ్లు), సీనియర్ కేజీ (5-6 ఏళ్లు) కోసం ప్రత్యేక ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## హామీలు అమలు చేయడమే ప్రధాన లక్ష్యం

- ప్రజల శ్రేయస్సు కోసమే బోరు బావి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ సంపత్ కుమార్



**తాండూరు, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** ఇచ్చిన మాట ప్రకారం ప్రజల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బి వి జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ బోర్ వేయించారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరు మండలం కోటబాస్ పల్లి గ్రామం 9వ వార్డులోని నీటి కష్టాల గురించి రాజన్న డా. సంపత్ కుమార్‌ని వివరించిన వెంటనే 9వ వార్డులో నాగేష్ ని గెలిపిస్తే తన సొంత నిధులతో బోర్ వేపిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా 9వ వార్డులో శనివారం రాత్రి బోర్ వేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ హామీలు అమలు చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ సంపత్ కుమార్ కు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

## ముడిమ్యాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**చేవెళ్ల, డిసెంబరు 14 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదివారం సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న తీరును, ఎన్నికలకు చేసిన చేసిన ఏర్పాట్లను తదితర విషయాలను అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం వంటి వివరాలను పోలీసు అధికారులు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆయన వెంట చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, చేవెళ్ల తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ హిమబిందు, డీఈవో షషిందర్ రావు, వెంకటేశ్వర్ రావు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ డివిజన్‌గా ప్రకటించాలి




**కాప్రా, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** జిహెచ్ఎంసి 16వ డివిజన్‌కి కుషాయిగూడ పేరు పెట్టాలి అని అలాగే కుషాయిగూడ గ్రామ హక్కు అయినటువంటి శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని 16 వ డివిజన్ కుషాయిగూడ లోకి మార్చాలని కోరుతూ ఈ రోజు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్ స్టాప్ నందు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి కుషాయిగూడ కు మద్దతుగా నాగార్జున నగర్ కాలనీ, వైష్ణవి ఎన్ క్లవ్ కాలనీ, సాయి నగర్ కాలనీ. కృష్ణారెడ్డి నగర్ కాలనీ, హనుమాన్ నగర్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, వి ఎన్ రెడ్డి కాలనీ, సోనియా గాంధీ నగర్ కాలనీ, సాయి వెంకట ఎన్ క్లేవ్, శివ సాయి నగర్ కాలనీ, మీనాక్షి నగర్ కాలనీ, లక్ష్మి నర్సింహా కాలనీ, పద్మ వతి కాలనీ, శుభోధయ కాలనీ, ల సభ్యులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలపడం జరిగింది. వీరితో పాటు కుషాయిగూడ వార్తక వ్యాపారాలు, కుషాయిగూడ మార్కెట్ సభ్యులు, కుషాయిగూడ కాంత వార్తక వ్యాపారాలు అలాగే కుషాయిగూడ యువత పెద్ద ఎత్తున ఈ ధర్నా లో పాల్గొని నిరసన తెలపడం జరిగింది. ఈ ధర్నాలో అన్నీ కాలనీల సభ్యులు మాట్లాడుతూ 16 వ డివిజన్ కు కుషాయిగూడ పేరు ప్రకటించాలని, రెండవది కుషాయిగూడ హక్కు అయినటువంటి పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని 16 వ డివిజన్ లోకి అధికారికంగా మార్చాలని ముక్త కంఠంగా డిమాండ్ చేశారు.

## గ్రామాభివృద్ధికి బాధ్యతగా కృషి చేయాలి

- ఆర్బీఓఎల్ ఎండీ బుయ్యని సరళారెడ్డి



**తాండూరు, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** గ్రామాభివృద్ధికి బాధ్యతగా కృషి చేయాలని ఆర్బీఓఎల్ ఎండీ బుయ్యని సరళారెడ్డి పేర్కొన్నారు. గ్రామపంచాయతీ తొలివిడత ఎన్నికల్లో యాలాల మండలం బెన్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచుగా మంజుల, ఉపసర్పంచుగా రాఘవేందర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఆదివారం వారు ఆర్బీఓఎల్ ఎండీ బుయ్యని సరళారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సరళారెడ్డి పంచాయతి సర్పంచు, ఉపసర్పంచు, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఐదేళ్లు కష్టపడి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు ఉన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

- సిఐటియు వికారాబాద్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్

**తాండూరు, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు వికారాబాద్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆదివారం తాండూర్ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు వికారాబాద్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కార్మిక హక్కులని చట్టాలని కాపాడుకోవడం కోసం భవన నిర్మాణ కార్మికులకు అడ్డాల దగ్గర రెస్ట్ రూమ్‌లు, మూత్రశాల లు రూ.5 రూపాయల భోజన క్యాంటీన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.డిసెంబర్ 31 నుండి 4 వరకు విశాఖపట్నంలో జరిగే 18 వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని, సోమవారం 15 న జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల కార్యాలయల కార్మిక నివాస ప్రాంతాలలో డివిజన్ కేంద్రాలలో మండల కేంద్రాలలో సిఐటియు జెండా ఎగిరేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపయోగపడని సి ఎస్ సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలన్నారు. వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించాలి. జీవో నెంబర్ 12 ను సవరించాలి. రెన్యువల్ గాని వెల్ఫేర్ బోర్డు కార్డులను రెన్యువల్ చేయాలి. పెన్షన్ ,సహజ మరణం కు 5 లక్షలు ఇవ్వాలని. పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులందరు కార్మిక హక్కుల కోసం కార్మిక చట్టాల కోసం ఐక్య ఉద్యమాల కోసం సిద్ధం కావాలని భవనిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు పక్కదారి మళ్ళించడాన్ని ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కుర్వ లక్ష్మణ్ ,ఉపాధ్యక్షులు సంతోష్ నాయక్ ,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అంతారం శ్రీనివాస్, గుండప్ప ,విజయ్ కుమార్ ,శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
15 డిసెంబర్ 2025

# అంగరంగ వైభవంగా కొమురవెల్లి మల్లన్న కళ్యాణం

● పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించిన మంత్రి సురేఖ

**కొమురవెల్లి, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** కోరినవారి కోర్కెలు తీర్చే కోరమీసాల కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన మల్లన్న కల్యాణ వేడుక ఆదివారం తోటబావి ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగింది. మల్లన్న శరణు శరణు అంటూ జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగిపోయింది. కన్నుల పండువగా జరిగిన మల్లన్న కళ్యాణాన్ని తిలకించడానికి భక్తులు బారులుతీరారు. శివసత్తులు శివాలెత్తగా, పోతారాజుల విన్యాసాలు, డమరుగా నాదాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం అర్చకుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా మల్లన్న కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను మల్లన్న మనువాడారు.

**పట్టు వస్త్రములు, ముత్యాల తలంబ్రాలు :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మల్లన్న కల్యాణోత్సవానికి హాజరై ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను వెండి పల్లెంలో నెత్తిన పెట్టుకుని సంప్రదాయ బద్దంగా మేళ, తాళలతో వచ్చి సమర్పించారు.



**పీఠాధిపతి పర్యవేక్షణలో మల్లన్న కళ్యాణం :**
పీఠాధిపతి శ్రీమహమండలశ్వర్ డాక్టర్ మహంత్ సిద్దేశ్వరానందగిరి స్వామీజీ పర్యవేక్షణలో వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం స్వామి వారి కల్యాణం జరిగింది.

**దిష్టి కుంభం బలిహరణ :**
ఆదివారం తెల్లవారుజామున ఆలయంలోని అర్ద మండపంలో దిష్టికుంభం బలిహరణ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. మూడు నెలల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు మల్లన్న కల్యాణంతో ప్రారంభమయ్యాయి. ప్రతియేటా మార్గశిర మాసం చివరి ఆదివారం స్వామి వారి కల్యాణం జరగడం ఆనవాయితీగా వస్తున్నది. వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ మహోత్సవం జరుగగా వధువుల తరఫున మహాదేవుని వంశస్థులు మహాదేవుని మాలతి వినయ్ కుమార్ కన్యాదానం చేయగా,వరుడి తరఫున పడిగన్నగారి వంశస్థులు పడిగన్నగారి బాలమణి మల్లేశం కన్యాదానం స్వీకరించారు.బలిజ మేడలాంబ, గొల్ల కేతమ్మ సామెత శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణం చూసి భక్తులు తరించారు.పాల్గుణ మాసం చివరి ఆదివారంతో జాతర బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**పటిష్ట బందోబస్తు :**
సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎం విజయ్ కుమార్ ఆదేశాల మేరకు హుస్నాబాద్ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ ఎల్ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐతో పాటు సీఐ లు, ఎస్ ఐ లు సుమారు 350 మంది పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో టంకాశాల వెంకటేష్,డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ రావు,ఆలయ కమిటీ చైర్మన్ గంగం నర్సింహా రెడ్డి,మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,ఏఈఓ బుద్ది శ్రీనివాస్,ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఆలయ సిబ్బంది, ఆలయ ధర్మకర్త లు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, ప్రవీణ్ యాదవ్, స్థానికులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**కౌడిపల్లి, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఆదివారం రోజు నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, హాజరై ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పోల నవీన్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కౌడిపల్లి లోని ఇంటింటికి, గడపగడపకి,తిరిగి ప్రచారం చేశారు. అనంతరం అంగడి బజార్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఎంతవరకు ప్రజలకు మేలు జరిగిందో ఒకసారి గమనించాలన్నారు. కెసిఆర్ హయంలో జరిగిన పాలనలో ప్రజలకు ఎన్ని సంక్షేమ పథకాలు అందాయో వాటన్నిటిని గుర్తు చేశారు. అలాగే కౌడిపల్లి నుండి ధర్మారం వరకు డబల్ రోడ్డు శాంక్షన్ అయిందని అన్నారు.ఈసారి రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను, కౌడిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న పోల నవీన్, ను వార్డ్ సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశాంతంగా రెండో విడత పోలింగ్



**మల్దకల్, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఆదివారంఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గద్వాల్ డిఎస్పి మొగిలయ్య పెద్దపల్లి,అమరవాయి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. మొత్తం ఓటర్లు 37 వేల 917 ఓట్ల గాను 18వేల 565 పురుషులు,19350 స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓట్లు 30548 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మండలంలోని 80. 57% పోలింగ్ జరిగింది. మండలంలోని పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూ లైన్ లో నిలబడి ఓటును వినియోగించుకున్నారు. ఆయా గ్రామాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావుమల్దకల్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

# వెబ్‌కాస్టింగ్‌తో పోలింగ్ కేంద్రాల పరిశీలన

● జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహణను జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు.ఆదివారం ఉదయం ఐడిఓసి సమావేశపు మందిరంలో వెబ్ కాస్టింగ్‌తో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తూ ఐజ, మల్దకల్,రాజోలి,వడ్డేపల్లి మండలాల్లో పోలింగ్ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రెండో విడత ఎన్నికలు జరిగే నాలుగు మండలాల్లో మొత్తం 74 గ్రామ పంచాయతీలలో 18 జీపీలు ఏకగ్రీవం కాగా మిగిలిన గ్రామ పంచాయతీలలో సర్పంచ్ తో పాటు 494 వార్డు సభ్యుల ఎన్నికకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆయా పోలింగ్ స్టేషన్లలో మొత్తం 567 మంది ప్రిసైడింగ్ అధికారులు,818 మంది ఓపిఓ లు విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామ పంచాయతీలలో మొత్తం 1,12,807 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.ఇందులో 57,094 మంది మహిళలు, 55,710 మంది పురుషులు, ఇతరులు ముగ్గురు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒక స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారి పోలింగ్ సజావుగా జరిగేందుకు పర్యవేక్షణ చేస్తారన్నారు. జోనల్,స్థానిక మండల స్థాయి అధికారులు, పోలీస్ యంత్రాంగం, ఇతర సిబ్బంది పోలింగ్ ను పకడ్బందీగా నిర్వహించేందుకు విధులు నిర్వర్తిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్



నర్సింగరావు,జడ్పీ డిప్యూటీ సీఈవో నాగేంద్రం,డిపిఓ శ్రీకాంత్, ఇతర అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మూడో విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే తుడి మేగా రెడ్డి

**శ్రీరంగాపూర్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రోజు శ్రీరంగాపూర్ మండల కేంద్రం ,నగరాల,షేర్ పల్లి గ్రామాలలో ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారంలో పాల్గొనడం జరిగింది. నాగరాల గ్రామంలో మహాదేవ్ అభ్యర్థి శ్రీరంగాపురం లో రామచంద్రయ్య షేర్ పల్లి గ్రామంలో చిర్ల నాగరాజు కాంగ్రెస్ పార్టీ తరఫున బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే తుడుమేగా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను వార్డ్ మెంబర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరడం జరిగింది. గ్రామాలలో ఉన్నటువంటి అన్ని సమస్యలను పరిష్కరించడంలో సర్పంచ్లకు తాను అండగా ఉంటానని పేర్కొనడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దశలో ముందుకు తీసుకుపోవడానికి పూర్తి సహకారం అందించడం జరుగుతుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ



అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విజయ వర్ధన్ రెడ్డి, వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, శ్రీరంగాపూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, దయాకర్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, ఎమ్ ఈశ్వరయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# మల్దకల్ కౌంటింగ్ కేంద్రంలో కలెక్టర్ పరిశీలన

**మల్దకల్, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తి శాంతియుత వాతావరణంలో సజావుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు.ఆదివారం మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్‌లో పారదర్శకత,ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని అన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ పత్రాలను లెక్కించి, తరువాత వార్డ్ మెంబర్ బ్యాలెట్ పేపర్లను వేరుచేసి క్రమపద్ధతిలో ఓట్లను లెక్కించాలని అధికారులను ఆదేశించారు.అన్ని వార్డుల లెక్కింపులు పూర్తయ్యాక సర్పంచ్ బ్యాలెట్ పత్రాలను కలిపి అభ్యర్థుల వారీగా లెక్కించాలని స్పష్టంగా సూచించారు.కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ వ్యవస్థ, సిబ్బంది సమన్వయం సమర్ధవంతంగా సాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫలితాలు వెలువడిన తరువాత ఎలాంటి అవాంఛనీయ



ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కౌంటింగ్ ప్రక్రియ శాంతియుత వాతావరణంలో సాగుతుందని తెలిపారు. కౌంటింగ్ అనంతరం పోలింగ్ సామాగ్రిని రిసెప్షన్ కౌంటర్లో అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు,అదనపు కలెక్టర్ నర్సింగ రావు,డిఎస్పి మొగిలయ్య,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పైతర గ్రామానికి రవితేజ రెడ్డి నాయకత్వం అవసరం



**మెదక్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** రవితేజరెడ్డి నాయకత్వంలో పైతర గ్రామం బాగుపడుతుందని... ప్రచారంలో ప్రజలందరూ, అన్ని వర్గాల ప్రజలు రవితేజరెడ్డి పట్ల విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పైతర మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామంలో ఆదివారం పైత్ర గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి యాబన్నగారి రవితేజరెడ్డికి మద్దతుగా ఆయన భార్య యాబన్నగారి దివ్య రవితేజరెడ్డి మహిళలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బ్యాట్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు చంద్రశేఖర్ రెడ్డి, ఆదం ఎల్లయ్య, మాజీ సర్పంచులు సంతోష ఎల్లేశం, మురళి గౌడ్, గ్రామ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంచందర్, లింగంపల్లి మల్లేశం, టిఆర్ఎస్ పార్టీ నాయకులు బోయిని ఆంజనేయులు, శ్రీకాంత్, జీవయ్య, శాదుల్ల తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన 2వ విడత ఎన్నికల ప్రక్రియ

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రశాంతంగా రెండో విడత ఎన్నికల ప్రక్రియ కొనసాగినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ ఎన్నికలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత పోలింగ్ ప్రశాంతంగా కొనసాగిందని తెలిపారు. పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా 2వ విడతలో భాగంగా జిల్లాలోని తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట్, శంకరంపేట్(ఆర్) మెదక్ మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 2వ విడత ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలింగ్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో సమర్ధవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. 1 లక్షా 72 వేల 656 మంది ఓటర్లు ఉండగా 1 లక్ష 53వేల 313మంది ఓటర్లు తమ ఓటు హక్క వినియోగించుకోవడంతో 88.80 శాతం ఓటింగ్ జరిగిందని, జిల్లాలో పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించడం జరిగిందని.ముందుగా ఉదయం 9 గంటలకు 21.83 నమోదు కాగా 11 గంటల వరకు 59.26% ఒంటి



గంట తర్వాత పోలింగ్ ముగిసే సమయానికి 88.80 % నమోదయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా రెండవ విడత ఎన్నికల పోలింగ్


● పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డి, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య చౌటుకూరు మండలం లోని చౌటకూర్, సుల్తాన్ పూర్ గ్రామపంచాయతీలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని, పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లను, వసతులను పరిశీలించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంపు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్ చైర్స్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం రెండవ విడతలో 229 సర్పంచ్ స్థానాలకు,1941 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కలెక్టర్ పర్యవేక్షణలో ఆందోల్, చౌటకూర్, ఝరాసంగం, కోహిర్,



మొగుడంపల్లి, మునిపల్లి, పుల్కల్, రాయికోడ్, వట్పల్లి, జహీరాబాద్ మండలాల పరిధిలో ఓటింగ్, కౌంటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని,436 కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపించామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని పరిశీలించడంతో పాటు, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడుపర్యవేక్షించడం జరిగిందన్నారు. అనంతరం మద్యాహ్నం 2.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి తావులేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి సుల్తాన్పూర్, తాడ్దాన్ పల్లి, గొంగ్లూరు, సంగు పేట, డాకూర్, మర్వెల్లి, వట్పల్లి, నాగులపల్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని, ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆందోల్ మండలం డాకూర్, బ్రాహ్మణపల్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రెవిన్యూ డివిజనల్ అధికారి పాండు పాల్గొనగా, జనరల్ అబ్జర్వర్ వెంట హౌసింగ్ పీడీ చలపతిరావు, తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ ప్రత్యేక పూజలు



**శివ్వంపేట, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామివారినీ ఆదివారం రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ భారతి కల్పతి నాయక్ దేవాలయంలో స్వామివారి దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఆంజనేయ స్వామి వారికి మన్యుసూక్త పారాయణం, ఆకుపూజ, చందన పూజ, బిలవార్చన, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి శాస్త్రుల దేవాదత్తు శర్మ, శ్రీ హర్ష శర్మ, సిబ్బంది తో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉన్నారు.

# సంగెంలో సెల్ఫీ పాయింట్..




**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లాలోని సంగం మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హరిత పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడ హరిత సెల్ఫీ పాయింట్ కూడా ఏర్పాటు చేశారు. ఓటు వేసినటువంటి ఓటర్లు తాము ఆ సెల్ఫీ పాయింట్ వద్ద వచ్చి ఫోటోలు దిగడం కనిపించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి వినూత్నమైనటువంటి ఏర్పాట్లు చేసినటువంటి ఎన్నికల అధికారులను పొగిడారు. ఇలాంటివి ఓటర్లను ఆకట్టుకోవడమే కాకుండా ఉత్సాహాన్ని కూడా కలిగిస్తాయని అన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులు





- కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్ లుగా గెలిపించండి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు


**శాయంపేట, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్ లుగా గెలిపించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట మండలంలోని నేరేడుపల్లి, అప్పయ్యపల్లి, ప్రగతిసింగారం, కాట్రపల్లి, సాధనపల్లి, సూర్యనాయక్ తండా, గంగిరేణిగూడెం, వసంతాపూర్ గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ముఖ్య నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే చాలా అభివృద్ధి, సంక్షేమ పథకాల ను అమలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నాయకులు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు కలిసికట్టుగా పనిచేయాల న్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భూపాలపల్లి నియోజక వర్గంలోని అన్ని గ్రామాలలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 14 (జనం సాక్షి) :** రెండో విడత ఎన్నికలు జరుగుతున్న వేలేరు మండల కేంద్రంలోని జడ్పీ, ప్రాథమిక పాఠశాల పరకాల మండలం వెల్లంపల్లి నాగారం పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం పరిశీలించారు. జడ్పీ పాఠశాల ప్రాంగణంలో బిఎల్ఓ కౌంటర్ వద్ద ఉన్న ఓటర్లతో మాట్లాడారు. ఓటరు స్లిప్పుల పంపిణీ గురించి బిఎల్ఓ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సరళిని గురించి రిటర్నింగ్, పోలింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది ఓటర్లు ఓట్లు వేశారని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలోనికి క్యూ లైన్ లేకుండా చూసుకోవాలని, పోలింగ్ కేంద్రం బయటనే క్యూలైన్ ఉండే విధంగా చూసు కోవాలన్నారు. ఓటర్లు ఎక్కువగా ఉన్నందున కౌంటింగ్ కు ఐదు టేబుల్స్ వేసుకొని ఓట్ల లెక్కింపును చేపట్టాలని రిటర్నింగ్ అధికారికి సూచించారు. పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తపర్చుకోవాలని అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డిఓ డాక్టర్ కే నారాయణ పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి వేలేరు తహసిల్దార్ కోమి ఎంపీడీవో లు విమల లక్ష్మీ ప్రసన్న, , మండల ప్రత్యేకాధికారి రవీందర్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నాగేంద్రస్వామి ఆలయంలో అయ్యప్ప పడిపూజ



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** ఉర్సు సుభాష్ నగర్ శ్రీ నాగేంద్ర స్వామి ఆలయంలో శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ, అన్నదాన కార్యక్రమం జరిగింది. స్వామి వారికి పంచామృతాలతో విశేషంగా అభిషేకాలు జరిగాయి. వేదపండితులు జాగర్లపూడి కోటయ్య శర్మ, శ్రీ రాం శర్మ, అయ్యప్ప శర్మ, వెలిదె అనంతమూర్తి మంత్రోచ్చరణాలతో పూజలు జరిగాయి. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ. ఆయూబ్, భాజపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, తెంగాణ అర్చక ఉద్యోగ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ గంగు ఉపేందర్ శర్మ, కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్, పోశాల పద్మ, పల్లం పద్మ, రవి , మాజీ కార్పొరేటర్లు బత్తిని వసుంధర, బయ్యాస్వామి తదితరులు పాల్గొన్నారు.. శ్రీకాంత్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన జరిగింది.

# సీఎం సరదా కోసం సింగరేణి కార్మికుల సొమ్ము

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్



**మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** సింగరేణి కార్మికులు ఎంతో కష్టపడి శ్రమపడి బొగ్గు గనుల్లో లాభాలు తీసుకువస్తే ఆ లాభాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తమ సరదా ఆటకోసం 100 కోట్ల రూపాయలు స్పాన్సర్ చేయించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గత పాలకులు సింగరేణి నిధులను మళ్లించి ఫుట్ బాల్ స్టేడియాలు నిర్మించారని ఇక్కడి ప్రాంత అభివృద్ధిని మరిచి సిద్దిపేట లాంటి ప్రాంతాల అభివృద్ధి చేశారని ఆరోపించారు,వారి బాటలోనే ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులు ఎంతో కష్టపడి సంస్థకు లాభాలను ఈ ప్రాంత అభివృద్ధి కోసం కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సింది పోయి ఇక్కడ కార్మికులు ఇబ్బందులు పడుతుంటే సీఎం మాత్రం ఫుట్ బాల్ ప్లేయర్ మెస్సి తో ఆట ఆడడానికి సింగరేణి సంస్థ నుండి100 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు.సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలో దక్కి అమలు చేయకుండా వారి కష్టార్జితాన్ని ఆటల నిర్వహణకు కేటాయిస్తూ సంస్థ ఆర్థిక దోపిడీకి సీఎం పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు సింగరేణి నుండి ఎంత పెద్ద మొత్తంలో నిధులు ఉప్పల్ స్టేడియం కు తరలిస్తుంటే కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చి హామీలను అమలు చేయకుండా లాభాలను అనవసర ఖర్చులకు ఉపయోగించారని పేర్కొన్నారు . సింగరేణి నిధులతో ఉప్పల్ స్టేడియంలో మెస్సి అలాగే సీఎం ఫుట్ బాల్ మ్యాచ్ ఆడితే సింగరేణి సంస్థకు వచ్చే ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రతి కార్మికుడికి రెండు గంటల భూమి సింగరేణి కార్మికులు ఉంటున్న క్వాటర్లు మరమ్మత్తులు లేకుండా కళాహీనమై ఉన్నప్పటికీ రిపేరు చేయించడం లేదని ఆరోపించారు. ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కూడా నిర్మాణం చేయలేకపోయారని వచ్చిన లాభాలను ఫుట్ బాల్ ఆటలకు దారిమల్లిస్తే కార్మికుల ప్రయోజనాలు ఎలా నెరవేరుతాయి అని ఆయన ప్రశ్నించారు ఈ ప్రాంత ఎమ్మెల్యేలు సింగరేణి సంస్థ నిధులు ఈ ప్రాంతానికి ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిసి కూడా సీఎం ఉప్పల్ స్టేడియంకు తీసుకెళు_ంటే ఏం చేశారని ఆయన ప్రశ్నించారు ఇప్పటికైనా సింగరేణి సంస్థ నిధులను సింగరేణి సంస్థ అభివృద్ధి,కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి ఎఫెక్ట్ ప్రాంతాల అభివృద్ధి కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బిజెపి నాయకులు ముఖేష్ గౌడ్ అమీర్ శెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు

# పోలింగ్ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



**నిర్మల్ రూరల్, డిసెంబర్14 (జనంసాక్షి) :** జిల్లాలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నిర్మల్ గ్రామీణ మండలం డ్యాంగాపూర్ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్వాడి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.అక్కడ కొనసాగుతున్న పోలింగ్ ను పరిశీలించారు.ఓటర్లకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు,నమోదైన పోలింగ్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్, కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల అధికారులకు కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ త్వరగా ముగించాలని తెలిపారు.ఈ ఎన్నికల కేంద్రం తనిఖీలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపివో శ్రీనివాస్,ఎంపీడీఓ గజానన్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థికి గుండెపోటు



**బెల్లంపల్లి, డిసెంబర్ 14, (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ సర్పంచ్ అభ్యర్థి మాసు వెంకటస్వామి గుండెపోటుకు గురయ్యారు. పోలింగ్ సరళి గమనించడానికి వెళ్లిన వెంకటస్వామికి ఛాతిలో నొప్పి రావడంతో అనుచరులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వెంకటస్వామి ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

# రెండో విడత ఎన్నికలు ప్రశాంతం

- సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్14 (జనంసాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి పవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఆదివారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గీసుకొండ మండలం గీసుకొండ, గంగాదేవిపల్లి పోలింగ్ కేంద్రాలు,దుగ్గొండి మండలం వెంకటాపూర్, దేశాయిపల్లి పోలింగ్ కేంద్రాలు, నల్లబెల్లి మండలం: నల్లబెల్లి సుమంగళి ఫంక్షన్ హాల్, నందిగామ పోలింగ్ కేంద్రాలు, సంగెం మండలం: సంగెం జడ్పీ హై స్కూల్, మొండ్రాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత ( గ్రీన్) పోలింగ్ కేంద్రాలతో పాటు పలు పోలింగ్ కేంద్రాలలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సిబ్బంది డ్యూటీల అమలు, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణకు సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "పోలింగ్ ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన, అంతరాయం లేని వాతావరణం కల్పించడం సిబ్బందిపైనున్న ప్రధాన బాధ్యతఅని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, నిబంధనల ఖచ్చితమైన అమలు అత్యంత ఔచిత్యం కలదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఎన్నికల సూచనల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటి విడత లో హరిత పోలింగ్ కేంద్రాలలో మిగతా పోలింగ్ కేంద్రాల కంటే 2 నుండి 3 శాతం పోలింగ్ పెరిగిందని, అన్నారు. రెండవ విడతలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని, 82 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎప్పటికపుడు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుండి కౌటింగ్ ప్రారంభమవుతుందని, ముందుగా వార్డుల కౌంటింగ్ , తర్వాత గ్రామపంచాయతీ లో సర్పంచ్ కౌంటింగ్ జరుగుతుందని వారన్నారు. మేజర్ గ్రామపంచాయతీలలో త్వరగా ఫలితాలు వచ్చేలా ఎక్కువ టేబుల్స్ ఏర్పాటు చేసి ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్వోలకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. మొదటి విడతలో 585 వార్డ్ స్థానాలుండగా, ప్రస్తుతం రెండవ విడతలో 906 వార్డు స్థానాలను ఉన్నాయని, కౌంటింగ్ ఫలితాలు త్వరితంగా ఇచ్చుటకు ప్రణాళికలు సిద్ధం చేశామని.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ మరియు కౌంటింగ్ జరుగుటకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, ఆర్డీఓ సుమా, నోడల్ అధికారులు, ఎంపిడీవోలు, తహశీల్దార్లు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# వెబ్‌కాస్టింగ్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ ఫరిశీలన



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 14(జనంసాక్షి):** జిల్లాలో జరుగుతున్న రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి జరుగుతున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు బాలమాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిశితంగా పరిశీలించారు. ఆదివారం నిర్వహించిన రెండో విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణ కౌంటింగ్ ప్రక్రియను సునిశితంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టి గట్టి బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడతలో నల్లబెల్లి, దుగ్గొండి సంగెం, గీసుగొండ మండలాల్లోని గుర్తించిన 74 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నేరుగా వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఈ నాలుగు మండలాలకు సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లు) నియమించి, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నిలు పకడ్బందీగా నిర్వహించాలి

- గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల జనరల్ అబ్జర్వర్ పరిశీలన..



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 14,(జనంసాక్షి):** రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి సంగెం, గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా గీసుగొండ, సంగెం, నందిగామ, దేశాయిపల్లె, నల్లబెల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నల్లబెల్లి మండలంలోని మేడపల్లి గ్రామ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిఎం ఇండస్ట్రియల్ నరసింహామూర్తి పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 15 డిసెంబర్ 2025

# దౌర్జన్యాలతో రాజకీయాలు చేయడం సరికాదు

**• రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**

**టేకులపల్లి, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** పోలీసులను అడ్డుపెట్టుకొని అదిరింపులు బెదిరింపులతో ఎంతో కాలం నడవదని, దౌర్జన్యాలతో రాజకీయాలు చేయడం సరైంది కాదని ఎంపీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టేకులపల్లి మండలంలో ప్రత్యేకంగా హాజరై టేకులపల్లి మండలానికి చెందిన ప్రముఖ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన భూక్య దళిసింగ్ నాయక్, పిఎసిఎస్ బేతంపూడి చైర్మన్ లక్కినేని సురేందర్ రావు లను కేటీఆర్ ఆదేశాలతో వారిని బిఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా టేకులపల్లి లోని మాజీ ఎమ్మెల్యే భానోత్ హరి ప్రియ హరి సింగ్ నాయక్ స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్ల కష్టాన్ని వదిలిపెట్టి, పార్టీలో జరుగుతున్న అక్రమాలను, దౌర్జన్యాలను ఎదిరించి, ఆ పార్టీలోని పరిస్థితులు బాగా లేకపోవడంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినటువంటి కెసిఆర్ తెలంగాణలో అభివృద్ధి చేసినటువంటి కెసిఆర్ని దృష్టిలో ఉంచుకొని, నమ్ముకొని కేటీఆర్ సూచన మేరకు బిఆర్ఎస్ పార్టీలో భూక్య దల్ సింగ్ నాయక్ పిఎసిఎస్ బేతంపూడి చైర్మన్ లక్కీ నేను సురేందర్ రావు లను పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నామ న్నారు. రేపు జరగబోయే పదిహేడో తారీకు ఎన్నికల్లో సమిష్టిగా కష్టపడి గులాబీ జెండాలు ఎగురవేయాలి అన్నారు. ఈ రెండు రోజులు ఇవ్వాళ రేపు కష్టపడి 17 తారీకు ఎన్నికల కోసం ఈ రెండు మండలాల్లో తిరిగి అత్యధిక సీట్లు గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీకి పోరాటం కొత్త కాదని, గెలుపోటములు కొత్త కాదని, దాదాపు ఎన్నో ఎన్నికలలో ఎదుర్కొన్నటువంటి పార్టీ అని,ఎన్నో పదవులకు కూడా త్యాగం చేసినటువంటి పార్టీ అని, కేసీఆర్ ఎన్నో పదవులకు త్యాగం చేసి కొట్లాడి తెచ్చుకున్నటువంటి తెలంగాణని మంచిగా బంగారు తెలంగాణగా మార్చారన్నారు. దాదాపు 50



ఏళ్లు నుంచి చూసాము స్వాతంత్రం వచ్చిన తర్వాత 65 ఏళ్ల పాలన కూడా చూసాం, కేసీఆర్ చేసిన పదేళ్ల పాలన కూడా చూశాం, 65 ఏళ్లలో అభివృద్ధి జరిగినటువంటి అభివృద్ధిని, కేవలం 10 ఏళ్లలో చేయడం జరిగిందన్నారు. ఈ ఐదు సంవత్సరాల్లో హరిప్రియ ఎమ్మెల్యేగా ఉన్నటువంటి 2018 నుంచి 23 వరకు కోట్ల రూపాయల నిధులు తెచ్చి ఇల్లందు నియోజకవర్గం లో చేశారన్నారు.ఇప్పుడున్న ఎమ్మెల్యే టైం పాస్ చేయడం, వాళ్ళ తమ్ములతోని కూర్చొని వాళ్ళ తమ్ములను పెట్టి బెదిరించడం దౌర్జన్యం చేయడం తప్ప అభివృద్ధికి అస్సలు చాన్సే ఇవ్వడంలేదని, కేవలం దౌర్జన్యాన్ని నమ్ముకొని పోలీసులను నమ్ముకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ పోలీసులు అవసరమా రాజకీయాల్లో ఉన్న వాళ్ళకి ఒక ఎమ్మెల్యే గాని వాళ్ళ కుటుంబ సభ్యులు ఒక అభ్యర్థి స్వామి నామినేషన్ దగ్గర ఎలక్షన్ జరుగుతుంటే కొట్టి దౌర్జన్యం చేయడం కాంగ్రెస్ విషయ సంస్కృతికి నిదర్శనం అన్నారు. జరిగిన దౌర్జన్యంపై ఎస్పీ దృష్టి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. నామినేషన్ దగ్గర దౌర్జన్యం చేస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం, దౌర్జన్యం చేసిన వారిని వదిలేయడం చూస్తుంటే, పోలీసులు ఖాకీ డ్రెస్సులు తీసేసి కాంగ్రెస్ డ్రెస్ వేసుకొని డ్యూటీలు చేస్తున్నట్టు కనబడుతున్నారు. ఎందుకంటే వార్డ్ మెంబర్లను విత్ డ్రా చేయించడం,బెదిరించడం సర్పంచ్లను బెదిరించడం, గెలవాలి కచ్చితంగా కాంగ్రెస్ అని చెప్పేసి బిఆర్ఎస్ కార్యకర్తలని, నాయకులను బెదిరించి కేసులు పెడతాను అని చెప్పి బెదిరించడం ఇవన్నీ చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర మొత్తం కూడా కాంగ్రెస్ సంస్కృతి ఇదేవిధంగా నడుస్తుందని, ఈ అదిరింపులు బెదిరింపులతోని ఎంత కాలం నడవదని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మొదటి విడత ఎన్నికలలో ప్రజలు ఇప్పటికే 2200 సీట్లు అదిరించో, బెదిరించో తెచ్చుకుంటే, బిఆర్ఎస్ కార్యకర్తలు ఏమాత్రం కూడా తగ్గకుండా దాదాపు 1345 నుంచి 1400 సీట్లు గులాబీ జెండాను ఎగరవేసిందన్నారు.ఈ పార్టీ సైనికులు చాలా స్థిరంగా గట్టిగా నమ్మకంతో కేసీఆర్ ని ఎట్టి పరిస్థితుల్లో కూడా మూడోసారి సీఎం గా తెచ్చుకోవాలి ఆకాంక్షిస్తున్నారన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు ఎవరి సొత్తు కాదు, ఇంకొక ఆరు నెలల్లో మీ పరిస్థితులు కూడా అర్థమవు తాయని,రాష్ట్ర ఎటువైపు ప్రయాణిస్తుందో ప్రజలు గమనిస్తున్నారని,కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రిగా అధికారం చేపడతారని, అధికారులు న్యాయంగా ఉండాలని, సమన్వయంగా డ్యూటీ చేయాలని, పార్సివాలిటీ చూపకుండా సమానత్వం చూపెట్టాలన్నారు. ఫైటింగ్ కూడా గులాబీ పార్టీకి కొత్త కాదు ఫైటింగ్ స్పిరిట్ తోనే తెలంగాణ సాధించినటువంటి పార్టీ అన్నారు. మీరిచ్చిన హామీలు కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం బీసీలకు హామీ ఇచ్చే అధికారంలోకి వచ్చినటువంటి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను పూర్తిగా అన్యాయం చేశారన్నారు. బీసీ లందరూ 42% ఉసిగొలిపిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన అవసరం రేపు 17 తారీకు జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పక్షాన నిలబడితే తప్ప వాళ్ళు వాళ్ళ అరాచకాలు ఆగవన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ హరి సింగ్ నాయక్, ఉమ్మడి జిల్లా మాజీ పార్టీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్, స్థానిక నాయకులు, సర్పంచ్,వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవాలు నిషేధం

**• ఎస్పీ కె.నరసింహ**



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు మూడు దశల ఎన్నికల పూర్తిస్థాయి ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోనే కొనసాగుతుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల మొదటి, రెండో విడతలలో ఫలితాలు ప్రకటించినప్పటికీ, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, భారీ సభలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు.మూడు విడతల పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు విజయోత్సవాలు కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఎంసీసీ అమల్లో ఉన్నంత కాలం ఈ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని, నియమాలను అతిక్రమించే ఏ చర్యనైనా సహించమని తెలిపారు.ఉల్లంఘనలు జరిగితే వెంటనే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని అన్నారు.ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. శాంతియుత వాతావరణం నెలకొనడానికి ప్రజలు, నాయకులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

## గుర్రంపోడు మండలంలో జైవీర్ రెడ్డి సుడిగాలి పర్యటన



**గుర్రంపోడు, డిసెంబర్ 14, (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ఆదివారం రోజున గుర్రంపోడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన ఆయన, మూడో దశ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. స్థానిక ప్రభుత్వాలలో కూడా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలిస్తే, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజల వద్దకు తీసుకెళ్లగలుగుతారు," అని పేర్కొన్నారు.అధికారంలో ఉన్నాం కాబట్టి అభివృద్ధి పనులు వేగవంతంగా జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టం కట్టాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు , ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బహుజన గౌరవానికి ప్రతీక పాపన్న

**• కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**హయత్‌నగర్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం ఆధ్వర్యం లో ఎల్.బి.నగర్ చౌరస్తా అండర్ పాస్ రోడ్ సమీప ప్రాంతంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ బహుజనుల గౌరవం, ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సమాజానికి ఆయన చేసిన త్యాగాలు, సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఇటువంటి మహానీయుల చరిత్రను రాబోయే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వారు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ బహుజన చైతన్యానికి, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**• జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**మిర్యాలగూడ, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు,ఐఏఎస్ అధికారిణి కొర్ర లక్ష్మితో కలిసి మిర్యాలగూడ డివిజన్లోని దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో ముఖాముఖి మాట్లాడడమే కాకుండా, ఓటు వేసేందుకు గుర్తింపుగా తీసుకువచ్చిన గుర్తింపు కార్డుల గురించి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలోని ఒక పోలింగ్ బూతు లో పోలింగ్ పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ పరిమితికి మించి ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఉండడం పట్ల ప్రిసైడింగ్ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలింగ్ కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను ప్రిసైడింగ్ అధికారి స్కూల్ అసిస్టెంట్ సంధ్య కు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రతిరోజూ టెలికాన్ఫరెన్సు తో పాటు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తెలియజేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించ చడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ ను జాగ్రత్తగా నిర్వహించాలని ఆర్ ఓలు అత్యవసరమై బయటికి వెళ్ళవలసి వస్తే తప్పనిసరిగా ఒక గజిటెడ్ ఆఫీసర్ కు స్టాట్యూటరీ మెటీరియల్ అప్పగించి వెళ్ళాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుండి పోలైన బాలెట్స్ తో పాటు,ఎన్నికల సామాగ్రి వచ్చిన తర్వాతదగ్గరలోని ఎస్టిఓలో భద్రపరిచే బాధ్యత ఎంపీడీవోదని అన్నారు.అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ దామరచర్ల జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాలలో 14 వార్డులకు పోలింగ్ జరుగుతున్నదని, ప్రశాంతంగా పోలింగ్ కొనసాగుతున్నదన్నారు. దామరచర్ల మండలం పెద్ద మండలం అయినందున కౌంటింగ్ లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపట్టాలన్నారు. ఫలితాల ప్రకటనలో ఎలాంటి జాప్యం చేయవద్దని ఈ సందర్భంగా ఆమె స్టేజ్ టు రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు.ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా కౌంటింగ్ నిర్వహించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేయాలన్నారు. అంతకుముందు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఎన్నికల పరిశీలకురాలు,జిల్లా కలెక్టర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్,డిపిఓ వెంకయ్య ,దామరచర్ల ప్రత్యేక అధికారి, డిసిఓ పత్యా నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ ,తదితరులు ఉన్నారు.

## మూడో విడత ఎలక్షన్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు



**టేకులపల్లి, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** మండలంలో మూడో విడతలో జరగబోయే పంచాయితీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు ఇల్లందు డిఎస్పి చంద్రబాను, టేకులపల్లి సిఐ సత్యనారాయణ, టేకులపల్లి ఎస్సై రాజేందర్ అన్నారు. పోలింగ్ కేంద్రాలలో పోలీస్ శాఖ తరపున పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆదివారం మండలంలోని రాంపురం గ్రామపంచాయతీలో పలు పార్టీల రాజకీయ నాయకులతో ఇల్లందు డిఎస్పి చంద్ర భాను, టేకులపల్లి సిఐ సత్యనారాయణ, ఎస్సై రాజేందర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి పెట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పిస్తామన్నారు. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశారు.ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు,మద్యం వంటి వాటితో పట్టుబడితే చట్టపరం గా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సిఐ సత్యనారాయణ, టేకులపల్లి ఎస్సై రాజేందర్, పోలీస్ ఇబ్బంది, పలు రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి

**• శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఈ వారం రోజులు డబ్బు,మద్యం ఇచ్చే అభ్యర్థుల కన్నా,ఐదు సంవత్సరాలు నిజాయితీగా పనిచేసే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో మూడో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం చౌటుప్పల్ మండలం లోని పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ అధికారంలో ఉండి వేల కోట్లు



దోచుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ స్థానిక నాయకుల వద్ద డబ్బులు తీసుకొని, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలన్నారు.నేను నిజాయితీగా ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.అక్రమ సొమ్ము, అధర్మం వైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉండడు,అతని అనుచరులు కూడా అక్రమం వైపు నిలబడరు అని ఆయన స్పష్టం చేశారు. ప్రజా పాలన కోసం కాంగ్రెస్ ను గెలిపించాలని తెలిపారు. గతంలో తన తల్లి పేరు మీద పలు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, కంటి ఆపరేషన్లు చేయించామని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో ఎవరూ బాధపడకూడదనే ఉద్దేశంతో, త్వరలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి మద్దతుతో మునుగోడు నియోజకవర్గంలో నూతన కంటి ఆసుపత్రిని కట్టిస్తామని ఆయన తెలిపారు.

## సర్పంచ్ లోయ ఉపేందర్‌ను అభినందించిన మల్లు నందిని




**చింతకాని, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** చింతకాని మండల పరిధిలోని నరసింహాపురం గ్రామ పంచాయితీ కి నూతనంగా ఎన్ని కైనా పాలక వర్గం ఆదివారం తెలంగాణా రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క ను మర్యాద పూర్వకంగా కలిసిన సర్పంచ్ లోయ ఉపేందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాటు రాయి వెంకట్రావు వార్డు సభ్యులు.మల్లు నందిని విక్రమార్క నూతనంగా ఎన్నికైన పాలక వర్గం సభ్యులని శాలుతో సన్మానించి అభినందించి ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ గ్రామ పంచాయితీ అభివృద్ధికి అన్ని విధాలుగా సాయ సహకారాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ని అత్యధిక మెజారిటీ తో సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకోవడం వల్ల లో పార్టీ ఎదుగు దాలకు మంచి వాతావరణం ఏర్పడింది అని కి శుభాకాంక్షలు తెలిపి పాలక వర్గం సభ్యులని అభినందించారు.

# టికెట్లకు బదులు తెల్లచీటీ మీద రాసిచ్చిన మనోజ్ టాకీస్

**• టికెట్ల రేట్లు అదనంగా పెంచడంతో మధ్యతరగతి, సామాన్యులకు ఇబ్బందులు**
**• నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చిన మేనేజర్**
**• థియేటర్ క్యాంటీన్‌లో స్నాక్స్ అధిక రేట్లతో సినిమా అభిమానుల జేబులకు చిల్లు**
**• పట్టించుకోని సంబంధిత అధికారులు**

**దేవరకొండ, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** సినిమా అనేది వినోదం కోసం, మానసిక ఉల్లాసం కోసం ఉండాలి కానీ సగటు మనిషి జేబులకు చిల్లులు పడేలా ఉండకూడదని మధ్య తరగతి కుటుంబం మొత్తం సినిమాకి వెళ్లి చూడాలంటే అధికంగా పెంచిన టికెట్ల రేట్లు, క్యాంటీన్లో స్నాక్స్ రేట్స్‌లతో ఆర్థికంగా భారం పడుతుందని సినిమా అభిమానులు అంటున్నారు. దేవరకొండ పట్టణంలోని ఏషియన్ మూవీస్ వారి మనోజ్ టాకీస్ లో ఇటీవల విడుదలైన అఖండ 2 మూవీకి వచ్చిన ప్రేక్షకులకు టికెట్ రేట్లను అధికంగా పెంచి ప్రేక్షకుల కు ఆర్థిక భారం పెంచుతున్నాయని అన్నారు. అంతేకాకుండా కొన్ని సమయాల్లో టికెట్లకు బదులు తెల్ల కాగితంపై టికెట్ల రేట్లు డబ్బులు సీట్ నెంబర్లు రాసిస్తున్నారని అన్నారు. ఇలా చేస్తే ఏషియన్ మూవీ సంస్థకు, డిస్ట్రిబ్యూటర్ కు కూడా ఆర్థికంగా నష్టం జరుగుతుందని అన్నారు. ఇక కొత్త సినిమా వచ్చిందంటే టికెట్ల రేట్లు అడ్డగోలుగా పెంచి ప్రేక్షకుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నాయని, ఇంత కు ముందు 110 రూపాయలు ఉన్న టికెట్ను 225 రూపాయలకు ,80 రూపాయలు ఉన్న టికెట్ను 175 రూపాయలకు పెంచి సినిమా ప్రేక్షకుల డబ్బులను దోచుకుంటున్నారని వాపోతున్నారు.





### మనోజ్ థియేటర్ క్యాంటీన్లో అధిక ధరలతో స్నాక్స్

ఇక థియేటర్ క్యాంటీన్లో స్నాక్స్ రేట్లను అడ్డగోలుగా పెంచి అమ్మడంతో ఇబ్బందిగా ఉందని సినిమా ప్రేక్షకులు తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. బయట ఇరవై రూపాయలకు దొరికే పాప్కార్న్ క్యాంటీన్లో 50 రూపాయలకు అమ్ముతున్నారని, సమోసాలు, కూల్ డ్రింక్స్, మరియు వాటర్ బాటిల్స్ అధిక ధరలకు అమ్ముతుండడంతో సినిమా ప్రేక్షకుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నాయనే చెప్పాలి. ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి థియేటర్లో జరిగే మోసాలను పరిశీలించి సినిమా అభిమానులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### అంతా మా ఇష్టం మనోజ్ టాకీస్ మేనేజర్

టికెట్ల అధిక రేట్ల విషయంపై , టికెట్లకు బదులు తెల్ల చీటీలపై రాసి ఇవ్వడం ఏంటి అని ఓ పత్రిక విలేకరి వివరణ అడగగా మనోజ్ టాకీస్ మేనేజర్ చాలా దురుసుగా సమాధానం ఇచ్చి మేము మా ఇష్టం వచ్చినట్లు చేస్తాము. ఇప్పటివరకు చాలామంది న్యూస్ పేపర్ వాళ్ళను చూసాము. మీ ఇష్టం వచ్చినట్లు రాసుకోండి అని సమాధానం ఇస్తున్నాడు. సినిమాకి ప్రేక్షకులు వస్తేనే థియేటర్ నడుస్తుందని విషయం మరిచి సినిమా అభిమానుల కోసం పనిచేయాల్సిన మేనేజర్ ఇలా మాట్లాడడం సబబు కాదని సినీ అభిమానులు అంటున్నారు.




# కారు కొంటున్నారా..!

- అయితే ఇవి తప్పనిసరి..
- పలు జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు

**జనంసాక్షి:**కొత్త కారు కొనుగోలు చేయాలని అందరికి ఉంటుంది. అయితే ఇది కొందరికి సాధ్యమవుతుంది. మరికొందరికి కొంత కష్టమే. ఒకవేళా ఎవరైనా కొత్త కారు కొనాలని చూస్తున్నట్లయితే తప్పకుండా కొన్ని విషయాలను గమనించాల్సి ఉంటుంది. ఆ విషయాలు, వివరంగా ఇక్కడ తెలుసుకుందాం. కారు కొనడానికి ముందు.. ఆలోచించాల్సిందే బడ్జెట్. ఎంత డబ్బు వెచ్చించి కారు కొనాలి. తక్కువ బడ్జెట్లో కావాలా?, ఎక్కువ బడ్జెట్ పెట్టాలా? అనే విషయంపై స్పష్టత ఉండాలి. ఇక్కడ కారు ధర మాత్రమే కాకుండా.. రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, రోడ్ ట్యాక్స్, మెయింటెనెన్స్ ఖర్చులు ఎంత ఉంటాయనే విషయాన్ని కూడా ముందుగానే అంచనా వేసుకోవాలి. కారును ఏ అవసరం కోసం కొంటున్నారనే విషయంపై స్పష్టత ఉండాలి. నగరంలో ప్రయాణించడానికా?, లేక లాంగ్ డ్రైవ్ చేయడానికా? అనే విషయంతో పాటు.. ఫ్యామిలీ కోసమా?, వ్యక్తిగత వినియోగం కోసమా? అనే విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. పెట్రోల్ / డీజిల్ / ఎలక్ట్రిక్ / హైబ్రిడ్ ఏది కావాలో ముందుగానే ఆలోచించండి. కారు బడ్జెట్, అవసరాలు వంటి విషయాలతో పాటు.. ఆ కారులో ఉన్న ముఖ్యమైన సేఫ్టీ ఫీచర్స్ ఏమిటనేది తెలుసుకోవాలి. మల్టిపుల్ ఎయిర్‌బ్యాగ్స్, ఈబీఎస్ విత్ ఈబీడీ, రియర్ పార్కింగ్ సెన్సర్లు / కెమెరా, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్, సేఫ్టీ రేటింగ్ వంటివన్నీ మీరు కొనే కారులో ఉండేలా చూసుకోవాలి.దాదాపు అందరూ ఎక్కువ మైలేజ్ ఇచ్చే కారు కొనాలని ఆలోచిస్తారు. కాబట్టి మంచి మైలేజ్ ఇచ్చే కారు ఏది? దాని పర్ఫామెన్స్ ఎలా ఉందనే విషయాలను ముందుగానే గమనించాలి. ఈ విషయాలను తెలుసుకోవడానికి రియల్-వరల్డ్ మైలేజ్ రివ్యూలు చూడటం మంచిది. ఇంజిన్ పవర్, డ్రైవింగ్ స్మూత్‌నెస్ కూడా పరిశీలించాలి. కారు కొనేస్తారు. కానీ దానిని ఎప్పటికప్పుడు సర్వీస్ చేస్తుండాలి. కాబట్టి మీ ప్రాంతంలో సర్వీస్ సెంటర్లు ఉన్నాయా?, లేదా? గమనించాలి. అవసరమైన పార్ట్స్ లభిస్తాయి. సర్వీస్ ఖర్చులు ఎలా ఉంటాయనే విషయాలను ముందుగానే బేరీజు వేసుకోవాలి. పైన చెప్పినవి మాత్రమే కాకుండా.. వారంటీ (స్టాండర్డ్ ం ఎక్స్‌టెండెడ్ వారంటీ) ఆఫర్లు (ఫెస్టివ్ డిస్కౌంట్స్, ఎక్స్ఛేంజ్ బోనస్), టెస్ట్ డ్రైవ్, రీసేల్ వాల్యూ, ఇన్సూరెన్స్, డెలివరీకి ముందు తనిఖీ వంటివి కూడా చేయాల్సి ఉంటుంది. మీకు నచ్చిన డిజైన్, అవసరమైన అప్డేటెడ్ ఫీచర్స్ కూడా ఉండేలా చూసుకోవడం మంచిది.



# రీసేల్‌లోనూ అగ్రగామే

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ రీసేల్ మార్కెట్ ప్రత్యేకమైన ఒరవడి

కొంత కాలంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ రీసేల్ మార్కెట్ అంటూ ప్రత్యేకమైన ఒరవడిని సృష్టిస్తోంది. కొత్త కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టులతో పాటు రీసేల్ మార్కెట్ అత్యంత వేగంగా పెరుగుతున్న విభాగంగా మారింది.పెట్టుబడి తక్కువ, లాభాలు ఎక్కువగా ఉంటాయని భావించి ఈ రంగంలోకి అనేక మంది ప్రవేశిస్తున్నారు. ప్రాపర్టీ కొనుగోలు, విక్రయాల్లో వినియోగదారులు, ఇన్వెస్టర్లు, బ్రోకర్లకు సమానంగా లాభాలు అందించడంలో ఈ రీసేల్ సెగ్మెంట్ కీలకపాత్ర పోషిస్తోంది. అదే సమయంలో నగర జీవనశైలిపై కూడా స్పష్టమైన ప్రభావం చూపుతోంది.

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్‌లో ఐటీ, కార్పొరేట్ ఉద్యోగావకాశాలు పెరిగే కొద్దీ, వలసలు పెరుగుతున్నాయి. దీంతో స్థిరమైన నివాసాల కోసం డిమాండ్ వేగంగా పెరిగింది. చాలా మంది రెడీ టు మూవ్ ఇళ్లు, వెంటనే ఉపయోగించుకునే ఫ్లాట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొత్త కన్‌స్ట్రక్షన్ కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడటం కంటే రీసెల్ ప్రాపర్టీ తీసుకోవడం సౌకర్యంగా మారింది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు, ఉద్యోగస్తులు, ప్రొఫెషనల్స్ ఆసక్తి కనబరుస్తున్నారు. రీసేల్‌లో ప్రధానంగా పెట్టుబడి తక్కువ. కొత్త వెంచర్లు వంటి భారీ ఖర్చులు, మార్కెటింగ్ వ్యయాలు, ప్రీలాంచ్ ప్రకటనలు, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ వంటి ఖర్చులు ఉండవు. ఇప్పటికే ఉన్న ఇళ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు తిరిగి మార్కెట్లోకి తీసుకురావడం వల్ల రిస్క్ కూడా తక్కువ. రీసేల్ ప్రాపర్టీలకు సాధారణంగా రెడీ డాక్యుమెంటేషన్ ఉండటం, బ్యాంక్ లోన్లు సులభంగా లభించడం, వాస్తు/ప్రాంతీయ వివరాలు ఇప్పటికే తెలిసి ఉండటం కొనుగోలుదారులకు అదనపు నమ్మకాన్ని ఇస్తుంది.ఇదే కారణంగా ఈ రంగంలో ఇన్వెస్టర్లు కూడా వేగంగా పెట్టుబడి పెడుతున్నారు. ఈ రంగంలో ఏజెంట్లకు భారీ కమీషన్లు ఇచ్చే వ్యవస్థ తగ్గిపోతోంది. డిజిటల్



ప్లాట్‌ఫార్మ్‌లు, రియల్ ఎస్టేట్ లిస్టింగ్ యాప్‌లు, సోషల్ మీడియా మార్కెటింగ్‌తో ప్రాపర్టీ యజమానులు నేరుగా కస్టమర్లతో మాట్లాడే అవకాశం పెరిగింది. ప్రధానంగా మధ్యవర్తి ఖర్చులు తగ్గి, విక్రేతలకు ఎక్కువ లాభం, కొనుగోలుదారులకు తక్కువ ధరకు లభిస్తోంది. ఈ మార్పు రియల్ ఎస్టేట్ లావాదేవీలను మరింత పారదర్శకంగా చేస్తోంది. రెడీ ఇళ్లకు అధిక డిమాండ్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలు.. శంషాబాద్, షాద్‌నగర్, ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లోని ప్లాట్లు, వెంచర్లు.. కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కూకట్‌పల్లి, మణికొండ, బాచుపల్లి వంటి ప్రాంతాల్లో రీసెల్ మార్కెట్ చురుగ్గా మారింది. ఐటీ ఉద్యోగస్తులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతాల్లో రెడీ ఇళ్లకు డిమాండ్ నిరంతరం ఉంటుంది. ఇక అపార్ట్‌మెంట్లతో పాటు విల్లాలు, సొంత గృహాలు, జీ ప్లస్-1, జీ ప్లస్-2 హౌసింగ్ యూనిట్లు కూడా పెద్ద సంఖ్యలో రీసేల్ అవుతున్నాయి.లైఫ్‌స్టైల్ కోణం నుంచి చూస్తే రీసేల్ మార్కెట్ నగర జీవనశైలిలో కొత్త అనుభవాన్ని తెచ్చింది. ఉద్యోగ మార్పులు, నగరాల మధ్య తరలింపు, వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ విస్తరణ.. వంటివి వేగంగా జరిగే ఈతరం వెంటనే మకాం మార్చుకునేందుకు వీలైన ఇళ్లు ప్రధాన అవసరంగా మారాయి. ఈ అవసరాన్ని తీర్చడంలో రీసేల్ సెగ్మెంట్ కీలక పాత్ర పోషిస్తోంది. భద్రత, రవాణా సౌకర్యాలు, స్కూళ్లు, హాస్పిటల్స్, మార్కెట్లు తదితర వాటిని చూసుకునే ఇంటిని నిర్మించుకుంటారు. దీంతో వారి వద్ద నుంచి కొనుగోలు చేసిన వారికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.ప్రస్తుత మాంద్యం పరిస్థితుల్లో సురక్షిత పెట్టుబడిగా ఇన్వెస్టర్లు దీనికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అలాగే, రెంటల్ ఇన్‌కమ్ కోసం ఇళ్లు కొనుగోలు చేసే వారికి రీసేల్ ప్రాపర్టీలు తక్షణ లాభం అందిస్తున్నాయి. నగర వృద్ధి వేగం పెరగడంతో భవిష్యత్తులో ఈ మార్కెట్ మరింత బలపడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో రీసేల్ విభాగం సంప్రదాయ కొనుగోలు, అమ్మకాల నమూనాను మార్చి, కొత్త తరానికి అనుగుణంగా జీవన శైలిని ప్రతిబింబించే ట్రెండ్‌గా ఎదుగుతోంది. ఈ వినూత్న మార్పులు, తక్కువ రిస్క్, ఎక్కువ లాభాలు, స్మార్ట్ లివింగ్ అవసరాల కలయికగా ఈ రంగాన్ని రాబోయే రోజుల్లో మరింత ప్రాధాన్యంతో ముందుకు నడిపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఇల్లు ఇలా కట్టు..

- ఇది ఇంకో కొత్త టెక్నిక్కు..



నిర్మాణ రంగంలో ముఖ్యంగా గృహ నిర్మాణంలో అనేక కొత్త కొత్త టెక్నిక్‌లు పురుడు పోసుకుంటున్నాయి. తాజాగా ఐఐటీ తిరుచ్చి ఓ కొత్త కాన్సెప్ట్‌ను ఆవిష్కరించింది. ఇలా గతంలో అనేక ఉన్నత విద్యా సంస్థల నుంచి కూడా పలు కొత్త నిర్మాణ నిర్మాణ పద్ధతులు తెరమీదకు వచ్చాయి. అవి ఏవి.. వాటిలో ఏవి విజయవంతమై క్షేత్ర స్థాయిలో వినియోగంలో ఉన్నాయి.. చూద్దాం ఈ కథనంలో..ఎన్ఐటీ తిరుచ్చి తాజాగా మరో కొత్త నిర్మాణ టెక్నిక్‌ను అభివృద్ధి చేసింది. నిర్మాణ సమయం, సిమెంట్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు భవనం ధృడంగా ఉండేలా రూపొందించిన కొత్త కోల్డ్ ఫార్మ్‌డ్ స్టీల్ -కాంక్రీట్-బ్రిక్ కాంపోజిట్ హౌసింగ్ టెక్నాలజీతో నిర్మించిన ప్రోటోటైప్ భవనం 'సెంటినెల్'ను ఆవిష్కరించింది సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్ మెంట్ అండ్ ఇంక్యుబేషన్ (సీఈడీఐ) అధ్యాపకుల నేతృత్వంలోని స్టార్టప్.కాంక్రీట్ వినియోగాన్ని 40-50% తగ్గించడంతోపాటు భూకంపానికి తట్టుకునే సామర్థ్యం కూడా ఈ నిర్మాణానికి మెరుగ్గా ఉంటుందని రూపకర్తలు చెబుతున్నారు. ఈ 400 చదరపు అడుగుల సింగిల్-బీహెచ్‌కే యూనిట్ కోసం మొత్తం సివిల్ పని కేవలం 25 పని దినాల్లో పూర్తయింది. సాధారణంగా ఇదే పరిమాణంలో సాంప్రదాయ ఆర్‌సీసీ భవనం నిర్మించాలంటే 2-3 నెలలు పడుతుంది.దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు అభివృద్ధి చేసిన అనేక నిర్మాణ సాంకేతికతలు క్రమంగా ప్రయోగశాలలు, పైలట్ ప్రాజెక్టుల నుండి వాస్తవ ప్రపంచ వినియోగంలోకి మారుతున్నాయి. ప్రీకాస్ట్ నిర్మాణం, కోల్డ్-ఫార్మ్డ్ స్టీల్ సిస్టమ్స్, జియోపాలిమర్ కాంక్రీట్ ఇప్పటివరకు విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన నిర్మాణ టెక్నిక్‌లు.వీటిలో, ఐఐటీ బాంబే, ఐఐటీ రూర్కీ, ఎస్‌పీఏ ఢిల్లీ వంటి సంస్థలు రూపొందించిన ప్రీకాస్ట్, మాడ్యులర్ నిర్మాణానికి విస్తృత ఆమోదం లభించింది. సైట్లో అసెంబుల్ చేసిన ఫ్యాక్టరీ-మేడ్ స్ట్రక్చరల్ కాంపోనెంట్లను ఇప్పుడు సాధారణంగా పట్టణ హౌసింగ్, మెట్రో రైలు ప్రాజెక్టులు, ఫ్లైఓవర్లు, ప్రభుత్వ హౌసింగ్ పథకాలలో ఉపయోగిస్తున్నారు.అదే విధంగా, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ, అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన విస్తృత పరిశోధనల ద్వారా అభివృద్ధి చెందిన జియోపాలిమర్ కాంక్రీట్ ప్రయోగాత్మక దశను దాటి ప్రాయోగిక వినియోగానికి చేరుకుంటోంది. ఫ్లై యాష్, స్లాగ్ వంటి పారిశ్రామిక వ్యర్థాలతో తయారయ్యే ఈ పదార్థం ప్రస్తుతం రహదారి పేవ్‌మెంట్లు, ప్రీకాస్ట్ విడిభాగాలు, పారిశ్రామిక నిర్మాణాల్లో వినియోగిస్తున్నారు.అయితే, అన్ని ఆవిష్కరణలు ఇంకా క్షేత్రస్థాయిలోకి ప్రవేశించడం లేదు. ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్‌లు ప్రదర్శించిన 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నిక్.. అధిక పరికర వ్యయం, నైపుణ్యం కలిగిన ఆపరేటర్ల అవసరం కారణంగా ఇప్పటికీ పైలట్ హౌసింగ్ ప్రాజెక్టులు, క్యాంపస్ స్థాయి నిర్మాణాలకే పరిమితమై ఉంది.అలాగే, వెదురు మిశ్రమాలు, కంప్రెస్డ్ ఎర్త్ బ్లాక్స్ వంటి బయో-ఆధారిత నిర్మాణ పదార్థాలను ఎక్కువగా గ్రామీణ లేదా ప్రాంత-నిర్దిష్ట అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. మరోవైపు, ఏఐ, ఐఓటీ ఆధారిత స్మార్ట్ నిర్మాణ సాంకేతికతలు ప్రధానంగా నిర్మాణ పర్యవేక్షణ, ఆస్తి నిర్వహణ కోసం పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఓ ఎంపికగా మాత్రమే అమలు చేస్తున్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.61 | ₹ 6.63 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,22,750 | ₹ 1,33,910 |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,10,000

# రాజకీయ కుబేరుల్లో పుతిన్‌దే హవా

## ప్రపంచంలో అత్యంత సంపన్న పొలిటికల్ లీడర్‌గా గుర్తింపు



ఇదివరకు ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన రాజకీయ నాయకుల గురించి విని ఉంటారు, అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుల గురించి తెలుసుకుని ఉంటారు. ఇప్పుడు ఈ కథనంలో ప్రపంచంలోనే అత్యంత ధనికులైన రాజకీయ నాయకులు ఎవరు?, వాళ్ల నెట్‌వర్త్ ఎంత అనే విషయాలు వివరంగా తెలుసుకుందాం.

### వ్లాదిమిర్ పుతిన్

రష్యన్ అధ్యక్షుడు పుతిన్.. ప్రపంచంలోనే అత్యంత సంపన్న రాజకీయ నాయకుడు. ఈయనకు ప్రధానంగా ఇంధన సహజ వనరుల కంపెనీలలో ఎక్కువ వాటా వస్తుందని సమాచారం. దీంతో ఆయనను అత్యంత సంపన్నుడిగా గుర్తించారు. అయితే ఈయన నెట్‌వర్త్ ఎంత అనే విషయం అధికారికంగా వెల్లడి కానప్పటికీ.. 200 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా. సుదీర్ఘ రాజకీయ జీవితం ఈ అపారమైన సంపదకు కారణమైందని పలువురు చెబుతున్నారు.

### అలెగ్జాండర్ లుకాషెంకో

పలు నివేదికల ప్రకారం.. సుమారు 9 బిలియన్ డాలర్ల సంపద కలిగిన అలెగ్జాండర్ లుకాషెంకో ప్రపంచంలోని అత్యంత సంపన్న రాజకీయం నాయకుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. 1994 నుంచి బెలారస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఈయనకు.. విదేశాలలో లగ్జరీ రియల్ ఎస్టేట్ , వ్యవసాయ, మాన్యుఫ్యాక్టరింగ్ సంస్థలలో వాటాలు ఉన్నాయని సమాచారం.

### డొనాల్డ్ ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంపద.. ప్రధానంగా రియల్ ఎస్టేట్, బ్రాండింగ్, హోటల్స్ గోల్ఫ్ రిసార్ట్‌ల నుండి వస్తుంది. ఈయన నెట్‌వర్త్ సుమారు 7.2 బిలియన్ డాలర్లు అని అంచనా. ఈయన రాజకీయ పదవిలో ఉన్న సమయం కంటే.. పెట్టుబడులు, మీడియా వెంచర్లలోనే సమయం గడిపారు. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంపద గణనీయంగా పెరుగుతూ ఉంది.

### కిమ్ జోంగ్ ఉన్

కిమ్ నెట్‌వర్త్ దాదాపు 5 బిలియన్ డాలర్లు అని అంచనా. కానీ ప్రపంచ ఆర్థిక విశ్లేషకులు ఈయ న సంపద 40 బిలియన్ డాలర్లని చెబుతున్నారు. ఉత్తర కొరియాలో ప్రభుత్వం, సైన్యం, వ్యాపారాలన్నీ కిమ్ కుటుంబం నియంత్రణలోనే ఉంటాయి. అంతే కా కుండా.. బంగారం, బొగ్గు, ఆయుధాలు, సిగరెట్లు, మద్యం ఎగుమతులు ద్వారా కూడా వీరికి ఆదాయం వస్తుంది.

### జీ జిన్‌పింగ్

బ్లూమ్‌బెర్గ్ ఇన్వెస్టిగేషన్ ప్రకారం.. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సంపద 1.5 బిలియన్ డాలర్లు. ఇందులో ఆయన కుటుంబ సంబంధిత ఆస్తులు కూడా ఉన్నట్లు సమాచారం. జిన్‌పింగ్ జీతం ఏడాదికి కేవలం 22,000 డాలర్లు మాత్రమే. ఇది కాకుండా ఈయనకు భూ ఖనిజాలు, టెక్ సంస్థలు, బంధువులతో ముడిపడి ఉన్న రియల్ ఎస్టేట్‌లో అనేక పెట్టుబడులు ఉన్నాయి.

# బంగ్లాలో స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలకు మద్దతిస్తాం

భారత్ విదేశాంగ శాఖ ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి)** :తమ దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా భారత భూభాగాన్ని ఉపయోగిస్తున్నారని బంగ్లాదేశ్ చేసిన ఆరోపణలను భారత్ ఖండించింది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా జరిగే కార్యకలాపాలకు తమ భూభాగాన్ని ఉపయోగించుకోవడానికి భారత్ ఎప్పుడూ అనుమతించలేదని పేర్కొంది. స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలకు భారత్? మద్దతు ఇస్తుందని వెల్లడించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది."2025 డిసెంబర్ 14 నాటి ప్రెస్ నోట్‌లో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం చేసిన ఆరోపణలను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియకు మద్దతు ఇస్తాం. బంగ్లాదేశ్‌లో శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాం. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడంతో సహా అంతర్గత శాంతి భద్రతలను నిర్ధారించడానికి బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మేము ఆశిస్తున్నాం." అని భారత విదేశాంగ శాఖ ప్రకటనలో పేర్కొంది.మాజీ ప్రధాని షేక్ హసీనా విదేశాల నుంచి హింసను ప్రేరేపిస్తున్నారని, ఆమె చేసిన ప్రకటనలపై ఢాకా తన బలమైన ఆందోళనలను తెలియజేయడానికి బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ భారత హైకమిషనర్ ను పిలిచింది. అలాగే బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ తర్వాత కొన్ని గంటలకే భారత విదేశాంగ కీలక ప్రకటన చేసింది. బంగ్లాదేశ్ చేసిన ఆరోపణలను తిప్పికొట్టింది. షేక్ హసీనాను అప్పగించాలని భారత్?ను ఢాకా కోరింది. బంగ్లా మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ హింసను ప్రేరేపిస్తున్నారని ఆరోపించింది. రాబోయే ఎన్నికలను అంతరాయం కలిగించడానికి చేసిన ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేసిందన్నారు.


# లిబియాలో భారత జంట కిడ్నాప్

## రూ. రెండు కోట్లు డిమాండ్

మెహసానా : గుజరాత్‌లోని మెహసానా జిల్లాకు చెందిన దంపతులు వారి మూడేళ్ల కుమార్తెతో పాటు పోర్చుగల్‌కు వలస వెళ్లే ప్రయత్నంలో లిబియాలో కిడ్నాప్‌కు గురయ్యారు.వీరిని కిస్మత్‌సింగ్ చావ్డా, అతని భార్య హీనాబెన్, కుమార్తె దేవాన్షిగా గుర్తించారు. కిస్మత్‌సింగ్ సోదరుడు నివసిస్తున్న పోర్చుగల్‌లో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో వీరు నవంబర్ 29న అహ్మదాబాద్ నుండి బయలుదేరారు. వీరు దుబాయ్ మీదుగా లిబియాలోని బెన్‌ఘాజీ నగరానికి విమానంలో చేరుకోవలసి ఉంది. అయితే ఇంతలోనే బెన్‌ఘాజీలో కిడ్నాప్‌కు గురయ్యారు.ఈ కుటుంబం పోర్చుగల్ కేంద్రంగా పనిచేసే ఒక విదేశీ ఏజెంట్ సహాయంతో ఈ ప్రయాణం చేస్తున్నట్లు మెహసానా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హిమాన్షు సోలంకి తెలిపారు. కిడ్నాపర్‌లు మెహసానాలోని చావ్డా బంధువులను సంప్రదించి, వారిని విడుదల చేయడానికి రూ. రెండు కోట్లు డిమాండ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న బంధువులు.. సహాయం కోసం మెహసానా జిల్లా కలెక్టర్ ఎస్‌కే ప్రజాపతిని ఆశ్రయించారు.



# అడవులను సృష్టించే కోతి చేష్టలు



**జనంసాక్షి:**కోతులు.. అత్యంత తెలివైన జంతువులు.. వాటికి జీవవైవిధ్యంలో, మానవ సంస్కృతిలో ప్రత్యేకమైన స్థానం ఉంది. సుమారు 60 మిలియన్ సంవత్సరాల క్రితం ఉద్భవించిన కోతులు భూమిపై గల అత్యంత ముఖ్యమైన జంతు సమూహాలలో ఒకటి.అరణ్యాలలో పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, విత్తనాలను వెదజల్లే ఏజెంట్‌లుగా అవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. కోతులు ప్రపంచంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే ప్రతి సంవత్సరం డిసెంబర్ 14న కోతుల దినోత్సవం జరుపుకుంటారు. కోతుల దినోత్సవం అనేది కేవలం కోతులను మాత్రమే కాకుండా, చింపాంజీలు, గొరిల్లాలు, ఒరంగుటాన్‌లతో సహా అన్ని రకాల సిమియన్‌లను గుర్తుచేస్తుంది. మానవ కుటుంబ వృక్షంలో ప్రైమేట్స్ ఒక భాగం. సుమారు 60 మిలియన్ సంవత్సరాల క్రితం ఉద్భవించిన ఈ జాతుల పట్ల మనకున్న ప్రేమను, గౌరవాన్ని తెలియజేయడానికి ఈ రోజు మనకు ఒక అవకాశం కల్పిస్తుంది. మొదట్లో సరదాగా ప్రారంభమైన ఈ దినోత్సవం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించే వార్షికోత్సవంగా మారింది. కేలండర్‌లో సరదాగా రాయగానే..

ఈ ప్రత్యేక దినోత్సవ ఆవిర్భావం 2000లో జరిగింది. మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీకి చెందిన కాసే సారో, ఎరిక్ మిల్లికిన్ అనే విద్యార్థులు ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. డిసెంబర్ నెలలో సెలవు రోజులను వెదుకుతూ వారు క్యాలెండర్‌లో 14వ తేదీన మంకీ డే అని రాశారు. ఈ విషయాన్ని వారు తోటి స్నేహితులకు తెలిపారు. దీంతో వారంతా కోతుల తరహా ప్రత్యేక దుస్తులు ధరించి, గెంతుతూ ఉల్లాసంగా గడిపారు. ఈ విధంగా వినోదంగా మొదలైన ఈ దినోత్సం నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది.

మంకీ డే నాడే 'కింగ్ కాంగ్' విడుదల

సారో, మిల్లికిన్ ఈ దినోత్సవం సందర్భంగా కొన్ని కళాకృతులు తయారుచేశారు. వీటిని ఆన్‌లైన్‌లో ప్రచురించడం ద్వారా 'మంకీ డే' భావన ప్రపంచవ్యాప్తంగా వ్యాపించడానికి దారితీసింది. పీటర్ జాక్సన్ తీసిన 'కింగ్ కాంగ్'(2005) మంకీ డే ఐదవ వార్షికోత్సవం సందర్భంగా విడుదలైంది. ఇది మంకీడే ప్రాముఖ్యతను మరింతగా పెంచింది. మొదట సరదాగా ప్రారంభమైన మంకీ డే ఇప్పుడు పూర్తి స్థాయి ప్రపంచ ఆపరేషన్‌గా రూపాంతరం చెందింది. నేషనల్ జియోగ్రాఫిక్, స్మిత్‌సోనియన్ ఇన్‌స్టిట్యూషన్, గ్రీన్‌పీస్ వంటి సంస్థలు ఈ రోజున కోతులు ఎదుర్కొంటున్న ముప్పుపై అవగాహన కల్పిస్తున్నాయి.కోతులలో సుమారు 260 జాతులు ఉండగా, వాటిలోని పలు రకాలు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. బార్బరీ మకాక్‌ల జనాభా గత 24 ఏళ్లలో 50 శాతానికి తగ్గింది. మంకీ డే అనేది కేవలం ఉల్లాసానికి మాత్రమే కాకుండా, కోతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన కలిగించేందుకు కూడా దోహదపడుతుంది.

కోతులు.. 10 అద్భుత విషయాలు

విభిన్న జాతులు : ప్రపంచవ్యాప్తంగా సుమారు 260కి పైగా రకాల కోతి జాతులు ఉన్నాయి. వీటిని ప్రధానంగా 'పాత ప్రపంచ కోతులు' (ఆఫ్రికా, ఆసియా), 'కొత్త ప్రపంచ కోతులు' (దక్షిణ, మధ్య అమెరికా)గా విభజిస్తారు.

తోక ప్రాముఖ్యత కొత్త ప్రపంచ కోతులు (ఉదాహరణకు సాలీడు కోతులు) కొన్నిటికి ప్రత్యేకమైన తోకలు ఉంటాయి. ఇవి చెట్ల కొమ్మలను పట్టుకోవడానికి లేదా ఆహారాన్ని తీసుకునేందుకు ఒక అవయవంలా పనిచేస్తాయి.

సమాజ జీవనం : కోతులు అత్యంత సామాజిక జీవులు. అవి సమూహాలుగా (ట్రూప్స్) జీవిస్తాయి. కొన్నిచోట్ల వందల కోతులు కలిసివుంటాయి. ఈ సమూహాలలో వాటి మధ్య బంధాలు ఉంటాయి.

శుభ్రం చేసుకోవడం : కోతులు తమ సమూహంలోని ఇతర కోతులను శుభ్రం చేస్తుంటాయి. ఇది వాటి సామాజిక బంధాలను, పరస్పర నమ్మకాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుంది.

బుద్ధి కుశలత : కోతులు చాలా తెలివైనవి. అవి సమస్యలను పరిష్కరించుకుంటాయి. వివిధ పరికరాలను ఉపయోగించగలవు. ఉదాహరణకు పండ్లను, కాయలను ముక్కలు చేసేందుకు రాళ్లను వినియోగిస్తాయి.

వివిధ రకాల ఆహారం : కోతులు సాధారణంగా పండ్లు, ఆకులు, పువ్వులు, కీటకాలు చిన్న జంతువులను తినే సర్వభక్షకాలు వాటి ఆహారం జాతిని బట్టి, అవి నివసించే ప్రాంతం ప్రకారం మారుతుంటుంది.

ప్రత్యేకమైన కమ్యూనికేషన్ : కోతులు వివిధ రకాల శబ్దాలు, ముఖ కవళికలు, శరీర భాష ద్వారా ఒకదానితో ఒకటి సంభాషించుకుంటాయి. ప్రమాదాన్ని సూచించడానికి లేదా ఆహారం గురించి తెలియజేయడానికి ప్రతి జాతికి ప్రత్యేకమైన అరుపులు ఉంటాయి.

చిన్న కోతి : పిగ్మీ మార్మోసెట్ అనేది ప్రపంచంలోనే అత్యంత చిన్న కోతి జాతి. ఇది కేవలం 5-6 అంగుళాల పొడవు మాత్రమే ఉంటుంది. 100 గ్రాముల కంటే తక్కువ బరువు ఉంటుంది.

నిద్రించే విధానం : చాలా కోతులు చెట్లపై నిద్రిస్తాయి. మాంసాహార జీవుల నుంచి సంరక్షణకే అవి అలా చేస్తుంటాయి. కొన్ని కోతులు నిద్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేసుకుంటాయి.

## ఘనంగా కెపిఎస్ టాలెంట్ ఎంకరేజ్మెంట్ ఎగ్జామ్

- 3వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్వర్ణావకాశం
- ప్రతిభావంతులకు అప్ టు 100% స్కాలర్‌షిప్
- కోట పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి



**కరీంనగర్, డిసెంబర్ 14(జనంసాక్షి) :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం, గ్రామీణ–పట్టణ విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం అనే ఉన్నత లక్ష్యంతో కోట పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెపిఎస్ టాలెంట్ ఎంకరేజ్మెంట్ ఎగ్జామ్%–%2026 నేడు ఆదివారం (డిసెంబర్ 14) రేకుర్తిలోని కోట పబ్లిక్ స్కూల్ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా కోట పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి మాట్లాడుతూ, 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించామని తెలిపారు. విద్యార్థుల ప్రస్తుత తరగతి సిలబస్‌ను ఆధారంగా చేసుకుని ఈ పరీక్ష నిర్వహించామని, దీనివల్ల ప్రతి విద్యార్థి తన సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అప్ టు 100% స్కాలర్‌షిప్‌తో పాటు పూర్తిగా ఉచిత విద్య అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే కోట పబ్లిక్ స్కూల్ ప్రధాన లక్ష్యమని, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ సంకల్పమని తెలిపారు. అలాగే, ఐఐటి–జేఈఈ, నీట్, ఒలింపియాడ్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను చిన్న వయసు నుంచే సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఆరవ తరగతి నుంచే ప్రత్యక్ష శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు బలమైన అకాడమిక్ ఫౌండేషన్‌తో పాటు విశ్లేషణాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా శిక్షణ ఉంటుందని వివరించారు. కోట పబ్లిక్ స్కూల్ ప్రత్యేకతలుగా ఒక ఎకరం విస్తీర్ణంలో విస్తరించిన విశాలమైన క్యాంపస్, ఏసీ డిజిటల్ క్లాస్‌రూమ్స్, పరిమిత బాచ్ సైజు అత్యధిక ల్యాబ్స్ లైబ్రరీ వంటి సౌకర్యాలు కోట పబ్లిక్ స్కూల్ ప్రత్యేకతలని కోట పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి వివరించారు ఈ పరీక్షకు భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడం హర్షించదగ్గ విషయమని తమకి ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు సిబ్బంది తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో రెండో విడత పోలింగ్

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 14(జనంసాక్షి):** వివిధ గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ పరిశీలన రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించి నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. తిమ్మాపూర్ మండలం తిమ్మాపూర్ పంచాయతీ పరిధిలోని జోగయ్య పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, రామకృష్ణ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. చిగురు మామిడి మండలం చిన్న ముల్కనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గన్నేరువరం మండలం గుండ్లపల్లి లోని శ్రీరామకృష్ణ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయా కేంద్రాల్లో అప్పటివరకు నమోదైన పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. క్యూలైన్లు పోలింగ్ కేంద్రాలలోనికి కాకుండా, కేంద్రం బయటే ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ గురించి బి.ఎల్.ఓలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తపరచాలని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే ఎన్నుకోండి

- త్వరలో మహిళా భవనం, మెయిన్ రోడ్డు నుండి గ్రామం వరకు వీధిలైట్లు ఏర్పాటు
- ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తా : పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు

**పెద్దపల్లి,డిసెంబర్ 14(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలంలోని రంగపురం లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గంట రమేష్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించిన పెద్ద ఎమ్మెల్యే పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు. బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చునని దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. గ్రామంలో మహిళా సంఘ భవనం, మెయిన్ రోడ్డు నుండి గ్రామం వరకు వీధిలైట్లు, ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పలు గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ రావు



**రామగిరి డిసెంబర్ 14(జనంసాక్షి) :**
ఆర్టిజన్స్ అందరిని పర్మినెంట్ చేసి, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేసి విద్యుత్ ఉద్యోగుల హక్కులను హరించే 2025 విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్‌రావు అన్నారు. ఆదివారం రామగిరి మండలం లోని సాయిరాం గార్డెన్‌లో సిఐటియు పెద్దపల్లి సర్కిల్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు వాగు నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడుతూ ఆర్టిజన్స్ అందరిని పర్మినెంట్ చేయాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేసి విద్యుత్ ఉద్యోగుల హక్కులను హరించే 2025 విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి మాట్లాడుతూ పెద్దపల్లి సర్కిల్లో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని సబ్ స్టేషన్ లో మెయింటెనెన్స్ పనులు కూడా ఆపరేటర్స్‌తో చేయించాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని ఈ విధమైన పద్ధతి రాష్ట్రంలో ఎక్కడా లేదని జిల్లా అధికార యంత్రాంగం ఇలాంటి తప్పుడు పద్ధతులు మానుకోవాలని లేదంటే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలు డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నామని ఇందులో కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ ను అడ్డుకోవడం శ్రమ శక్తి నీతి 2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాబోయే రోజుల్లో స్వతంత్ర ఐక్య కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని నిరంతరం కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పోరాడుతున్న సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ బిక్షపతి యూనియన్ పెద్దపల్లి సర్కిల్ ప్రధాన కార్యదర్శి నరసయ్య నాయకులు శ్రీనివాస్ రెడ్డి మట్టరాజు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ గూటికి చేరిన కాంగ్రెస్ నేతలు భూక్యా దళ్ సింగ్ నాయక్, లక్కినేని సురేందర్

### సాదరంగా స్వాగతించిన ఎంపీ వద్దిరాజు



**కమ్మం (జనం సాక్షి) :**
గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గండిపడింది. నియోజకవర్గంలో కీలకమైన టేకులపల్లి మండలంలో గట్టిపట్టున్న నేతలు భూక్య దళ్ సింగ్ నాయక్, లక్కినేని సురేందర్‌లు కాంగ్రెస్ పార్టీని వీడి ఆదివారం గులాబీ గూటికి చేరారు. ఈ ఇరువురు నేతలను ఎంపీ రవిచంద్ర.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో ఫోన్లో మాట్లాడించారు. ఆయన సూచన మేరకు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఈ ఇద్దరు కీలకమైన నేతలను పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. నలభై ఏళ్ల పాటు కాంగ్రెస్ జెండాను మోసిన తన కుటుంబానికి సర్పంచ్ సీటు ఇవ్వమని ప్రాధేయపడ్డా.. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సీటు ఇవ్వకుండా మోసం చేశారనే మనో వేదనతో ఆ పార్టీని వీడి, బీఆర్ఎస్ లో చేరడానికి సిద్ధపడ్డ దళ్ సింగ్ నాయక్ ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈయనతో పాటు మరో కీలకమైన నేత, టేకులపల్లి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ కూడా కాంగ్రెస్ ను వీడి తిరిగి బిఆర్ఎస్ లో కొనసాగడానికి సిద్ధపడ్డారు. అదే విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పునరాహ్వానం పలికారు. ఈ మేరకు ఎంపీ రవిచంద్ర టేకులపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. వీరితోపాటు చుక్కాలబోడు తండా, ఎక్సైజ్ దాసు తండా లో ఏకగ్రీవంగా ఎన్నికైన 11 మంది గ్రామ వార్డు మెంబర్లు, సిపిఐ ఎంఎల్ పార్టీకి చెందిన మాజీ దళ కమాండర్ పూనెం నర్సయ్య లు కూడా ఎంపీ రవిచంద్ర సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.
ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, టేకులపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్, నాయకులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## "అత్త" పై గెలిచిన "కోడలు"

### జీడి నగర్ సర్పంచ్‌గా సూర రమ విజయం



**మంథని, (జనంసాక్షి) :** సర్పంచ్ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు జరుగుతున్నాయి. ఏకంగా సొంత అత్తపై పోటీ చేసి ఆమె పెద్ద కోడలు గెలుపొందిన సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని నియోజక వర్గం పరిధిలోని పాలకుర్తి మండలం జీడి నగర్ లో చోటు చేసుకుంది. జీడి నగర్ సర్పంచ్ గా కోడలు సూర రమ (బీసీ మహిళ రిజర్వేషన్) 90 ఓట్ల మెజారిటీ తో అత్త సూర నరసమ్మ పై విజయం సాధించారు. జీడి నగర్‌లో మొత్తం 2600 ఓట్లు ఉండగా 1900కు పైగా ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ నాయకులు ఫీట్ల గోపాల్ సర్పంచ్‌గా గెలుపొందిన సూర రమకు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. సర్పంచిగా సూర రమ గెలుపొందడంతో వారి మద్దతుదారులు బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేసి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.

## ప్రజలిచ్చిన పదవిని బాధ్యతగా భావించండి

### పంచాయతీల అభివృద్ధికి సహకరిస్తాం : ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి



**తాండూరు డిసెంబర్ 14(జనంసాక్షి) :** సర్పంచులుగా ప్రజలు గెలిపించిన అభ్యర్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. యాలాల మండలం కోకట్ గ్రామ సర్పంచ్ గా గెలిచిన బి. రాజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ ఎం .నరేష్ తోపాటు వార్డు సభ్యులు వెంకటయ్య, భీమ్ రెడ్డి, మహమ్మద్ తదితరులు సీనియర్ నాయకులతో కలిసి మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలమాలవేసి, స్వీట్ తినిపించి సర్పంచ్, ఉప సర్పంచ్ , వార్డు సభ్యులకు మహేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ పదవి ముళ్ళ కిరీటం లాంటిదని గ్రామంలో ప్రతి సమస్య పై స్పందించాలని ఆయన సూచించారు. కూకట్ అభివృద్ధికి సీనియర్ నాయకుడు కరణం పురుషోత్తం రావు, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి తదితరులతో కలిసి అభివృద్ధి కోసం అవసరమైన నిధులు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. మాజీ వైస్ ఎంపీపీ ఏ శంకర్, మాజీ ఎంపిటిసి హనుమప్ప, మాజీ సర్పంచులు శంకర్ రెడ్డి, బాదరప్ప, సీనియర్ నాయకుడు తప్పేటి శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎల్ఐసి వెంకటయ్య, ముస్తఫా, మాల భీమప్ప, మధుసూదన్ రెడ్డి తదితరులు ఆయనతో ఉన్నారు.



## చేవెళ్ల పరిధిలో ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

**చేవెళ్ల,డిసెంబరు 14 (జనంసాక్షి) :** చేవెళ్ల మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ ను నిర్వహించారు. 2 గంటల నుంచి పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ను ఎన్నికల అధికారులు చేపట్టారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఉదయం 7 గంటల నుంచి ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. 18 ఏళ్లు నిండిన యువత మొదటి సారి గా ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా చేవెళ్ల పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల వేళ గొడవలు జరగకుండా ప్రత్యేకంగా పోలీసులు పెట్రోలింగ్ ను చేపట్టారు. చేవెళ్ల మండలంలో 25 గ్రామ పంచాయతీలకు అధికారులు ఎన్నికలను నిర్వహించాల్సి ఉండగా చన్ వెల్లి, మిర్జ గూడ గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో అధికారులు 23 గ్రామ పంచాయతీలకు ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. చేవెళ్ల మండలంలో మొత్తం 32 వేల 803 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు. 13 వేల 671 మంది పురుషులు, 13 వేల 592 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా 27 వేల 263 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. చేవెళ్ల మండలంలో పోలింగ్ 83.11 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో ఆలస్యం కావడంతో ఆయా గ్రామాల్లో సర్పంచుల ఫలితాల వివరాలను అధికారులు ఆలస్యంగా తెలియజేశారు.





## తాండూర్ రైల్వే స్టేషన్లో గంజాయి కలకలం

- కోణార్క్ రైల్లో గంజాయి రవాణా
- సుమారు 7 కిలోల గంజాయి స్వాధీనం
- జిల్లా మధ్య నిషేధ మరియు ఆబ్కారీ అధికారి : కే .విజయభాస్కర్

**తాండూరు డిసెంబర్ 14(జనంసాక్షి) :** తాండూర్ రైల్వే స్టేషన్లో ఆదివారం గంజాయి కలకలం రేపింది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో కొందరు గంజాయి రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, వికారాబాద్, పరిగి, తాండూర్ ఎక్సైజ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా తాండూర్ రైల్వే స్టేషన్లో ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రతి ప్రయాణికుడిని చుట్టుముట్టి వారి దగ్గర ఉన్న లగేజ్ చెక్ చేశారు. ఈ సమయంలో కోణార్క్ ట్రైన్ దిగి అటువైపు నడుచుకుంటూ వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో, వారి దగ్గర ఉన్న బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారం. ఈ సందర్భంగా వారి బ్యాగులో రెండు గంజాయి ప్యాకెట్లు ఉండడం గుర్తించారు. సుమారు 6 కిలోల వరకు ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా కొన్ని గంజాయి చాక్లెట్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపినారు. అక్రమంగా గంజాయి ని పండించడం, అమ్మడం, కలిగి ఉండటం చట్ట రీత్యా నేరమన్నారు. ఎటువంటి మాదకద్రవ్యాల సమాచారం ఉన్న కింద తెలిపిన నంబర్స్ 8712658760కి సమాచారం ఇవ్వవల్సిందిగా కోరారు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయ న్నారు. ఈ దాడుల్లో శ్రీనివాస్ రెడ్డి మరియు సిఐ శ్రీనివాస్, ఎస్సై ప్రేమ్ కుమార్ రెడ్డి,తాండూర్ ఎస్సై రవికుమార్ మరియు పరిగి ఎస్ఐ సుతరీ, వికారాబాద్ ఎస్ఐ వీరాంజనేయలు సిబ్బంది హనుమంతు, రవి కిరణ్, విష్ణు హనుమంతు, మహేష్, రాధిక, భీమయ్య, రవికిశోర్, ఫరీద్, నర్సింలు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో రెండో విడత పోలింగ్‌లో 84.15% నమోదు

- కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన
- ప్రశాంత వాతావరణంలో ఓటింగ్
- 94,807 మంది ఓటర్లు హక్కు వినియోగం
- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు సూచనలు




గోదావరిఖని, జనంసాక్షి : గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పెద్దపల్లి జిల్లాలో రెండో విడతలో 84.15 శాతం పోలింగ్ నమోదైంది. ఆదివారం జరిగిన రెండో విడత పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్మారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ దొంగతుర్తి, జడ్పీహెచ్ఎస్ మేడారం, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ధర్మారం, జడ్పీహెచ్ఎస్ ధర్మారం, పాలకుర్తి మండలంలోని జడ్పీహెచ్ఎస్ కుక్కలగూడూరు, జడ్పీహెచ్ఎస్ ఈసాల తక్కలపల్లి, జడ్పీహెచ్ఎస్ పాలకుర్తి, జడ్పీహెచ్ఎస్ బసంత్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రాలను, అంతర్గాం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరుగుతున్న నాలుగు మండలాల పరిధిలో 84.15 శాతం పోలింగ్ నమోదైందని, 94 వేల 807 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. రిసెప్షన్ కౌంటర్‌లో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. ఎన్నికల రిపోర్టింగ్ సకాలంలో అందించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎన్నికల్లో ప్రతి అంశం పారదర్శకంగా జరగాలని, ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ పర్యటనలో జడ్పీ సీఈవో నరేందర్, పెద్దపల్లి ఆర్‌డీవో బి.గంగయ్య, తహసీల్దార్లు శ్రీనివాస్, సునీత, ఎంపీడీవోలు ప్రవీణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలదారుడు సుదర్శన్ రెడ్డి ముందే కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ

- కాంగ్రెస్ ద్రోహులు గో బ్యాక్ అంటూ నినాదాలు



**ఎడపల్లి, డిసెంబర్ 14 ( జనంసాక్షి ) :** పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థికి కాకుండా ఇతర పార్టీలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ ద్రోహులు గో బ్యాక్ అంటూ ఆదివారం జరిగిన సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలాదారుడు సుదర్శన్ రెడ్డి ముందే కాంగ్రెస్ నాయకులు బాహబాహీకి దిగారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో పార్టీకి పనిచేయలేదంటూ అక్కడికి వచ్చిన ఓ నాయకుడిపై కాంగ్రెస్ నాయకులు ధూర్భాషలాడడంతోపాటు కాంగ్రెస్ ద్రోహులు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. బూతు మాటలు తిడుతూ సదరు నాయకుడిపై దాడి చేసే ప్రయత్నం చేయగా వెంటనే స్పందించిన బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులను సముదాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, గత పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకు ఎవరు చేశారో.. ఎవరు చేయలేదో.. ప్రతి గ్రామం నుండి నివేదికను తీసుకున్నానని స్పష్టం చేశారు. త్వరలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని సుదర్శన్ రెడ్డి హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నినాదాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో జరిగిన ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఇరువర్గాల నాయకులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముందే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.

ఇటీవల గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఇద్దరు అభ్యర్థులు నిలబడగా అందులో ఒకరు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు ఉన్నారు. అయితే ఇటీవల పార్టీలో చేరిన వారు గ్రామంలో సర్పంచ్‌గా విజయం సాధించడంతో బరిలో దిగి ఓడిపోయిన మరో ప్రతినిధి వర్గీయులు ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డిని కలవకుండా అడ్డుకోవడంతో గలాట జరిగింది. వారిని సైతం సుదర్శన్ రెడ్డి సముదాయించి కార్యక్రమాన్ని ముగించుకొని వెళ్లిపోయారు.

## కాప్రా నాలా పక్కన బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణం

### ఇరిగేషన్ అధికారులు ఎక్కడ?




**కాప్రా డిసెంబర్ 14 (జనంసాక్షి) :** కాప్రా మండల పరిధిలోని రాధిక దమ్మాయిగూడ ప్రధాన రహదారి గణేష్ టెంపుల్ దగ్గరలో నాలాకు ఆనుకుని అక్రమ నిర్మాణం చేపడుతున్నారని పిర్యాదులు వెల్లువెత్తడంతో స్పందించిన కాప్రా మండల ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ రెవెన్యూ అధికారులతో సందర్శించి ఇది ముమ్మాటికీ అక్రమ నిర్మాణమని తేల్చి పనులు ఆపాలని నిర్మాణదారుడిని హెచ్చరించి పనులు పూర్తిగా నిలిపివేసినా లెక్కచేయని భవన నిర్మాణ దారులు, గుట్టు చప్పుడు కాకుండా ఆదివారం సెలవు దినాలలో లేదంటే రాత్రిపూట, ఉదయం పూట పనులు కానిస్తున్న వైనం, వెంటనే అక్రమ నిర్మాణ దారుడిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు, సోషల్ వర్కర్లు, స్థానికులు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, హైడ్రా అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



## కౌకుంట్లలో ఓటు వేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

చేవెళ్ల, డిసెంబరు 14 (జనంసాక్షి) పంచాయతీ ఎన్నికల్లో భాగంగా చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో కౌకుంట్లకు వెళ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ ఓటు వేశారు. కోకుంట్ల గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి బార్లపల్లి మల్లా రెడ్డి గెలుపొందారు.



## చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**కాప్రా, డిసెంబర్ 14 (జనం సాక్షి) :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని బిఎన్ రెడ్డి కాలనీ వాసులు వివిధ పార్టీ నాయకులు,కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పెద్దఎత్తున స్టాండింగ్ కమిటీ మెంబెర్ చెర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆధ్వర్యంలో నగర మాజీ మేయర్ చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ బొంతు రామ్మోహన్ సమక్షంలోప్రముఖపారిశ్రామికవేత్త బిఎన్‌రెడ్డి కాలనీ అధ్యక్షులు దామోదర చారి దాదాపు 200 మంది తో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ అధ్యక్ష కార్యదర్శి సింగిరెడ్డి వెంకట్ రెడ్డి,బొడిగే ప్రభు గౌడ్,సీనియర్ నాయకులు సీతా రామ్ రెడ్డి, గడ్డం యాదగిరి శ్రవణ్ కుమార్, రాజు గౌడ్, సదానంద్, సంకర్, కేవీ, ఎల్ ఎన్ రావు, ఆనంద్ రాజు గౌడ్, గోపాల్ యాదవ్, రఘు గౌడ్, ముత్యాలు, వెంకట్ రెడ్డి, నజీర్, నీరజ రెడ్డి, లక్ష్మి, జ్యోతి, కొండల్‌రావు, గోపాల్ రెడ్డి, దామోదర్ చౌదరి, సత్య నార్యణ, వెంకట్ గౌడ్, క్రాంతి, శామ్, కుమార్, సంధ్య, రామారెడ్డి, మున్ని, తదితరులు పాల్గొన్నారు.



# వేరుశనగకు సమయం ఇదే!!

**పొగాకు లద్దె పురుగు:**
ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలు పెట్టి ఉనికిని గమనించాలి. ఏరా పంటలుగా 30-40 ఆముదం లేదా పొద్దుతిరుగుడు మొక్కలు వేయాలి. ఎకరాకు 10 పక్షి ఆశ్రయ స్థానాలు ఏర్పాటు చేయాలి. ఎక్కువ నష్టం ఉంటే నోవాలురాన్ 1 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ.ని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:**
మొక్కలకు వైరస్ తెగులు సంక్రమిస్తాయి. ఎక్కువైతే ఆకులు ముడుచుకు పోతాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. వేప నూనె 5 మి.లీ. పొడి 5 గ్రా.ని లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.



నవాబుపేట్, నవంబర్ 15 (జనం సాక్షి): నవాబుపేట్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వేరుశనగ సాగుకు ఇప్పుడే సమయం ఆసన్నమైంది. రబీ సీజన్‌లో విత్తనాలు వేయవచ్చని మండల వ్యవసాయ అధికారి జ్యోతి తెలిపారు. వేరుశనగ నూనె గింజల పంటల్లో ముఖ్యమైనది కాగా, సరైన మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు.
అధిక దిగుబడి ఇచ్చే రకాలుగా కదిరి-6, హరితంద్ర (కదిరి హరితంద్ర), ధరణి, జెఎన్‌జి, కదిరి-9, జెసిజి-88 వంటివి అనుకూలమని అధికారి జ్యోతి పేర్కొన్నారు. విత్తన శుద్ధి చాలా ముఖ్యం. లోతు డొక్కులు వేయడం ద్వారా కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చు. రబీలో ఎకరానికి 75 కేజీల విత్తనం సరిపోతుంది. విత్తన శుద్ధి లేకపోతే మొలకెత్తే శాతం తగ్గడమే కాక, చీడపీడల బారిన పడి పంటకు అధిక నష్టం జరుగుతుంది. ప్రధాన చీడపీడలు: ఎర్ర కొంగలు పురుగు, వేరు పురుగు, ఆకు ముడత పురుగు, పొగాకు లద్దె పురుగు, రసం పీల్చే పురుగులు (తామర పురుగు, పేను బంకు, పచ్చ దోమ) పంటను నాశనం చేస్తాయి.



**వేరు పురుగు నివారణ:**
విత్తేముందు డొక్కలో ఫోరేట్ 10% గుళికలు ఎకరాకు 6 కేజీలు వేయాలి. అలాగే 1 కేజీ విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ లేదా క్లోర్‌పైరిఫాస్ 6.5 మి.లీ.తో శుద్ధి చేయాలి.

**ఆకు ముడత పురుగు:**
విత్తిన 15 రోజుల నుంచి ఆశిస్తుంది. ఈ పురుగు 2-3 ఆకులను కలిపి గూడు చేసి పచ్చదనాన్ని తింటుంది. నివారణకు ఎకరాకు ఇండోక్సాకార్బ్ 1.5 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 40 మి.లీ. లేదా క్లోర్‌పైరిఫాస్ 500 మి.లీ.ని 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి.

**పేను బంకు:**
లేత ఆకులు, కొమ్మల చివర్లు, పూత దశలో రసం పీలుస్తాయి. తేనె వంటి జిగురు స్రవించి నల్ల బూజు ఏర్పడుతుంది. డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ.ని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పచ్చ దోమ:**
ఆకు అడుగుభాగంలో రసం పీల్చి ఆకులు పసుపు రంగులోకి మారి వాడిపోతాయి. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ.తో పిచికారి చేయాలి. ఎరువుల వినియోగంతో పాటు నిపుణుల సలహా తీసుకుంటే మంచి దిగుబడి సాధ్యమని వ్యవసాయ అధికారి జ్యోతి సూచించారు. స్థానిక రైతులు ఈ సలహాలను అనుసరిస్తూ వేరుశనగ సాగును ముమ్మరం చేస్తున్నారు.

## లోతుకుంటలో 145వ వారం జ్ఞానమాల



**అల్వాల్, డిసెంబర్ 14(జనంసాక్షి):** లోతుకుంట, ఆల్వాల్‌లోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద 145వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జై భీమ్ టు వన్ అండ్ ఆల్ నినాదాలతో జరిగిన ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలావతి (బౌద్ధ మత అనుచరులు), సువర్ణ (జర్నలిస్ట్) పాల్గొని డా.అంబేడ్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలు, హక్కుల పరిరక్షణపై ప్రసంగించారు. ఈ సందర్భంగా 'డా.బి.ఆర్. అంబేడ్కర్ మిషన్' పేరుతో కొత్త కమిటీని లోతుకుంట పరిధిలో ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కమిటీకి అనంతరాజ్ నేతృత్వం వహించనుండగా, రమేశ్ కమల సలహాదారులుగా వ్యవహరిస్తారని వెల్లడించారు. రాజ్యాంగ పరిరక్షణ, చట్టపరమైన హక్కుల అమలే మిషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## గొల్లపల్లిలో ఓటు వేసిన ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**చేవెళ్ల, డిసెంబరు 14 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం తన కుమారులతో కలిసి గొల్లపల్లి పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటును బాధ్యతగా వినియోగించుకోవాలన్నారు.



## కరెంట్ షాక్‌తో ఆవు మృతి

ఛిగరుమామిడి డిసెంబర్ జనం సాక్షి14(జనం సాక్షి): రామంచ గ్రామం లో ఈరవేణి రాజు అనే రైతు గత కొద్దీ సంవత్సరాలుగా పాల మిదనే జీవనం కొనసాగిస్తున్నాడు ప్రమాదావాషత్తు ఆవు కరెంట్ షాక్ గుర్తై చనిపోయింది. రోజు ఎప్పటిలాగానే టైంకి పశువులను వదిలాడు ఆవు కాస్త గేంతుతూ అక్కడున్న ట్రన్స ఫార్మర్ వైపు ప్పారుగేట్టింది అక్కడా ట్రాన్సఫార్మర్ కింద ఉండడంతో ఆవు కరెంట్ తీగకు తాకి అక్కడికక్కడే చనిపోయింది. ఈరవేణి రాజు కుటుంబం తను ఇచ్చే పాలమీద బతుకు తున్నాం అని ఏడువ సాగరు. ఇక్కడ ప్రమాదకరంగా ఉందని ఎన్నోసార్లు కంప్లీట్ ఇచ్చిన అధికారులు పట్టించుకోలేదు అని రైతులు అన్నారు ఇలాంటివి గ్రామంలో ఇంకా ఉన్నాయి ఇలాంటి ప్రమాదాలు జరుగక ముందే తగు జాగ్రత్తలు తీసుకోని తీగలు అందుకుండ పైకి ఉండేలా చూడాలని రైతులు అన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన పిల్లోనిగూడ నూతన సర్పంచ్ బృందం

**రాజేంద్రనగర్, డిసెంబర్ 14 (జనం సాక్షి):**
రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పిల్లోనిగూడ గ్రామ నూతన సర్పంచ్ పానుగంటి స్వర్ణలత నరసింహ, ఉప సర్పంచ్ పిల్లి శ్రీశైలం ముదిరాజ్‌లు ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ నీరటి తన్విరాజ్ ఆధ్వర్యంలో నూతన సర్పంచ్ బృందం ఎమ్మెల్యేని మర్యాద నిమిత్తం కలుసుకున్నారు. గ్రామాభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా బోర్డు సభ్యులు పి.శిరీషకృష్ణ, కె. శ్యామల మహే ష్, పార్టీ నాయకులు కే. నరసింహ, జుర్కి రమేష్ పటేల్, చిలకమర్రి మహేందర్, పి. సుధాకర్,మల్లేష్, శ్రీరాములు,బాలు పాల్గొన్నారు.

# ఇథనాల్ వ్యతిరేక అభ్యర్థికి ఘన విజయం

## 657 ఓట్ల భారీ మెజార్టీతో నరసింహులు నారాయణమ్మ

- ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ మద్దతుతో సర్పంచ్ పీఠం
- గ్రామస్థుల ఆనందోత్సవాలు, కొత్త అభివృద్ధి శకానికి నాంది



**పెద్ద ధన్వాడ డిసెంబర్ 14 (జనం సాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ బలపరచిన అభ్యర్థి నరసింహులు నారాయణమ్మ ఘన విజయం సాధించారు. ప్రత్యర్థిని 657 ఓట్ల భారీ మెజార్టీతో ఓడించి సర్పంచ్ పీఠాన్ని అధిష్ఠించిన ఆమెకు గ్రామస్థులు బ్రహ్మాండమైన మద్దతు అందించారు. గ్రామ శివార్లలో ప్రతిపాదిత ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి ఈ విజయం బలమైన ప్రజాభిమాన సాక్ష్యంగా నిలిచింది. గతంలో ఈ పోరాటంలో భాగంగా 42 మంది రైతులపై కేసులు నమోదు కాగా, నరసింహులు కూడా 14 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్నారు. దీంతో గ్రామస్థులు నారాయణమ్మను భారీ మెజార్టీతో గెలిపించడం ఈ పోరాటానికి లభించిన ప్రజాదరణకు నిదర్శనం. ఫలితాలు వెలువడిన వెంటనే గ్రామమంతా సంబురాలమయమైంది. ఇథనాల్ వ్యతిరేక కమిటీ మద్దతుదారులు, అభిమానులు ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. ఈ విజయం పెద్ద ధన్వాడకు కొత్త అభివృద్ధి శకాన్ని తీసుకొస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధి పనులు చేపడ్తామని కొత్తగా ఎన్నికైన సర్పంచ్ నరసింహులు నారాయణమ్మ హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలపై జనభావాలను ప్రతిబింబించే ఈ ఫలితం ప్రజాభిప్రాయ సూచికగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## మొయినాబాద్ మండలంలో పంచాయతీ పోలింగ్ ప్రశాంతం





- రెండో విడత ఎన్నికలు సజావుగా సాగాయి
- 85 శాతం పోలింగ్ నమోదు
- గెలుపు ర్యాలీలతో గ్రామాలు ఉరకలు
- టపాసులు, బ్యాండ్ మేళాలతో ఉత్సవ వాతావరణం

**మొయినాబాద్, డిసెంబర్ 14 (జనం సాక్షి):** మొయినాబాద్ మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఆదివారం 19 గ్రామాల్లో పూర్తిగా ప్రశాంతంగా జరిగి ముగిసింది. రెవెన్యూ, పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించడంతో ఎక్కడా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకోలేదు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో చంద్రకళ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు. మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్, సీఐ పవన్ కుమార్ రెడ్డి నేతృత్వంలో అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసింది. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో సుమారు 85 శాతం పోలింగ్ నమోదు కాగా, మొత్తం 30,250 ఓటర్లలో దాదాపు 25 వేల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల అనంతరం వార్డు సభ్యులు ఉప సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే గెలుపొందిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు.
టపాసుల మోత, బ్యాండ్ మేళాలు, డోలు మోతలతో గ్రామాలన్నీ ఉత్సవ వాతావరణంలో మునిగిపోయాయి. గెలుపు ఊరేగింపుల్లో ఓటర్లు పాల్గొని విజయవంతులను సన్మానించారు. ఎతుమార్ రూపల్లి గ్రామంలో సర్పంచ్‌గా ఎన్నికైన ప్రవీణ్ రెడ్డిని గ్రామస్థులు భుజాలపై ఎత్తుకొని ర్యాలీ తీశారు. మిగతా గ్రామాల్లోనూ ఇదే ఉత్సాహం కనిపించింది. గెలుపొందిన నాయకులు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.




## తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కోట్ల కాశిరావు పూజరి రమేశలు ఏకగ్రీవంగా ఎన్నిక

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 14(జనం సాక్షి) :** తపస్ రంగారెడ్డి జిల్లా కార్యనిర్వక వర్గ సమావేశంలో జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశిరావు, పూజరి రమేశలను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంకు ఎన్నికల అధికారులుగా కర్రె జనార్ధన్, చంద్రం, ముఖ్య అతిథిగా తపస్ రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతరావు, రాష్ట్ర బాధ్యులు శ్రీహరి కృష్ణ, యుగంధర్ రెడ్డి, విద్యావతి, మహిళ కన్వీనర్ వనం సుమారంజిత, జిల్లా బాధ్యులు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిషేధం: జిల్లా ఎస్పీ






**నవాబుపేట్,డిసెంబర్. 14( జనం సాక్షి) :**
పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్ గ్రామాలైన ఏక్‌మామిడి, అర్కతల, చిట్టిగిద్ద గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఫేస్-2 ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు, ఇతర వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ( ఎంసి సి) అమలులో ఉన్నంతకాలం ఈ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని, నిబంధనలను అతిక్రమించిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు, నాయకులు మరియు అభ్యర్థులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ వికారాబాద్ డిటి డిఎస్పి శ్రీనివాస్, నవాబుపేట్ ఎస్పెపుండ్లిక్ ఎలక్షన్ రిటర్నింగ్ మండల అధికారి అనురాధ, కోరారు.

## కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయి

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి

**మహేశ్వరం,డిసెంబర్14(జనం సాక్షి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్ ముదిరాజ్ ను భారీ మోజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందన్నారు. మహేశ్వరం మండలంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా మారిందన్నారు. మహేశ్వరం గ్రామ ప్రజలందరూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి కాకి ఈశ్వర్ ముదిరాజ్ ను భారీ మోజార్టీతో గెలిపించాలన్నారు.

## పీసీఐ మేనేజింగ్ కమిటీ మెంబర్‌గా

# రెండోసారి పబ్బ సురేశ్‌బాబు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ) తన తొలి మహిళా అధ్యక్షురాలిగా ఆదివారం సంగీతా బరూవా పిషారోటిని ఎన్నుకుంది. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రయాణంలో లింగ సమానత్వం, సమ్మిళిత నాయకత్వం దిశగా ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. డిసెంబర్ 13న జరిగిన ఎన్నికల్లో పిషారోటి బృందం కార్యనిర్వాహక, మేనేజింగ్ కమిటీలోని అన్ని పదవులను కైవసం చేసుకుంది. 21-0 తేడాతో ఘన విజయం సాధించింది. పిషారోటి 1,019 ఓట్లతో నిర్ణయాత్మక విజయం సాధించగా, ఆమె ప్రత్యర్థులు కేవలం అతుల్ మిశ్రా 129 ఓట్లు, అరుణ్ శర్మ 89 ఓట్లు పొందారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీపడ్డ అఫ్జల్ ఇమామ్ సునాయాసంగా విజయం సాధించారు. అఫ్జల్ ఇమామ్‌కు 948 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి జ్ఞాన్ ప్రకాష్‌కు కేవలం 290 ఓట్లు వచ్చాయి. పీసీఐ మేనేజింగ్ కమిటీ మెంబర్‌గా రెండోసారి తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన పబ్బ సురేశ్ బాబు ఎన్నికయ్యారు. ఫలితాల అనంతరం సురేశ్ మీడియాతో మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న ప్యానెల్ దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం పార్లమెంట్ వేదికగా పోరాడుతుందని చెప్పారు. జర్నలిస్ట్‌లపై ఎలాంటి దాడులు, సంఘటనలు జరిగినా ఖండించిడంతో పాటు.. వారికి న్యాయం చేకూర్చడంలో ముందుంది అన్నారు. ఇకపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల వాయిస్ వినిపించేందుకు తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. తన గెలుపుకోసం సహకరించి ఓట్లతో మద్దతు తెలిపిన పీసీఐ మెంబర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన జతిన్ గాంధీ 1,029 ఓట్లు సాధించి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ప్రహ్లాద్ సింగ్ రాజ్‌పుత్‌పై 900 ఓట్లకు పైగా మెజారిటీతో గెలుపొందారు. అదితి రాజ్‌పుత్ (కోశాధికారి), పిఆర్ సునీల్ (సంయుక్త కార్యదర్శి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీసీఐ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంఎంసి శర్మ, అతని బృందం సాయంత్రం పీసీఐ ప్రాంగణంలో విలేకరులతో ఫలితాలను ప్రకటించారు. 16 మంది సభ్యుల మేనేజింగ్ కమిటీ ఎన్నికలలో, నీరజ్ కుమార్ 932 ఓట్లతో అగ్రస్థానంలో నిలిచారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా సభ్యుల నమ్మకం, మద్దతుకు పదవీ విరమణ అధ్యక్షుడు గౌతమ్ లాహిరి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బృందం క్లబ్‌ను మరింత కలుపుకొని, అన్ని అంశాలు, సమస్యలకు ప్రతిస్పందించేలా, భారతదేశంలో నేడు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో కొనసాగుతుందని ఆయన ఆశించారు. "ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, దాని ప్రారంభం నుండి, దేశవ్యాప్తంగా, విదేశాల నుండి వచ్చిన జర్నలిస్టులకు ఒక ముఖ్యమైన సంస్థగా పనిచేసింది. దాని మొదటి మహిళా అధ్యక్షురాలి ఎన్నిక పురోగతికి శక్తివంతమైన చిహ్నంగా, సమానత్వం, వైవిధ్యం, ప్రజాస్వామ్య విలువల పట్ల క్లబ్‌కు ఉన్న అంకితభావాన్ని పునరుద్ఘాటిస్తుంది" అని పిసిఐ పదవీ విరమణ కార్యదర్శి నీరజ్ ఠాకూర్ అన్నారు.

# వరంగల్ జిల్లాలో 88.11శాతం పోలింగ్

- **జిల్లాలోని ప్రశాంతంగా పోలింగ్.. ఎన్నికల ఫలితాలు..**
- **కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులదే హవా**
- **మొదటిసారిగా ఓటెత్తిన యువకులు**



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 14 (జనంసాక్షి):** పంచాయితీ సంగ్రామంలో భాగంగా రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో వరంగల్ జిల్లాలోని నాలుగు మండలాల్లో పంచాయతీ ఎన్నికలు 88.11శాతం ఓటింగ్ శాతం నమోదు కాదా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి ప్రశాంత వాతావరణంలో హరిత కేంద్రాల ద్వారా జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించారు. రెండో విడతలో భాగంగా వరంగల్ జిల్లాలోని దుగ్గొండి, నల్లబెల్లి గీసుకొండ, సంగెం మండలాలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారులు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు బాలమయా దేవి పకడ్బందీ ప్రణాళికతో వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణలో అధికారులు చర్యలు చేపట్టి సమస్యాత్మక గ్రామాలుగా ఉన్న వాటిని గుర్తించి ముందస్తు ప్రణాళికతో భారీ బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించారు గీసుకొండ మండలంలో 27 వేల 477 ఉండగా 23 వేల 584 ఓట్లు పోలయినాయి. గీసుగొండలో 85. 83% ఓట్లు నమోదయ్యాయి. దుగ్గొండి మండలంలో 36వేల 514 కోట్లు ఉండగా 32 వేల 818 పోలయినాయి. 89శాతం ఓట్లు నమోదు అయ్యాయి. నల్లబెల్లి మండలంలో 31వేల 664 ఓట్లు ఉండగా 27 వేల 344 ఓట్లు పోలైనాయి 86శాతం ఓట్లు నమోదయ్యాయి. సంగెం మండలంలో 40వేల 536 ఓట్లు ఉండగా 36వేల 255 ఓట్లు నమోదు అవ్వగా 89శాతం ఓట్లు పోలైనాయి. అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమీక్షంలో కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. గురువారం. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించారు. 1 గంట వరకు పోలింగ్ కేంద్రం క్యూ లైన్ లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతి ఇచ్చారు. పోలింగ్ ముగియడంతో ఫలితాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని రెండు గంటలకు ప్రారంభించారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో గ్రీన్ పోలిక్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నాలుగు మండలాల్లోని సర్పంచ్ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులదే విజయ ఢంకా మోగించారు. ఈ ఎన్నికల్లో వికలాంగులు, వృద్ధులు స్వేచ్ఛపూరిత వాతావరణం లో తమ ఓటు హక్కును వినియోగించు కొన్నారు. పలు గ్రామాలలో యువత ఓటు హక్కు సద్వినియోగం చేసుకొని గెలుపు అభ్యర్థుల గురించి చర్చించుకోవడం మొదలుపెట్టారు. గెలుపు గుర్రాలపై వార్డు మెంబర్లు, సర్పంచ్ అభ్యర్థుల ఫలితాలు ఎన్నికలు అధికారుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల వారీగా ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించి సర్పంచ్ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగర్తగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా నిర్వహించడంతో జిల్లా అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో 8 హరిత పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయదా? సెల్ఫీ ఫైన్ లను కూడా ఏర్పాటు చేశారు సెల్ఫీ పాయింట్లు దగ్గర యువత ఓటర్లు నిలబడి ఎంతో ఉత్సాహంగా ఫోటోలు దిగారు. జిల్లాలో కొత్త ఓటర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో జిల్లా అధికారులు వివిధ పార్టీల నాయకులు అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో ఎన్నికల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. రెండో విడతలో మొదట ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై 10 గంటల వరకు మందకొండ కొనసాగిన పోలింగ్ 12 గంటల వరకు ఓటింగ్ పుంజుకొని 80% నమోదు కావడం గ్రామీణ ప్రాంత ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్

- **హైదరాబాద్‌లో వారాంతంలో పట్టుబడిన 850 మందికి పైగా వాహనదారులు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వీకెండ్ లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 850 మందికి పైగా పట్టుబడినట్లు ఆదివారం పోలీసులు వెల్లడించారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 460 మందిని పట్టుకున్నారు. వీరిలో 350 మంది ద్విచక్ర వాహనదారులు, 25 మంది ఆటో డ్రైవర్లు, 85 మంది కార్ల డ్రైవర్లు ఉన్నారు. ఇక సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రైవ్‌లో 407 మంది పట్టుబడ్డారు. వీరిలో 290 మంది ద్విచక్ర వాహనదారులు, 90 మంది కార్ డ్రైవర్లు, 18 మంది ఆటో డ్రైవర్లు, 9 మంది భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. డ్రంక్ డ్రైవింగ్ విషయంలో ఏమాత్రం సహించేది లేదని, ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. గత వారం (డిసెంబర్ 8-13) సైబరాబాద్ పరిధిలో 385 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు విచారించగా... 16 మందికి జైలు శిక్ష, జరిమానా విధించాయి. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

# ఆర్టీసీ ప్రయివేటీకరణకు కుట్ర

- **ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే ప్రయివేటు పరం**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత హైదరాబాద్‌లో బస్సుల సంఖ్యను 7500 నుంచి 3500కు తగ్గించారని కవిత ఆరోపించారు. కోటి మందికి పైగా జనాభా ఉన్న నగరంలో బస్సులు తగ్గించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ప్రజా రవాణా వ్యవస్థ లేకుండా హైదరాబాద్‌ను విశ్వనగరంగా ఎలా అభివృద్ధి చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అక్టోబర్ 25 నుంచి 'జనంబాట' పేరుతో తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు కవిత వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, పారిశుద్ధ్య కార్మికుల కొరతతో చెత్త పేరుకుపోతోందని కవిత అన్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులతో పాటు, అంబర్‌పేట-ముషీరాబాద్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. నగర ప్రజలకు కొండపోచమ్మ సాగర్ నుంచి తాగునీరు అందించాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆమె కోరారు.

# ఫిట్టెస్ట్ సీఎం రేవంత్‌రెడ్డి

- **రేవంత్ రెడ్డి ఫిట్‌నెస్‌పై సోదరుడు కొండల్ రెడ్డి ప్రశంసలు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత ఫిట్‌నెస్ ఉన్న ముఖ్యమంత్రి అని ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డి ప్రశంసించారు. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో కలిసి సీఎం రేవంత్ హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ ఆడిన నేపథ్యంలో కొండల్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 56 ఏళ్ల వయసులోనూ తన సోదరుడు చూపించిన ఉత్సాహం, ఫిట్‌నెస్ అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 38 ఏళ్ల మెస్సీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ, గోల్స్ చేస్తూ మెస్సీతో సమానంగా అడుగులు కదిపారని కొండల్ రెడ్డి తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "ఇది నిజమైన స్ఫూర్తి. ఇలాంటి నాయకులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం ద్వారా దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తారు. నాయకులు ఫిట్‌నె స్‌కు ప్రాధాన్యం ఇస్తే, పౌరులు కూడా చురుగ్గా ఉండేందుకు, జీవనశైలి వ్యాధులతో పోరాడేం దుకు ప్రేరణ పొందుతారు. తద్వారా ఆరోగ్యకరమైన భారత్‌ను నిర్మించవచ్చు" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఉత్సాహభరితమైన నాయకత్వానికి మరింత శక్తి చేకూరాలని కొండల్ రెడ్డి ఆకాంక్షించారు.



# పిపడ్‌పల్లి ఎన్నిక అనూహ్యం

- **ఆత్మహత్య చేసుకున్న సర్పంచ్ అభ్యర్థిదే గెలుపు**
- **ప్రచారానికి డబ్బుల్లేక ఆత్మహత్య చేసుకున్న రాజు**

**సంగారెడ్డి (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లాలోని పిపడ్‌పల్లి పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ఫలితం ఆశ్చర్యానికి గురి చేసింది. గ్రామస్తులు మరణించిన అభ్యర్థి రాజుకే పట్టం కట్టారు. ఈనెల 8వ తేదీన ఆత్మహత్య చేసుకున్న రాజు, ఆదివారం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఎన్నికల ఖర్చుల కోసం డబ్బు లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద ఘటన జరిగినప్పటికీ, గ్రామంలోని ఓటర్లు రాజుపై తమకున్న నమ్మకాన్ని, ఆయన పరిస్థితిపై తమ సానుభూతిని వ్యక్తం చేస్తూ, మరణానంతరం కూడా ఆయన్నే సర్పంచ్‌గా ఎన్నుకోవడం భావోద్వేగభరితంగా మారింది. పిపడ్‌పల్లి గ్రామస్తుల ఈ నిర్ణయం, స్థానిక ఎన్నికల్లో డబ్బు ప్రభావం కంటే, అభ్యర్థి పట్ల ప్రజలకు ఉన్న ఆదరణే ముఖ్యమని మరోసారి నిరూపించింది. ఎన్నికల ప్రచారానికి, ఖర్చుల నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరులు లేవనే ఒత్తిడితో రాజు ఆత్మహత్య చేసుకోవడం, ఈ ఎన్నికల వ్యవస్థలోని ఆర్థికపరమైన సవాళ్లకు అద్దం పడుతోంది.

# స్కూల్‌కు రివాల్వర్ తెచ్చిన విద్యార్థి

- **ప్రధానోపాధ్యాయుడిని బెదిరింపు**

**భువనేశ్వర్ (జనంసాక్షి) :** ఒక విద్యార్థి స్కూల్‌కు రివాల్వర్ తెచ్చాడు. తనను తిట్టిన ప్రధానోపాధ్యాయుడ్ని ఆ గన్‌తో బెదిరించాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ బాలుడ్ని అదుపులోకి తీసుకున్నారు. రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొరువాలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 14 ఏళ్ల బాలుడు 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం దేశీయ రివాల్వర్‌ను స్కూల్‌కు తీసుకువచ్చాడు. క్లాస్‌రూమ్‌లో తనను తిట్టిన ప్రధానోపాధ్యాయుడు, టీచర్లను ఆ గన్‌తో బెదిరించాడు. ఈ సంఘటనతో వారు షాక్ అయ్యారు. హెడ్‌మాస్టార్ దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ స్కూల్‌కు చేరుకున్నారు. మైనర్ బాలుడ్ని అదుపులోకి తీసుకున్నారు. దేశీయ రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ బాలుడ్ని జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పర్చిన తర్వాత స్పెషల్ హోమ్‌కు తరలించారు. ఆ తుపాకీ బాలుడికి ఎలా వచ్చింది అన్నదానిపై అతడి తల్లిదండ్రులు, బంధువులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

# మెదక్ జిల్లాలో హైడ్రామా..


- **సానుభూతి ఓట్ల కోసం సర్పంచ్ అభ్యర్థి చనిపోయినట్లు నమ్మించిన భార్య**
- **డ్రోన్లు, జాగిలాలతో గాలించి పట్టుకున్న పోలీసులు**



**మెదక్ (జనంసాక్షి) :** మెదక్ జిల్లా చేగుంట మండలం గొల్లపల్లి గ్రామంలో హైడ్రామా చోటుచేసుకుంది. సర్పంచ్ అభ్యర్థి సబిత భర్త శనివారం రాత్రి అదృశ్యం అయ్యాడు. తన భర్తను ప్రత్యర్థులు కిడ్నాప్ చేసి హత్య చేశారని గ్రామంలో సబిత ప్రచారం చేశారు. తన భర్త కనిపించడం లేదంటూ సబిత పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్రోన్లు, జాగిలాలతో గాలించారు. చివరకు సబిత భర్త జనార్ధన్ రెడ్డిని పట్టుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం భార్యాభర్తలు సబిత, జనార్ధన్ రెడ్డి డ్రామా ఆడారని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. సానుభూతి ఓట్ల కోసం సబిత ఇలా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిన్న రాత్రి జనార్ధన్ రెడ్డి ప్రచారం చేస్తుండగా.. పోలీసులు వస్తున్నారనే విషయం తెలుసుకుని పరుగెత్తాడని డీఎస్పీ నరేందర్ గౌడ్ చెప్పారు. వరి చేన్లలో పరుగెత్తుతుండగా దెబ్బ తాకిందని, స్పృహ కోల్పోయానని జనార్ధన్ చెప్పినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనపై డీఎస్పీ సమగ్ర విచారణ చేస్తున్నారు.


# కవిత ఆరోపణల్లో నిజం లేదు

- **నేను వైఎస్ఆర్ వల్లే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చా**
- **కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపణల్లో నిజం లేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. తాను బీఆర్ఎస్‌ను వీడటానికి కారణం హరీశ్ రావు అంటూ గతంలో కవిత వ్యాఖ్యలు చేశారని ఈ విషయంలో కవిత చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. రాజకీయంగా తనకు హరీశ్ రావు ప్రత్యర్థి అని హరీశ్ రావుపై కోపంతో నేను కాంగ్రెస్ లోకి రాలేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కవిత ఇలాంటి ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఇవాళ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి.. తాను కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి కారణం వైఎస్సార్ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లోకి రావాలని నన్ను వైఎస్సార్ ఆహ్వానించారని చెప్పారు. సదాశివపేట మున్సిపల్ ఎన్నికల్లో నా పని తీరు నచ్చి రాజశేఖర్ రెడ్డి నన్ను పార్టీలోకి ఆహ్వానించారని తాను పార్టీలో చేరితే సంగారెడ్డి జిల్లాకు ఐఐటీ, ముంబై హైవేకు ఫోర్ వే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కేసీఆర్ కూతురు కాబట్టే కవిత లీడర్ అయ్యారని, కానీ నా విషయంలో కేసీఆర్ కూతురు రాంగ్ స్టేట్ మెంట్ ఇచ్చారని అన్నారు. మా జిల్లాల్లో భాగారెడ్డి, పి.రామచంద్రారెడ్డి వంటి తోపు లీడర్ల జిల్లా నుంచి వచ్చిన తోపునే నేను అన్నారు.

# డ్రాలో సర్పంచ్‌గా గెలిచింది



**మెదక్, డిసెంబర్ 14 (జనంసాక్షి) :** సర్పంచ్‌గా ఎన్నికై తమ తండాకు సేవ చేయాలని ఇద్దరు బరిలోకి దిగారు. అయితే కౌంటింగ్‌లో వారి మధ్య నువ్వా నేనా అన్నట్టుగా హొరాహొరీగా పోటీ సాగింది. ఫైనల్‌గా ఇద్దరికి సమానంగా ఓట్లు వచ్చాయి. దీంతో డ్రా తీయగా ఒకరిని సర్పంచ్ పదవి వరించింది. మెదక్ మండలం చీపురు దుబ్బ తండా గ్రామ పంచాయతీకి 377 ఓట్లు ఉండగా ఇద్దరికి సమంగా 367 ఓట్లు పోలు అయ్యాయి. అందులో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన కేతవత్ సునీత, బీఆర్ ఎస్ పార్టీ నుండి పోటీ చేసిన బిమిలికి ఇద్దరికి 182 సమానమైన ఓట్లు వచ్చాయి. అందులో రెండు ఓట్లు చెల్లని ఓట్లు పడగా ఒక్క ఓటు నోటాకు పడ్డది. దీంతో రిటర్నింగ్ అధికారి వెంకటయ్య డ్రా తీశాడు.. అందులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మహిళా అభ్యర్థి కేతవత్ సునీతకు విజయం వరించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370